వనితా మణి
గృహ నిర్వహణలో చిట్కాలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 171 పేజీలు: 10+4 వెల: 6.50

అయోధ్య సిట్‌ను
పునర్వ్యవస్థీకరించండి: సుప్రీంకోర్టు

డెంగ్యూ వ్యాక్సిన్
'క్యూడెంగా' రెడీ

5లో







ఢిల్లీలో పోటెత్తిన సిజెపి కార్యకర్తలు

ఆందోళనకారులపై బాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసులు

పోలీసుల లాఠీచార్జ్

## కాక్రోచ్ పార్టీ ర్యాలీ ఉద్రిక్తం

# అట్టుడికిన ఢిల్లీ

ఆందోళనకారులపై లాఠీఛార్జి, బాష్పవాయు ప్రయోగం

కార్యకర్తలను అదుపులోకి తీసుకొన్న పోలీసులు

సిజెపి ప్రతినిధులతో జెపి నడ్డా చర్చలు

దీక్షలు విరమించిన వాంగ్‌చుక్, అభిజిత్ దీప్కే

**న్యూఢిల్లీ,జులై 20:** పరీక్షల సంస్కరణలు, ప్రశ్నాపత్రాల లీకేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతాపార్టీ ఢిల్లీలో నిర్వహించిన సంసద్ చలో ర్యాలీ ఉద్రిక్తతల నడుమ కొనసాగింది. దాదాపు 20వేలమందికిపైగా వచ్చారని చెపుతున్న ఈ ర్యాలీకి ఎలాంటి అనుమతులు లేవని పోలీసులు స్పష్టంచేసారు. అంతేకాకుండా నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ర్యాలీ తీసారని పోలీసులు లాఠీ ఛార్జిచేయడంతో ఎక్కడికక్కడ ఆందోళన కారులు చెల్లాచెదురయ్యారు. మరోవైపు పార్లమెంటు స్ట్రీట్‌లోకి >>2

## ఉభయసభల్లో రభస

చర్చలు లేకుండానే నేటికి వాయిదా

నీట్ లీకేజ్, అయోధ్య విరాళాల చోరీపై విపక్ష సభ్యుల నిరసనలు



**న్యూఢిల్లీ,జులై 20:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజున ఉభయసభల్లో విపక్షాల నిరవధిక నిరసనలతో మారుమోగాయి. నీటిలీకేజిలపై సిజెపి నిరసనలు, అయోధ్య విరాళాల చోరీ వంటి వాటిపై ప్రత్యేక చర్చ జరపాలంటూ విపక్షాలు పట్టుబడుతూ రావడంతో పదేపదే వాయిదా పడుతూ వచ్చాయి. విపక్ష >>2

## ఉత్తరాంధ్ర మణిహారం భోగాపురం ఎయిర్‌పోర్టు

1న విమానాశ్రయంతోపాటు ఏవియేషన్ హబ్ వర్సిటీ, ఎడ్యుసిటీని ప్రారంభించనున్న ప్రధాని మోడీ

ఏర్పాట్లపై సమీక్ష జరిపిన సిఎం చంద్రబాబు

**విజయవాడ. జులై 20,ప్రభాతవార్తప్రతినిధి:** భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఆగస్టు 1 తేదీన ప్రధాని మోడీ చేతుల మీదుగా ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్షించారు ప్రధానిమోదీకి ఉత్తరాంధ్ర ప్రజల సంస్కృతీ, సంప్రదాయాలను తెలుపుతూ థింసా, సవర, కొమ్ము కోయ తదితర సంప్రదాయ నృత్య రూపాలతో ఘనస్వాగతం పలకాలని తెలిపారు. ఆగస్టు 1తేదీన విమానాశ్రయ పాసింజర్ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు, జీఎంఆర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్ యూనివర్సిటీతోపాటు జీఎంఆర్‌మాన్సాస్ ఎడ్యుసిటీలను ప్రధాని మోదీ లాంఛనంగా ఆవిష్కరిస్తారని అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర మణి హారంగా నిలవనున్న ఈ విమానాశ్రయం లాజిస్టిక్స్ కేంద్రంగా గ్లోబల్ కనెక్టివిటీని అందిస్తూ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఒక గేమ్ చేంజర్‌లా మారుతుందని సీఎం స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు, యజమానులను గౌరవించేలా వారికి ఒకమారు ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా బహిరంగ సభను నిర్వహించాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ స్లాట్లతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభకు వచ్చే వారి కోసం అల్పాహారం, భోజనం, తాగునీటి లాంటి సదుపాయాలు కల్పించాలన్నారు. రేపటి నుంచి జూలై 31 తేదీ వరకూ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం పై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సీఎం సూచించారు. అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ ప్రమోట్ చేస్తున్న అరకు కాఫీ బ్రాండింగ్ కూడా వేదికగా దీనిని మలచాలని సూచించారు. >>2


# 'ఆక్వా కల్చర్'ను ఆదుకోండి

సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతివ్వండి

అమరావతిలో ఎన్‌ఎఫ్‌డిబి ప్రాంతీయ కార్యాలయం అవసరం

ప్రాసెస్ చేయని పొగాకుపై జిఎస్టీ తగ్గించాలి

ముగ్గురు కేంద్ర మంత్రులకు వేర్వేరుగా సిఎం చంద్రబాబు లేఖలు



**విజయవాడ, జులై 20,ప్రభాతవార్తప్రతినిధి:** జన్యుపరంగా మార్పు చేసిన సోయాబీన్ మీల్ ను దిగుమతి చేసుకునేందుకు రొయ్యల మేత తయారీ దారులకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మత్స్య,పశుసంవర్ధకశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు లేఖ రాశారు. రొయ్యల మేత తయారీలో ప్రధాన ముడిసరుకైన సోయాబీన్ మీల్ ధరలు విపరీతంగా పెరగడంతో, మేత తయారీ ఖర్చులు పెరిగాయని వివరించారు. దీనివల్ల రొయ్యల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని సీఎం స్పష్టం చేశారు. దేశంలో రొయ్యల మేత కొరతను తీర్చేందుకు, ధరల నియంత్రణకు సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని కోరారు. 2021లోనూ రొయ్యల మేత తయారీదారులకు పరిమిత స్థాయిలో దిగుమతి చేసుకునేందుకు అనుమతులిచ్చారని లేఖలో పేర్కొన్నారు. ఈక్వెడార్ నుంచి పెరిగిన రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో దేశీయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అమెరికా, చైనా , యూరోప్ లాంటి ప్రధాన మార్కెట్లలో భారతీయ రొయ్యల ఎగుమతులు తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నాయని సీఎం తన లేఖలో వివరించారు. జన్యుమార్పిడి చేసిన సోయాబీన్‌ను వ్యవసాయానికి, విత్తన ఉత్పత్తికి వినియోగించే అవకాశం లేదని తద్వారా జీవ వైవిధ్యానికి దేశీయ వంగడాలకు ముప్పు లేదని సీఎం వివరించారు. ప్రభుత్వం సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇస్తే రొయ్యల మేత పరిశ్రమకు నాణ్యమైన ముడిసరుకు అందుబాటులోకి వస్తుందని సీఎం స్పష్టం చేశారు. లక్షలాది మంది రొయ్యల రైతులు, కార్మికులకు ఉపాధి కలుగుతుందని, తద్వారా విదేశీ మారకద్రవ్యం లభిస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతోపాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కార్యాలయం అమరావతిలో ఏర్పాటు చేయాలని సీఎం మరో లేఖలో మంత్రిని కోరారు. ఈ ఏడాది జూన్ 5 తేదీన విశాఖలో జరిగిన సీఫుడ్ ఎక్స్ పోర్ట్స్ వర్క్ షాప్ లో అమరావతిలో ఎన్‌ఎఫ్ డీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు అమరావతిలోని నెక్కల్లు గ్రామంలో 7.89ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్‌ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం, శిక్షణకేంద్రం, పార్క్, ప్రజల సందర్శనార్థం అక్వేరియం ఏర్పాటు కోసం కేటాయించామన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. 2028 నాటికల్లా ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణా కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుందన్నారు.

అక్వా కల్చర్ రంగాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. ఈక్వెడార్ నుంచి అమెరికా, చైనా, యూరోప్ లాంటి దేశాలకు ఎగుమతులు పెరగటంతో అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు గణనీయంగా పడిపోయాయని తెలిపారు. దేశంలో ఫిష్ మీల్ లభ్యతను క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య మంత్రిని సీఎం కోరారు. ప్రస్తుతం రొయ్యల ఫీడ్ లో ఉపయోగించే చేప పొడిని 5 శాతం ప్రోత్సాహకాలతో ఎగు మతికి అనుమతిస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. >>2



## త్రిపుర డిజిపి ఆత్మహత్య

తన ఛాంబర్‌లోనే తుపాకీతో కాల్చుకున్న వైనం

**అగర్తలా,జులై 20:** త్రిపుర రాష్ట్ర పోలీసు శాఖలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ), 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అనురాగ్ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. అగర్తలలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లోనే ఆయన తుపాకితో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. డీజీపీ అనురాగ్ తన కార్యాలయంలోని బాత్రూంలో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. హుటాహుటీన ఆయన్ను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, ఈ అఘాయిత్యానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై త్రిపుర ప్రభుత్వం కానీ, పోలీసు ఉన్నతాధికారులు కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి మాణిక్ సాహా వెంటనే పోలీసు హెడ్‌క్వార్టర్స్ కు చేరు కుని పరిస్థితిని సమీక్షించారు. >>2

## గర్భిణులు, నవజాత శిశువుల కోసం తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

అన్ని సౌకర్యాలతో త్వరలో 500 వాహనాలు రెడీ, యేటా దాదాపు 2.75 లక్షల మందికి ప్రయోజనం



సోమవారం తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ నూతన వాహనాలను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 20, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మాతా-శిశు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోన్న ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు మరింత నాణ్యమైన, సురక్షితమైన రవాణా సేవల్ని అందించేందుకు కొత్తగా తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను అందుబాటులోకి తెస్తోంది. ఈ వాహనాలను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం కోసం సిద్ధం చేసిన వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు,తల్లి-శిశువులకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు, వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఈ సేవలపై స్పష్టమైన అవగాహన కలిగేలా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన బ్రాండింగ్ డిజైన్లకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, వారి నవజాత శిశువులు, సహాయకులను ఉచితంగా వారి ఇళ్లకు చేర్చడంతో పాటు అధిక ప్రమాద గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు వచ్చే గర్భిణులకు ఈ వాహనాలతో రవాణా సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 500ప్రత్యేక ఎస్‌ఎవి/ఎంయువి వాహనాలను వినియోగించనున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 2.75 లక్షల మంది బాలింతలు ఈ సేవల ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

**రియల్ టైమ్ పర్యవేక్షణకు జీపీఎస్ వ్యవస్థ:** వాహనాల్లో తల్లీ-శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా సౌకర్యాలను కల్పించారు. వెనుక సీట్లలో సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కేందుకు ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి వాహనంలో జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణకు అవకాశం కల్పించారు. వాహనాల పరిశీలన సందర్భంగా అధికారులు >>2

## ట్రైనీ ఐపిఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం



జాతీయ పోలీసు అకాడెమీ నుంచి సస్పెన్షన్

అతడు సూసైడ్‌కు యత్నించలేదని వైద్యుల నివేదిక

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** లైంగిక వేధింపుల కేసులో నిందితుడుగా వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఉదంతంలో ట్విస్ట్ నెలకొంది. ఈ ఘటన వెలుగు చూసిన తరువాత అవమాన భారంతో ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అతని సోదరుడు వెంటనే ఆసుపత్రికి తరలిం చడంతో కోలుకుంటున్నాడు.ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కేంద్ర శిక్షణ వ్యవహారాల శాఖ (డిఓపిటి) దీని పై జాతీయ పోలీసు అకాడమి నుంచి అత్యవసరంగా నివేదిక తెప్పించుకున్నట్లు తెలిసింది. మరోవైపు ఎన్‌పిఎ అధికారులు ఉదయ్ కృష్ణారెడ్డిని అకాడమి నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీనిపై డిఓపిటికి వెంటనే నివేదిక పంపారని తెలిసింది. ఇంకోవైపు ఆత్మహత్యాయత్నానికి పా ల్పడ్డ ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ ద్వారా ఒక లేఖ విడుదల చేసినట్లు వార్తలు వస్తున్నాయి. మహిళా అధికారిణిని తాను వేధించలేదని, ఆమె తన గదికి వచ్చిందని, తనను ఇబ్బంది పెట్టిందని, దీనిపై తన వద్ద అన్ని ఆధారాలు వున్నాయని, ఈ విషయంలో తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, నిజాలు నిలకడగా బయటకు వస్తాయని అందులో వుంది. కాగా ఈ వాట్సాప్ లేఖపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దేశ వ్యాప్తం గా సంచలనం రేపిన జాతీయ పోలీసు అకాడమిలో ట్రైనీ >>2

## మునికూడలికి మోడల్ పుష్కర్ పంచాయతీ హంగులు: డి.సిఎం పవన్




**విజయవాడ.జులై20,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛగోదావరి -పవిత్ర పుష్కరాలు అనే థీమ్‌తో గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం మండలం పరిధిలోని మునికూడలిని మోడల్ పుష్కర్ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు సుమారు రూ.7 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. డీసీఎం పవన్ కల్యాణ్ నిరంతర పర్యవేక్షణలో ఈ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మునికూడలి గ్రామం మరియు సప్త ఋషి ఘాట్‌ను పర్యావరణహితంగా, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోంది. మునికూడలి మోడల్ పుష్కర్ పంచాయతీ పనుల పురోగతిపై సోమవారం >>2

## మద్యం టెండర్లలో రూ.192కోట్ల దోపిడి: సిట్

**విజయవాడ.జులై20.ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్లలో రూ.192 కోట్ల దోపిడీ జరిగిందని వాసుదేవరెడ్డి రిమాండ్ రిపోర్టులో సిట్ పేర్కొంది. ప్రభుత్వ అనుమతి లేకుండానే పక్కా ప్రణాళికతో టెండర్ల విధానాన్ని మార్చారని తెలిపింది. సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు బినామీ కంపెనీలను తెరపైకి తెచ్చారని వివరించింది. రవాణా ఛార్జీని కిలోమీటరుకు రూ.19.68 నుంచి రూ.35కు పెంచారని పేర్కొంది. టెండర్లు లేకుండానే సిగ్మా గడువును నాలుగుసార్లు పొడిగించారని, అప్పటి డిప్యూటీ సీఎం అభ్యంతరాలను కూడా బేఖాతరు చేశారని సిట్ వెల్లడించింది. షెల్ కంపెనీల ద్వారా నిధులు మళ్లించారని, వాసుదేవరెడ్డి బావమరిదికి చెందిన మిల్క్ కంపెనీకి అక్రమ సొమ్ము బదిలీ అయిందని తెలిపింది. దీనికి సంబంధించిన డిజిటల్, కాల్ డేటా ఆధారాలను సేకరించినట్లు వివరించింది.




సోమవారం ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజి గోపీనాథ్ జట్టి

# ప్రధాని పర్యటనకు భారీ భద్రత

## భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రానున్న మోడీ

### ఏర్పాట్లు పరిశీలించిన విశాఖ రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టి

**విజయనగరం, జులై 20 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విజ యన గరంజిల్లా భోగాపురం మండలంలోని అల్లూరి సీతారామరాజు ఇం టర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్స వానికి ఆగస్టు 1న విచ్చేస్తున్న సందర్భంగా క్షేత్రస్థాయిలో సభా వేదిక, పార్కింగ్, ప్రజా రవాణా, కాన్వాయ్ వెళ్లే మార్గాలను మరియు భద్రత, బందోబస్తు ఏర్పాట్లను విజయనగరం ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ మరియు ఇతర పోలీసు ఉన్నతాధికారులతో విశాఖపట్నం రేంజ్ ఐజిపి, గోపీనాథ్ జట్టి జూలై 20న పర్యవేక్షించి, అధికారులకు భద్రత పరమైన సూచనలు చేసారు. అనంతరం విశాఖపట్నం రేంజ్ ఐజిపి, గోపీనాథ్ జట్టి బందోబస్తు, భద్రత విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమై, నిర్వహిం చాల్సి న విధులు, తీసుకోవాల్సి న చర్యలు, జాగ్రత్తల గురించి వివరించారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ రూట్ మ్యాప్‌ను ప్రెజంటేషన్ ద్వారా పోలీసు అధికారులకు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, ప్రజా వేదికను సందర్శించి, నిర్మాణ పనులను, ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులకు విశాఖపట్నం రేంజ్ ఐజిపి, గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ పలుసూచనలు చేసారు. బందోబస్తును సెక్టార్లుగా విభజించి బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం రేంజ్ ఐజిపి, గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎస్పీ కే. మహేశ్వర రెడ్డి, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, విజయనగరం అదనపు ఎస్పీలు, డిఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అట్టుడికిన ఢిల్లీ

>> పెద్ద ఎత్తున సీజేపీ కార్యకర్తలు వచ్చి వర్షంలోనూ ఆందోళన కొనసాగించారు. ఈక్రమంలో వారిపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. పోలీసులపైకి ఆందోళనకారులు వాటర్ బాటిళ్లు, చెప్పులు విసిరారు. తోపులాటలో పోలీసులు, ఆందోళనకారులకు గాయాలయ్యాయి. దీనిపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. నిరాహార దీక్షను విరమించిన కొద్ది సేపటికే అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సీజేపీ తెలిపింది. అయితే అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకున్నారని వార్తలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. ఆ వార్తలు పూర్తిగా అవాస్తమని తెలిపారు. మరోవైపు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దారుణంగా దాడి చేస్తున్నారని, విద్యార్థులకు ఎంపీలు మద్దతు ఇవ్వాలని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ కోరారు. చర్చలకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా ఢిల్లీలో ఆందోళనల మధ్యే సీజేపీ ప్రతినిధులు కేంద్రమంత్రి జేపీ నడ్డాను కలిశారు. జేపీ నడ్డా ఆహ్వానం మేరకే ఆయన్ను కలిశామన్న సిజెపి ప్రతిని సౌరవ్ దాస్ తమ డిమాండ్లకు సంబంధించి వినతిపత్రం అందించామని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను తక్షణమే నిర్బంధం నుంచి విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశామన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని, ఆత్మహత్యలు చేసుకున్న నీట్ అభ్యర్థులకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరినట్లు సిజెపి ప్రతినిధులు తెలిపారు. ఈ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించేందుకు కొంత సమయం ఇవ్వాలని నడ్డా విజ్ఞప్తి చేశారని వివరించారు. మరోవైపు ఆందోళనలు విరమించి ఢిల్లీలో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు సహకరించాలని సిజెపి ప్రతినిధులను నడ్డా కోరారు.

**జెపినడ్డాతో సిజెపి ప్రతినిధుల చర్చలు:** కేంద్ర ఆరోగ్యమంత్రి జెపినడ్డాను కలిసి సిజెపి ప్రతినిధులు సౌరవ్‌దాస్ మరొకరు కలిసి చర్చలుజరిపారు. ప్రభుత్వం అంతర్గతంగా చర్చించి చర్యలు తీసుకునేందుకు శాయశక్తులా కృషిచేస్తామని మంత్రి సిజెపి ప్రతినిధులకు హామీ ఇచ్చారు. తమ ప్రధాన డిమాండ్లతోకూడిన పత్రాన్ని ఈసందర్భంగా సిజెపి ప్రతినిధులు కేంద్రమంత్రి నడ్డాకు అందచేసారు. ఆందోళన కారుల ప్రతినిధులనుంచి తమకు వినతిపత్రం అందిందని కూడా ఈసందర్భంగా మంత్రి నడ్డా సోషల్‌మీడియాలోప్రకటించారు. అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా కేంద్ర విద్యామంత్రి ధర్మేంప్రదాన్‌తో చర్చలుజరిపారు. సుదీర్ఘచర్చలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**మోడీసర్కార్‌పై ఖర్గే విమర్శలు:** విద్యార్థులపై లాఠీఛార్జ్‌ను ప్రజాస్వామ్యంపై దాడిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభివర్ణించారు. సమస్యనలను చెప్పుకోవడానికి వచ్చిన వారిపై దాడి చేయడం ప్రజాస్వామ్యం అనిపించుకోదని అన్నారు. పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, నీట్ ప్రశ్న పత్రంతో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యాయని తెలిపారు. అయోధ్యలో విరాళాల చోరీపై ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యత వహించాలని ఖర్గే డిమాండ్ చేశారు. విద్యా విధానంలో అనేక సమస్యలు ఉన్నాయని ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. వాటిపై చర్చ జరపకుండా విద్యార్థులపై ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ కూడా స్పందిస్తూ సీజేపీ నిరసనలపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతపై లాఠీఛార్జ్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. చర్చలకు ప్రభుత్వం నిరాకరించడం వల్లే ఈ ఆందోళనలు, అవాంతరాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో యువత తమ అసంతృప్తిని, కోపాన్ని వ్యక్తం చేయడానికి ఒక వేదిక ఉండాలని, ఆందోళనలను బలప్రయోగంతో అణచివేయడం సరికాదని ఆయన హితవు పలికారు.

**యువత డిమాండ్లు వినాలి : కేజ్రీవాల్**

ఈ ఘటనపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. లక్షలాది మంది యువత న్యాయం కోసం వీధుల్లోకి వస్తే వారి మాట వినాల్సిందిపోయి లాఠీచార్జ్‌కు ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం అహంకారాన్ని విడిచిపెట్టి యువత డిమాండ్లను వినాలని, ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడం, పార్లమెంట్ వైపు వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా నిరసనకారుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. యువత లేవనెత్తుతున్న అంశాలపై చర్చించి పరిష్కారం చూపాలని సూచించారు.

**దీక్ష విరమించిన వాంగ్‌ఛుక్**

మరోపక్క సఫ్దర్ జంగ్ ఆసుపత్రిలో చేరిన సోనమ్ వాంగ్‌ఛుక్ జెపినడ్డాను సిజెపి ప్రతినిధులు కలిసి డిమాండ్ల పత్రం ఇవ్వడంతో దీక్షను విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. అలాగే జంతర్‌మంతర్‌వద్ద ఆమరణ దీక్షకు ఉపక్రమించిన సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే కూడా తన దీక్షలను విరమిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతంచర్చలపరంగానీట్ వల్ల ఆత్మహత్యలపాలయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని, విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాచేయాలని ప్రధాన డిమాండ్లుగా వారు ఆరోగ్య మంత్రి జెపినడ్డాకు వినతిపత్రం ఇచ్చారు.




# రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిన భూముల రిజిస్ట్రేషన్లు

## దస్తావేజు లేఖరుల సమ్మె

**విజయవాడ,జులై 20 ప్రభాతవార్త:** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరులు ఆందోళన చేపట్టారు. సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని దస్తావేజు లేఖరులు నిర్ణయించి ఆందోళనలు చేపట్ట డంతో భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణకు ఊతమి స్తున్న జీవో నెంబర్ 369 ని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాల ప్రైవేటీకరణ వలన దస్తావేజు లేఖరుల ఉపాధి దెబ్బతినడంతో పాటుగా ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని వారు వాపోయారు. ఎంతో విలువైన ఆస్తుల దస్తావేజులు ప్రైవేటు వ్యక్తుల చేతు ల్లోకి వెళ్ళడం వలన ఆస్తి వివాదాలు, భూ కబ్జాలు అధికమై పోతాయని, భూ రికార్డుల తారుమారు చేయడానికి అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ చేస్తే సామాన్య ప్రజలకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరుగుతాయి. అవినీతి పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని దస్తావేజు లేఖరులు హెచ్చరించారు.

# ‘ఆక్వా కల్చర్’ను ఆదుకోండి

>> ఈ కారణంగా దేశీయ ఫీడ్ తయారీ దారులు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోం దన్నారు. డిజిఎఫ్‌టి ద్వారా ఎగుమ తులను నియంత్రించాలన్నారు. దేశీయ రొయ్యల ఫీడ్ తయారీ దారుల అవసరాలు తీరిన తర్వాతే ఎగుమతులకు అనుమతించాలని కోరారు. జీఎం సోయాబీన్ మీల్ దిగుమతికి కూడా అనుమతి ఇవ్వాలన్నారు.

ఏపీ నుంచి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని కేంద్ర మంత్రిని ముఖ్య మంత్రి కోరారు. లక్షలాది మంది రైతు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించేందుకు దోహదపడుతోందని సీఎం వెల్లడించారు. దేశంలోని పొగాకు ఉత్పత్తిలో ఎఫ్‌సీవీ పొగాకు 70శాతం మేర ఎగుమతి అవుతోందని సీఎం వెల్లడించారు. జింబాబ్వే, టాంజానియా లాంటి దేశాల్లోని ఎగుమతి దారులకు ఆయా దేశాలు రాయితీలు, సుంకాల మినహాయింపు ఇస్తున్నాయని తెలిపారు. భారతీయ పొగాకు ఎగుమతిదారులకు ఎలాంటి మద్దతు లేకపోవటంతో తీవ్రమైన పోటీ ఎదుర్కొం టున్నారని అన్నారు. ఆగస్టు 2021లో రోడ్‌టెప్ పథకం కింద టీ, కాఫీ, మసాలా దినుసులు లాంటి వ్యవసాయ వస్తువులను చేర్చినప్పటికీ... ప్రాసెస్ చేయని పొగాకును (హెచ్‌ఎస్ కోడ్ 2401) మాత్రం ఈ జాబితాలో చేర్చలేదన్నారు. తక్షణమే ప్రాసెస్ చేయని పొగాకు(హెచ్‌ఎస్ కోడ్ 24012401 10, 2401 20,2401 30) రకాలను ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో పాటు పథకం కింద ప్రయోజనాలు వర్తింపజేయాలని సీఎం కోరారు.

**కిసాన్ క్రెడిట్ కార్డుపై రూ.5 లక్షల టాప్ అప్ ఇవ్వండి:** ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకునేలా ఆక్వా కల్చర్ ఏరియేటర్లపై జీఎస్టీని 18నుంచి 5 శాతానికి తగ్గించాలని ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. కేంద్రమంత్రికి లేఖ రాసిన సీఎం భారత అమెరికా వాణిజ్య ఒప్పం దంతో ఆక్వా దిగుమతులపై సుంకం 10శాతానికి తగ్గినా ఇంకా చట్టపరమైన అనిశ్చితి కొనసాగుతోందని టారిఫ్ సంక్షోభంపై కేంద్ర ఆర్థికశాఖ జోక్యం చేసుకోవాలని సీఎం కోరారు.కిసాన్ క్రెడిట్‌కార్డు పై రూ. 5లక్షల వరకూ వన్ టైమ్‌టాప్‌అప్ ఇవ్వాలని సీఎం కేంద్ర ఆర్థికమంత్రికి విజ్ఞప్తి చేశారు. దేశీయ మార్కె టింగ్ కోసం ఎన్‌ఎఫ్‌డీబీ ద్వారా రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ను ఏర్పాటు చేయాలని సీఎం కోరారు.



సోమవారం అధికారులతో చర్చిస్తున్న సిఎం చంద్రబాబు

# గిరిజన సంఘాలతో ప్రభుత్వం త్వరలో చర్చలు: సిఎం చంద్రబాబు

## జోన్ 1లోకి అల్లూరి, జోన్ 2లోకి పోలవరం జిల్లా

**విజయవాడ జూలై 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని...ఈ విషయంలో గిరిజన ప్రజలు ఎటువంటి ఆందోళనకు, అనుమానాలకు గురి కావాల్సి న అవసరం లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఆ శాఖ అధికారులుతో సచివాలయంలో సోమవారం సమీక్ష చేశారు. జీవో నెంబర్ 3 పై గత ప్రభుత్వంలో సుప్రీంకోర్టు తీర్పు, తదనంతర పరిణామాలపై చర్చించారు. స్థానికులకే ఉద్యోగాలు దక్కడం సహా పలు అంశాలపై గిరిజన ప్రజల ఆకాంక్షలపైనా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో జీవో నెంబర్ 3 తీసుకువచ్చాం. దీని ద్వారా షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే 100 శాతం రిజర్వేషన్లు దక్కేలా చూశాం. దాదాపు 20 ఏళ్లు అమల్లో ఉన్న ఈ ఉత్తర్వును గత ప్రభుత్వం నిరక్ష్యం చేసింది. నాటి ప్రభుత్వం ఈ అంశంపై బలమైన వాదనలు వినిపించకపోకవడం వల్ల సుప్రీంకోర్టు 2020 ఏప్రిల్ 22న కొట్టేసింది. దీంతో రెండు దశాబ్దాల పాటు గిరిజనులు పొందిన ప్రయోజనాలు కొనసాగించే వీలు లేకుండా పోయింది. నాటి ప్రభుత్వం ఈ సమస్యపై కనీసం స్పందించలేదు. జీవో నెంబర్ 3కి ఉన్న అన్ని ప్రత్యామ్నాయ అవకాశాలను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. సుప్రీంకోర్టు 5గురు సభ్యుల ధర్మాసనం స్పష్టమైన తీర్పు నేపథ్యంలో ఏ విధంగా న్యాయం చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నాం.” అని అన్నారు. స్థానికులకే ఉద్యోగాలు అంశంతో పాటు...గిరిజనులకు సంబం తధించి పలు సమస్యలపై గిరిజన సంఘాలతో వెంటనే చర్చించాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై గిరిజన సంఘాలను ఆహ్వానించి...ఉన్నతాధికారులు, గిరిజన ప్రజా ప్రతినిధులు చర్చించాలని సూచించారు. అదే విధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్ 1లోకి మార్చాలని, పోలవరం జిల్లాను జోన్ 2లో చేర్చాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

# మునికూడలికి మోడల్ పుష్కర్

>> డీసీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణ తేజలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మునికూడలి గ్రామ పంచాయతీ పరిధిలో ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవతో సాగుతున్న అభివృద్ధి పనుల ప్రస్తుత స్థితిని అధికారులు వివరించారు. గోదావరి పుష్కరాలకు వచ్చే యాత్రికులు ఎలాంటి అసౌకర్యం లేకుండా సప్త ఋషి ఘాట్‌కు చేరుకునేందుకు గ్రామం మధ్య నుంచి ఘాట్ వరకు ఉన్న మార్గాన్ని అభివృద్ధి చేసి సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. అలాగే ఘాట్ ప్రాంతంలో నీటి ప్రవాహాలు, తడి కారణంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా 3.5 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ ప్లాట్‌ఫారమ్ నిర్మాణం చేపట్టగా, ఈ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. సప్త ఋషి ఘాట్ పరిసరాలను రాత్రి వేళల్లో సైతం సురక్షితంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు హైమాస్ట్ విద్యుత్ దీప స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన సిమెంట్ పునాది నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. విద్యుత్ శాఖకు సంబంధించి రూ. 1.50 కోట్లు పనులు పూర్తయ్యాయి. అందులో మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ఆరు ట్రాన్స్ ఫార్మర్లు, నూతన విద్యుత్ లైన్లు, స్తంభాలు తదితర పనులు దాదాపు పూర్తయ్యాయి.

# ఉభయసభల్లో రభస

>> సభ్యులు నీట్‌పేపర్ లీక్‌పైనా, అయోధ్యపైనల ప్లకార్డులు చేతపట్టి మరీ తమ నిరసనలను కొనసాగించారు. సమావేశాల ప్రారంభంలోనే నిరసనలు ఎదురవడంతో పార్లమెంటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఇలాగే నిరసనలు కొనసాగిస్తే సభను సజావుగా కొనసాగించడం కష్టం అవుతుందని విజ్ఞప్తిచేయడం కనిపించింది. స్పీకర్‌స్థానంలో దిలీప్ సైకియా ఉన్న సమయంలోనే మధ్యాహ్నం మళ్లీ లోక్‌సభ ప్రారంబం అయింది. సభ్యులు తమ సీట్లలో కూర్చోవాలని స్పీకర్ పదేపదే విజ్ఞప్తిచేసినా సభ్యులు చర్చలు జరపాల్సిందేననంటూ పట్టుబట్టారు. ఇప్పటికే అనేక కీలక అంశాలపై చర్చించాల్సి ఉందని, మీకు ఆసకినత కనిపించడంలేదని, ప్రజల సమస్యలు చర్చించడం మీకు ఇష్టం లేదని, ఇది సరైన పద్ధతి కాదని, మీరు పదేపదే సభకు అంతరాయం కలిగిస్తునానరంటూ కేంద్ర మంత్రి విపక్ష సభ్యులనుద్దేశించి మాట్లాడతంతో మరింతగా నిరసనలు హోరెత్తాయి. సభలో బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించడం అనుమతించబోమని అన్నారు. నిరసనలమధ్యలోనే న్యాయశాఖమంత్రి సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్యను 34 ఉంచి 38కి పెంచేందుకు నిర్దేశించిన బిల్లును ప్రవేశపెట్టారు. అయితే నిరసనలమధ్య ఈ బిల్లుకు సానుకూలత రాలేదు. రాజ్యసభలో కూడా ఇదే విదంగాపదేపదే వాయిదాలు పడుతూ వచ్చింది. నీట్‌పేపర్ లీకేజిలపై ఢిల్లీలోనిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై లాఠీ ఛార్జి చేయడాన్ని విపక్ష పార్టీలన్నీ తీవ్ర నిరసన తెలుపుతూ నినాదాలుచేసాయి. ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే ఉభయసభలు తొలిరోజు వాయిదా పడ్డాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని విపక్షాలు పేపర్‌లీక్ వివాధంలో నిందితులపై చర్యలు ఏమయ్యాయంటూ నిలదీసారు. అనేకమంది యువత శాంతియుత నిరసనను అర్థంచేసుకోకుండా లాఠీ ఛార్జిచేసారని ఆరోపించారు. డిప్యూటి ఛైర్మన్ హరివంశ్ స్పందించి సభ్యులకు బిఎసి నిర్ణయాలను వివరించబోయారు. దీనిపై చర్చించేందుకు ప్రభుత్వానికి సమయం కూడా కేటాయించామని చెప్పినా విపక్షసభ్యులునినాదాలు హోరెత్తించారు. సమావేశాలుప్రారంభంలో ఉభయసభల్లోను ఖతార్ షేక్ మహమద్‌బిన్ ఖలీఫా అల్‌థాని మృతికి సంతాపం ప్రకటిస్తూ మౌనం పాటించారు. రాజ్యసభలో ఎఐసిసి అధ్యక్షుడు సభాపక్షనేత మల్లిఖార్జున్ మాట్లాడుతూ మీకు పరీక్షలు నిర్వహించడం చేతకాకపోతే కుర్చీ దిగిపోవాలని విమర్శించారు. శాంతియుత నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీ ఛార్జిచేయించిందని ఆరోపించారు. స్పీకర్‌స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ సభ్యుల వైఖరికి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసారు. జీరోఅవర్ ప్రశ్నోతరాల చర్చలను కొనసాగించాలని కోరినా సభ్యులు వినలేదు. దీనితో సభ మూడు గంటలవరకూ వాయిదా వేసారు. బిజినెస్ అడ్వయిజరీ కమిటీలో చర్చించిన అంశాలనే సభలో చర్చకు వస్తున్నాయని సభ్యులు సహకరించాలని అటు రాజ్యసభ ఛైర్మన్ సిపిరాధాకృష్ణన్, ప్యానెల్ స్పీకర్‌లు దిలీప్‌సైకియా, జగదాంబికా పాల్‌లు పదేపదే విజ్ఞప్తిచేసినా విపక్ష సభ్యులు తాజా సమస్యలపై చర్చకు రావాల్సిందేనని పట్టుబట్టడంతో సభ తొలిరోజు ఎలాంటి చర్చలులేకుండానే వాయిదాపడింది.

# ఉత్తరాంధ్ర మణిహారం భోగాపురం ఎయిర్ పోర్టు

>> మంగళవారం నుంచి చేపట్టే కార్యక్రమాల్లో ఉత్తరాంధ్రకు చెందిన ప్రజాప్రతినిధులు అంతా హాజరు కావాలని సీఎం నిర్దేశించారు. ఈసమీక్షకు హోం మంత్రి అనిత, సీఎస్ సాయిప్రసాద్, ఐఅండ్‌ఐ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సివిల్ ఏవియేషన్ అధికారులు, జీఎంఆర్ ప్రతినిధులు హాజరయ్యారు.

# బాధితురాలి ఫిర్యాదు మేరకు చట్టపరమైన చర్యలు

## గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు క్రైమ్,జులై20,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణబాబు కాలనీలో జరిగిన ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు చట్టపరమైన చర్యలు వేగంగా చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ ఘటనపై ఈ నెల 16వ తేదీన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఫిర్యాదుదారు గాయాలకు చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లి తిరిగి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా క్రైమ్ నెం. 268/2026 కింద సెక్షన్లు 331(6), 79, 115(2), 118(1) r/w 3(5) బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు. సంఘటనలో పాల్గొన్న తొమ్మిది మంది నిందితులను గుర్తించి అరెస్ట్ చేసి,అవసరమైన రికార్డులు సిద్ధం చేసి కోర్టులో హాజరుపరచగా,న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.ఈ కేసులో చట్టపరిధిలో తీసుకోవాల్సి న అన్ని చర్యలను పోలీసులు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో నగరంపాలెం సీఐ సత్యనారాయణను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.అయితే కొందరు వ్యక్తులు బాధ్యతారాహిత్యంగా బాధిత మహిళకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియా వేదికల్లో షేర్ చేస్తూ ఆమె ఆత్మగౌరవానికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై క్రైమ్ నెం. 273/2026 కింద సెక్షన్ 67 ఐటీ యాక్ట్ ప్రకారం మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.తమ స్వార్థ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారాలు చేయడం,బాధిత మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేయడం,ఆమె గౌరవానికి భంగం కలిగించే వీడియోలను ప్రసారం చేయడం లేదా సోషల్ మీడియాలో షేర్ చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

# ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం

>> మహిళా ఐపిఎస్ అధికారిణిపై సహచర ట్రైనీ ఐపిఎస్ అధికారి లైంగి క వేధింపుల కేసు సోమవారం మరో మలుపు తిరిగింది. ఆదివారం సాయంత్రం వెలుగు చూసిన ఈ ఘటన పోలీసు వర్గాలను షాక్‌కు గురిచే యడం తెలిసిందే. శిక్షణలో వున్న కర్నాటకు చెందిన మహిళా ఐపిఎస్ అధికారిణిని ఎపికి చెందిన ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి లైంగికంగా వేధించినట్లు అందిన ఫిర్యాదుపై నగర పోలీసు విభాగంలోని అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవడం విదితమే. ఈ నెల తొమ్మిదవ తే దీన తనపై ఉదయ్ కృష్ణారెడ్డి భౌతికంగా దాడులకు పాల్పడినట్లు, కత్తితో చంపుతానని బెదిరించినట్లు ట్రైనీ మహిళా అధికారిణి పోలీసులకు ఫి ర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై బిఎన్ఎస్ 74,75,77, 315(2) సెక్షన్లతో పాటు ఐటి చట్టంలో ని 66 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో ఢిల్లీలోని డిఓపిటి అధికారులు ఎన్‌పిఎ అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుని వెంటనే నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం. దీని తరువాత ఉదయ్ కృష్ణారెడ్డిని అకాడమి నుంచి ఉన్నతా ధికారులు తాత్కాలికంగా బయటకు పంపి అనంతరం సస్పెండ్ చేయగా ఆయన నగరంలోని మోతీనగర్‌లో గల తన సోదరుడి ఇంటికి వెళ్లిన ట్లు తెలిసింది. దీనిపై ఓవైపు పోలీసుల విచారణ కొనసాగుతుండగానే సోమవారం ఉదయం ఉదయ్ కృష్ణారెడ్డి తన సోదరుడి ఇంట్లో గుర్తు తె లియని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా సోదరుడు ప్రణయ్ కృష్ణారెడ్డి వెంటనే ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. అక్కడ వైద్యులు ఉదయ్ కృష్ణారెడ్డి అ త్యవసర చికిత్స అందించడంతో కోలుకున్నాడు. ఉదయ్ కృష్ణారెడ్డి ఆరోగ్యం బాగానే వుందని వైద్యులు తెలిపారు. దీనిపై ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టినట్లు తెలిసింది. ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నంపై ఎస్ఆర్ నగర్ పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఉదయ్ కృష్ణారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఇదిలావుండగా జాతీయ పోలీసు అకాడమి నుంచి ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ అక్కడి ప్రివిలెజ్ కమిటీ ఆదేశాలు జా రీ చేయగా సోమవారం అకాడమి అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. అంతకు ముందు బాధిత ట్రైనీ మహిళా ఐపిఎస్ అధికారిణి తన బాధలను అకాడమి అధికారులకు చెప్పుకోగా, దీనిపై విచారించిన ప్రివిలెజ్ కమిటీ ఇదంతా నిజమని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ట్రైనీ మ హిళా అధికారిణిని ఉదయ్ కృష్ణారెడ్డి లైంగికంగా వేధించినట్లు, భౌతికంగా దాడులకు పాల్పడినట్లు, బ్లాక్ మెయిల్ చేసినట్లు ప్రివిలెజ్ కమిటి ని ర్ధారించినట్లు తెలిసింది. దీని తరువాత బాధిత మహిళా అధికారి చేత అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఫిర్యాదు చేయించినట్లు తెలిసింది. అనంతరం దీనిపై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

కాగా ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్య యత్న ఘటనపై పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగు చూశాయని తెలిసింది. అతను గుర్తు తెలియని పురుగుల మందు తాగినట్లు సోదరుడు తెలపగా ఇది నిజం కాదని పోలీసులు చెబుతున్నారు. అతిగా మద్యం తాగడం వల్లే అతను అనారోగ్యం పాలయ్యాడని, ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని పోలీసులు చెబుతున్నారు. దీనిపై విచారణ సాగుతోందని వారు తెలిపారు.

## త్రిపుర డిజిపి ఆత్మహత్య

>> పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, ఈ ఘటనపై అధికారిక దర్యాప్తు ప్రారంభమైందని అధికారులు తెలి పారు. కాగా, 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అనురాగ్ ధన్‌కర్ వృత్తిలో ఉన్నతంగా రాణిం చారు.పలు అవార్డులు గెలుపొందారు. అనురాగ్ మే 2025లో త్రిపుర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర పోలీస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు త్రిపు రలో డైరెక్టర్ జనరల్ (ఇంటెలిజెన్స్)గా పని చేశారు. అలాగే సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగే షన్ సిబిఐలో విశిష్టమైన సేవలందించారు. తన పదవీకాలంలో అనేక కీలకమైన కేసుల దర్యా ప్తును చేపట్టి అందరి మన్ననలు పొందారు.

## తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

>> కార్యక్రమం అమలు విధానం, వాహనాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా సేవల విస్తరణపై ముఖ్యమంత్రికి వివరించారు. వాహనాలపై అధి కారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వీటి సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, ఆ శాఖ ఉన్నతా ధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) అధికారులు పాల్గొన్నారు.

### మద్యం టెండర్ల కేసు

## నిందితులకు రెండు వారాల రిమాండ్

**విజయవాడ.జులై 20,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్ల కేసు నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రెండు వారాల రిమాండ్ విధించింది. వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, సునీల్‌కు రిమాండ్ విధించింది. చంచల్‌గూడ జైలుకు తరలించాలని ఆదేశించింది. మద్యం రవాణా టెండర్ల కేసు నిందితులను సిట్ అధికారులు ఏసీబీ కోర్టుకు తరలించారు. ఈ కేసులో నిందితులైన వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, సునీల్‌ను పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపరిచారు., అంతకుముందు విచారణ నిమిత్తం వీరిని హైదరాబాద్ నుంచి విజయవాడకు తీసుకొచ్చారు. విజయవాడ జీజీహెచ్‌లో ఈ ముగ్గురికి వైద్య పరీక్షలు పూర్తి చేశారు. అనంతరం న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టేందుకు కోర్టుకు తీసుకెళ్లారు.

## వారం - వర్జ్యం

21-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
అష్టమి తె.5.17
చిత్త రా.8.52
వర్జ్యం : రా.2.59-తె.4.44
దు.ఉ.8.20-ఉ.9.12,
(2)రా.11.54-రా.12.46
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. నూతన కార్యక్రమాలలో తొందరపాటు వద్దు.

**వృషభం:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. స్పెక్యులేషన్స్ లాభించదు.

**మిథునం:** మీ గురించి మీరు శ్రద్ధ తీసుకోవడానికి మాత్రం సమయం సరిపోదు. ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు పాటించండి.

**కర్కాటకం :** సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. విందు వినోదాలలో పాల్గొంటారు.

**సింహం:** ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు పెద్దలు, అనుభవజ్ఞుల సలహాలు కూడా పాటించండి.

**కన్య :** తరచూ దూరప్రాంత ప్రయాణాలు చేయవలసి రావడం వలన శ్రమ, అలసట అధికమవుతాయి. బంధువుల కలయిక.

**తుల :** సన్నిహితుల నుండి అందిన సమా చారం కొంత ఆందోళనకు గురి చేస్తుంది. వ్యాపారాలలో స్వల్ప మార్పులు వుంటాయి.

**వృశ్చికం:** మర్చిపోయిన విషయాలను జ్ఞప్తికి చేసుకొని వివాదాలకు దిగడం వలన ప్రయోజనం ఉండదని గుర్తించండి.

**ధనుస్సు:** అన్ని రకముల్లైన పోటీ పరీక్షలకు అవసరమైనటువంటి వస్తువులను, వనరులను సమకూర్చుకుంటారు.

**మకరం:**పరిశ్రమలలో ఎదురైన ఆటంకాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. క్రయ విక్రయాలలో ఆశించిన లాభాలు రావు.

**కుంభం:** కాంట్రాక్ట్ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించడం చెప్పదగినది. రాయభారములు నడిపి లాభపడుతారు.

**మీనం :** ఎంతగా వత్తిడి ఉన్నా గతంలో సోదర వర్గానికి మీరిచ్చిన మాట నిలబెట్టుకోగలుగుతారు. వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భోగాపురం విమానాశ్రయం.. కౌంట్‌డౌన్!

- విమానయాన రంగంలో సరికొత్త మైలురాయి • ఆగస్టు 1న అందుబాటులోకి అత్యాధునిక విమానాశ్రయం
- యేటా 4 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు • మొదటి దశ రూ.4,592 కోట్లతో పూర్తి



**విజయనగరం, జులై 20 ప్రభాతవార్త:** అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం అని పేరుపెట్టిన సరికొత్త విశాఖ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 1 ఆగస్టు 2026న జాతికి అంకితం చేసేందుకు సిద్ధం కావడంతో, విశాఖ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి అధికారికంగా సమయం దగ్గర పడుతోంది. ఈ ప్రారంభోత్సవం భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన వైమానిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒకదాని పరిపూర్తతను సూచిస్తుంది. ఉత్తర కోస్తా ఆంధ్రకు అనుసంధానం, ఆర్థిక వృద్ధి, ప్రాంతీయ అభివృద్ధిలో మెరుగైన ఒక కొత్త శకానికి నాంది పలుకుతుంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీవీఐఏఎల్) ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని పెరుగుతున్న ఈ ప్రాంత విమానయాన అవసరాలు తీర్చే విధంగా రూపొందించింది. ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికుల (ఎంపీపీఏ) ప్రయాణించే సామర్థ్యంతో ప్రారంభమవుతున్న ఈ విమానాశ్రయం భవిష్యత్తులో దశల వారీగా 4 కోట్ల ఎంపీపీఏలకు పైగా వీలు కల్పిస్తుంది. విమానాశ్రయంలో 3,800 మీటర్ల కోడ్ 4ఈ రన్‌వే, ఆధునిక ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ టెర్మినల్, ప్రత్యేక కార్గో సౌకర్యాలు, ఆధునిక విమానయాన ప్రాథమిక సౌకర్యాలు ఉన్నాయి. దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్వహించగల సామర్థ్యం వీటికి ఉంటుంది. వాణిజ్య కార్యకలాపాలను సంసిద్ధతను ప్రదర్శిస్తూ, ఈ విమానాశ్రయం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) నుంచి భద్రతా మదింపు పరిశీలన ఆమోదాలు, ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్ (ఐసీపీ)గా నోటిఫికేషన్, కస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 8 కింద కస్టమ్స్ నోటిఫికేషన్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి దీన్ని నిర్వహించడానికి అనుమతి (సీటీఓ)తో పాటు, సంబంధిత నియంత్రణ అధికారుల నుంచి ఇతర తప్పనిసరి కార్యాచరణ ఆమోదాలతో సహా అన్ని ప్రధాన చట్టబద్ధమైన, నియంత్రణ అనుమతులను పొందింది. ఈ ఆమోదాల వల్ల ప్రారంభోత్సవం జరిగిన వెంటనే షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించడానికి మార్గం సుగమం అవుతుంది. విశాఖ సమీపంలో భోగాపురం దగ్గరున్న విమానాశ్రయం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలోని పొరుగు జిల్లాలకు ప్రాథమిక విమానయాన మార్గంగా ఉంటుంది. ప్రధాన దేశీయ, అంతర్జాతీయ గమ్యాలను చేరుకోవడంలో చెప్పుకోదగిన మెరుగుదల తీసుకువస్తుంది. పర్యాటకం, వాణిజ్యం, లాజిస్టిక్స్, తయారీ, పెట్టుబడులకు మద్దతు ఇవ్వడం ద్వారా ఉత్తర కోస్తా ఆంధ్రలో విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్)ను బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నారు. ప్రారంభోత్సవానికి ముందే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖపట్నం, దాని సమీప జిల్లాలతో విమానాశ్రయాన్ని అనుసంధానం చేసే రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టులను వేగవంతం చేశాయి. ఏడు అప్రోచ్ రోడ్లు ప్రజా రవాణా సేవలను మెరుగుపరచాయి. హైవే కనెక్టివిటీ విమానాశ్రయానికి ప్రయాణీకులు వచ్చిపోయేందుకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అత్యంత సౌకర్యంగా ఉంటుంది. ప్రయాణీకులకు కనెక్టివిటీ కల్పించడమే కాకుండా, ఈ విమానాశ్రయం దీర్ఘకాలంలో ఆర్థిక అభివృద్ధికి ప్రేరకంగా పనిచేస్తుందని ఆశిస్తున్నారు. కార్గో ప్రాథమిక సౌకర్యాలు, పారిశ్రామిక ప్రాంతాలకు సమీపంలో ఉండడం, లాజిస్టిక్స్ సామర్థ్యం మెరుగుగా ఉండడంతో, సమాచార సాంకేతికత, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్, సముద్ర ఆహార ఎగుమతులు, ఆధునిక తయారీ వంటి ఎదుగుతున్న రంగాలకు మద్దతుగా ఉంటుంది. సమర్థవంతమైన, సుస్థిరమైన, భవిష్యత్తుకు సన్నద్ధంగా ఉండే కార్యకలాపాలకు మద్దతు ఇచ్చే విధంగా, పునరుత్పాదక శక్తి, వర్షపు నీటి సేకరణ, శక్తి సామర్థ్య వ్యవస్థలు, పర్యావరణ బాధ్యతాయుత మౌలిక సదుపాయాలను పొందుపరుస్తూ, సుస్థిరతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ఈ విమానాశ్రయం అభివృద్ధి చేయడం జరిగింది. తుది సన్నాహాలు చివరి దశకు చేరుకోవడంతో, విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని, కార్యకలాపాల నిర్వహణ ప్రారంభాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వ ఏజెన్సీలు, నియంత్రణ అధికారులు, విమానాశ్రయ భాగస్వాములు, సంస్థలు సన్నిహిత సమన్వయంతో కృషి చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు అంతరాజాతీయ విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ విమానయాన ప్రస్థానంలో చెప్పుకోదగ్గ మైలురాయిగా నిలిచిపోతుంది. ఇది ప్రయాణీకులకు, వ్యాపారాలకు, పెట్టుబడిదారులకు నూతన అవకాశాలను సృష్టించడంతోపాటు, విశాఖపట్నంను "తూర్పు ముఖద్వారం"గా, తూర్పు భారతదేశ ఆర్థికాభివృద్ధికి ఒక ప్రధాన చోదక శక్తిగా మరింత బలోపేతం చేస్తుంది.



**మొదటి దశ రూ.4,592 కోట్లతో పూర్తి:** భారత విమానయాన రంగం మరో కీలక అడుగుకు రంగం సిద్ధమయ్యింది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రయాణికుల రాకపోకలు, వాణిజ్య రవాణా సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో అత్యాధునిక హంగులతో భోగాపురంలో సరికొత్త అంతర్జాతీయ విమానాశ్రయం తన కార్యకలాపాలకు సంసిద్ధమైంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఆధునిక హంగులతో నిర్మించిన ఈ ఎయిర్‌పోర్ట్, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌లా పనిచేయనుంది.

**రికార్డు స్థాయి సౌకర్యాలు:** భోగాపురం విమానాశ్రయం సుమారు 2,203 ఎకరాల విస్తీర్ణంలో రూ. 4,592 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు మొదటి దశ పనులు పూర్తయ్యాయి. ప్రయాణికులకు ప్రపంచస్థాయి అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఇక్కడ అన్ని రకాల వసతులను కల్పించారు.

**అంతర్జాతీయ స్థాయి రన్‌వే:** 3,800 మీటర్ల పొడవైన కోడ్ ఇ రన్‌వేను నిర్మించారు. ఇది భారీ వైడ్‌బాడీ అంతర్జాతీయ విమానాలు సురక్షితంగా ల్యాండ్ అయ్యేందుకు, టేకాఫ్ చేసేందుకు వీలు కల్పిస్తుంది.

**వాణిజ్యానికి ఊతం:** ఎగుమతులు, దిగుమతులను వేగవంతం చేసేందుకు 5,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అత్యాధునిక కార్గో టెర్మినల్‌ను అందుబాటులోకి రానుంది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, సమాంతర టాక్సీవేలు, ఫ్యూయల్ హైడ్రెంట్ సిస్టమ్ వంటి అధునాతన సాంకేతిక వ్యవస్థలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

**దశలవారీగా భారీ విస్తరణ:** ప్రస్తుతానికి ఈ విమానాశ్రయం ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా సిద్ధమైంది. అయితే, భవిష్యత్తులో విమాన ప్రయాణికుల రద్దీని ఊహించి, దశలవారీగా దీనిని ఏటా 4 కోట్ల మందికి పైగా ప్రయాణికులను హ్యాండిల్ చేయగల సామర్థ్యం వరకు విస్తరించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి, దానికి అనుగుణంగా మొదటి దశ పనులను పూర్తి చేశారు.

**ఆర్థికాభివృద్ధికి బాటలు:** ఈ విమానాశ్రయం కేవలం ప్రయాణాలకే పరిమితం కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమివ్వనుంది. రాకపోకలు సులభతరం కావడంతో పెట్టుబడులు పెరగడమే కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా భారీగా మెరుగుపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి ఇదొక మేలి మలుపుగా పేర్కొనవచ్చు.

**ఆగస్టు 1న జాతికి అంకితం:** ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిఎంఆర్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రధాని మోడీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.



## యుకెకు తిరుపతి మామిడి గుజ్జు ఎగుమతి

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తిరుపతి నుండి మామిడి గుజ్జు తొలిసారిగా ఎగుమతి జరిగింది. తిరుపతికి చెందిన వర్ష ఫుడ్స్ సంస్థ యూకేకు తొలి మామిడి గుజ్జు (మ్యాంగో పల్ప్) ఎగుమతి కంటైనర్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఎపిడిఎ ప్రాంతీయ ఎజిఎం ఆర్. పి. నాయుడు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఫణి కిరణ్, ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవముని రెడ్డి, తిరుపతి జిల్లా ఉద్యాన శాఖ అధికారి జయభారత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి జయభారత్ రెడ్డి మాట్లాడుతూ భారత్-యూకే ఎఫ్‌టీఏ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఉద్యాన ఉత్పత్తులకు కొత్త ఎగుమతి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తిరుపతి నుంచి తొలి మామిడి గుజ్జు ఎగుమతి ప్రారంభం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఎగుమతులు పెరగడం వల్ల రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు, ప్రాసెసింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మరింత గుర్తింపు లభిస్తుందని తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని ఉద్యాన శాఖ అందిస్తుందని, రైతులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులు సమన్వయంతో పనిచేస్తే రాష్ట్ర ఉద్యాన రంగం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు.

## దొంగ ఓట్లు పూర్తిగా తొలగిస్తాం

- జగన్‌కు మతిభ్రమించింది: రాష్ట్రమంత్రి అనగాని



**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో దొంగ ఓట్లను పూర్తిగా తొలగిస్తామని, ఎన్నికల సవరణ (సర్)ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. దొంగ ఓట్ల తొలగింపుతో వైఎస్ జగన్‌కు మతి భ్రమించిందని, ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయడం ఆయనకు అస్సలు ఇష్టం లేదని మంత్రి విమర్శించారు. రామాయపట్నం పోర్టు విషయంలో జగన్ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఇదే సమయంలో మాజీ ఐపిఎస్ అధికారి ఎవి వెంకటేశ్వరరావు వ్యాఖ్యలపై కూడా మంత్రి విరుచుకుపడ్డారు. ఆయనో పెద్ద మేధావిలా ఫీల్ అవ్వాల్సిన అవసరం లేదంటూ ఘాటుగా స్పందించారు. తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను కూడా నిర్మించబోతున్నామని మంత్రి చెప్పారు.

## విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం

### అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి




**మదనపల్లె, జులై 20 ప్రభాతవార్త:** విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జ్, రోడ్లు భవనాల మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా షైనింగ్ స్టార్స్-2026, మై స్కూల్-మైఫ్రెండ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, విద్యాశాఖ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో పోటి తత్వాన్ని పెంపొందిచడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. జిల్లాను విద్యా ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను అభినందించారు. రాయలసీమలో జిల్లా ప్రథమ స్థానం, రాష్ట్రంలో 9వ స్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్‌లు విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఏ మాత్రం తీసిపోరని వారి ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకే షైనింగ్ స్టార్స్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిన అందుకొన్న పురస్కారం జీవితాంతం గుర్తు ఉండేలా మరింత కృషి చేయాలని సూచించారు. ఒక విద్యార్థి విజయం మరొకరికి స్ఫూర్తిగా మారాలన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఐఏఎస్, ఐపిఎస్, ఇంజనీరింగ్, డాక్టర్లు కావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తుని, విద్యతోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యం అవుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా వేలాది మంది విద్యార్థులు లబ్దిపొందుతున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులే అన్నమయ్య జిల్లా భవిష్యత్తుకు బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు రూ.20వేలు ప్రోత్సాహక నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 188మంది విద్యార్థులకు రూ.37,60లక్షలు నగదు ప్రోత్సాహకం అందజేయడం సంతోషకరమన్నారు. తల్లికి వందనంతో పాటు మధ్యాహ్న భోజనం కూడా నాణ్యమైనదిగా వడ్డించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ సుబ్రమణ్యం, డైరెక్టర్ అనూరాధ, ఇంటర్ మీడియట్ జిల్లా అధికారి రవి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ విజేతగా సాయి నచికేత్

### జూనియర్ ఛాంపియన్‌గా తొలి భారతీయుడుగా ఖ్యాతి



**నెల్లిమర్ల, జులై 20 ప్రభాతవార్త:** ఇంగ్లాండులోని బర్మింగ్ హామ్ నగరంలో ఈ నెల 17 నుంచి జరుగుతున్న ఆల్ ఇంగ్లాండ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ (అండర్ 19) పోటీల్లో విజయనగరానికి చెందిన భట్రాజు సాయి నచికేత్ బంగారు పతకం సాధించాడు. ఆల్ ఇంగ్లాండ్ జూనియర్ బాడ్మింటన్ ఛాంపియన్షిప్‌లో బంగారు పతకం సాధించిన తొలి భారతీయుడుగా చరిత్ర సృష్టించాడు. ఆరేళ్ల వయసు నుంచే బ్యాడ్మింటన్ ఆటపై ఆసక్తిని పెంచుకొని తొలి కోచ్ భాస్కర బాబు వద్ద మెలకువలు నేర్చుకున్నాడు. ప్రస్తుతం ప్రఖ్యాత చేతన ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో చేతన్ ఆనంద్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. నచికేత్ తల్లి నాగమణి విజయనగరంలోని పిఎస్ఆర్ కాలనీ ప్రాంతానికి చెందినవారు. తండ్రి ఉద్యోగరీత్యా హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. నచికేత్ ఇప్పటికే మలేషియా, ఇండోనేషియా, సైప్రస్, బంగ్లాదేశ్, స్వీడన్, బల్గేరియా దేశాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని మంచి గుర్తింపు సాధించాడు. 2025 ఆగస్టులో శ్రీలంకలో జరిగిన శ్రీలంక జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్‌లో పాల్గొని తృతీయ బహుమతి సాధించాడు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాలో నచికేత్ ప్రస్తుతం 12వ ర్యాంకులో ఉన్నాడు. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్‌లో 56వ ర్యాంకులో ఉన్నాడు. నచికేత్ సోదరుడు సాయి హృషికేత్ కూడా బ్యాడ్మింటన్ క్రీడాకారిడే. ఆయన కూడా చేతన్ ఆనంద్ అకాడమీ లోనే శిక్షణ పొందుతున్నాడు. నచికేత్ తల్లి నాగమణి సీనియర్ వాలీబాల్ క్రీడాకారిణి. ఆమె విజయనగరంలో వాలీబాల్ క్రీడపై మక్కువ పెంచుకొని రాష్ట్ర జాతీయ స్థాయిలో పలు పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఆంధ్ర యూనివర్సిటీ మహిళా వాలీబాల్ టీంకు నాయకత్వం వహించారు. జాతీయస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టులో పాల్గొని ప్రతిభ చూపించారు. నచికేత్ సాధించిన విజయం పట్ల వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరానికి చెందిన టివి భగవాన్ దాస్, వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణంరాజు, కెవిఎన్ రాజు(చిన్నారి) నచికేత్‌ను, తల్లి నాగమణిని అభినందించారు.

# విజయాలకు వేదికగా షైనింగ్ స్టార్స్

- విద్యా సంస్కరణలకు నిదర్శనం: మంత్రి అనగాని సత్యప్రసాద్ • 258 మంది విద్యార్థులకు రాష్ట్ర స్థాయి గౌరవం • ఒక్కొక్కరికి రూ.20 వేల ప్రోత్సాహకం



**తిరుపతి(విద్య), జులై 20 ప్రభాతవార్త:** పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 258 మంది విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్స్-2026 పురస్కారాలతో ఘనంగా సత్కరించింది. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమం విద్యార్థుల విజయోత్సాహంతో పండుగ వాతావరణాన్ని తలపించింది. జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రిజిస్ట్రేషన్- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు, జ్ఞాపికలతో పాటు ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారానే రాష్ట్ర భవిష్యత్తు మరింత బలపడుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యలో నాణ్యత పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన అవకాశాల కల్పన లక్ష్యంగా అనేక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు, మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజన పథకం పునరుద్ధరణ, మెగా డీఎస్సీ వంటి కార్యక్రమాలు విద్యా రంగానికి కొత్త ఊపునిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో ప్రతిభా పురస్కారాలు పరిమిత సంఖ్యలోనే అందించేవారని, ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఒకే వేదికపై సత్కరించడం ద్వారా ప్రతిభకు తగిన గుర్తింపు కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తినిస్తూ ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలో ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. మార్కులు మాత్రమే విజయానికి కొలమానం కాదని, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలు, సామాజిక బాధ్యత కూడా సమానంగా అవసరమని సూచించారు. విద్యార్థులు చిన్న లక్ష్యాలతో సరిపెట్టుకోకుండా పెద్ద కలలు కని వాటి సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, అరవ శ్రీధర్, నెలవల విజయశ్రీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న ప్రోత్సాహక కార్యక్రమాలు ప్రభుత్వ విద్యపై విశ్వాసాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కూడా ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్, ఆర్ఐఒ గోపాల్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పురస్కార గ్రహీతలను అభినందించిన అతిథులు, వారు భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు

## మెట్ల పై నుండి పడి టెన్నీస్ కోచ్ మృతి

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగేశ్వర్ నగర్ లో సోమవారం మధ్యాహ్నం మెట్లపై నుండి జారిపడి యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. శ్రీకాళహస్తికి చెందిన భాస్కర్ (28) తిరుపతి లింగేశ్వర్‌నగర్ ఆంధ్ర బ్యాంకు కాలనీ లో టెన్నిస్ అసిస్టెంట్ కోచ్ గా ఉంటున్నాడు. సోమవారం లింగేశ్వర్ నగర్ లోని ఓ ఇంటిలో స్నేహితునితో కలిసి భాస్కర్ గదిలో ఉంటున్నాడు. స్నేహితుడు ఊరికి వెళ్లగా ఒంటరిగా ఉన్న భాస్కర్ మద్యం మత్తులో మొదటి అంతస్తు నుండి దిగుతూ బోర్లపడ్డాడు. భాస్కర్ తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీ కి తరలించారు. భాస్కర్ తల్లి ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ సిఐ మద్దయ్య ఆచారి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

# తిరుపతి పోలీస్ కమిషనరేట్ దిశగా వేగంగా అడుగులు!

- పుణ్యక్షేత్రం ప్రాధాన్యతతో భద్రత మరింత కట్టుదిట్టం

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన హిందువుల పుణ్యక్షేత్రం... యాత్రాస్థలం తిరుపతి నగరం త్వరలో పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు దిశగా మార్పుకానుంది. ఇందుకోసం అవసరమైన కార్యాచరణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర పోలీస్ బాస్ (డిజిపి) హరీష్ కుమార్ గుప్త నుండి నివేదికలు, ప్రతిపాదనలతో కూడిన డాటాను పంపాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుకు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రముఖ యాత్రాస్థలంగా కూడా ఖ్యాతిచెందిన తిరుపతి జిల్లాలో తిరుపతిని పోలీస్ కమిషనరేట్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి ఇటీవల ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కొత్త కమిషనరేట్‌గా మార్చాలని ప్రాథమిక ప్రక్రియలో పేర్కొంది. తిరుపతి జిల్లాలో ప్రధానంగా తిరుమల శ్రీవారి ఆలయం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి కాళహస్తీశ్వర స్వామి ఆలయం, నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయం, పెద్దపారిశ్రామికవాడ సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీ ఉండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుపతి తిరుమలకు ప్రతిరోజూ లక్షమంది వరకు యాత్రికులు వస్తుండటం, ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, న్యాయాధికారులు, ప్రముఖులు, విదేశాల నుండి ప్రముఖులు పర్యటిస్తుండటంతో వారికి భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు అదనపు పోలీస్ బలగాలు అవసరం ఉంది. ఎంతో సుదీర్ఘ చరిత్ర ఉన్న చిత్తూరు జిల్లాను పోలీస్‌శాఖాపరంగా విభజించి తిరుపతి అర్బన్ పోలీస్ జిల్లాగా 2010లో నెలకొల్పారు. అప్పటివరకు ఎస్పీతో నడిచిన పోలీస్‌శాఖ ఐపిఎస్ అధికారి హోదాలో ఎస్పీ క్రిందకు పోలీసుశాఖ తీసుకువచ్చారు. అప్పటి నుండి అర్బన్ జిల్లాకు బాలారిష్టాలు తప్పలేదు. కనీస మౌళిక వసతులు కూడా కరువయ్యాయి. ఆ తరువాత 2019లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 2022లో జిల్లాల పునర్విభజనలో పరిపాలన పరంగా చిత్తూరు జిల్లాను విడగొట్టి తిరుపతి జిల్లాగా ఏర్పాటుచేశారు. ఈ జిల్లాలో నెల్లూరు జిల్లా నుండి కొంతభాగం, రెవెన్యూ డివిజన్లను తిరుపతిలో కలిపారు. పరిపాలన పరంగా అస్తవ్యస్థ విభజనతో జనం ఇబ్బందులు ఎక్కువయ్యాయి. తిరుపతి పోలీస్ జిల్లాతోనే పాలన సాగించారు. 2024లో రాష్ట్రంలో మళ్ళీ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో తిరుపతిపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. సిఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లా కూడా కావడంతో ఇక్కడ పరిపాలన పరంగా, పోలీస్ శాఖను మరింత బలోపేతం చేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు.

**జిల్లా పోలీస్ కార్యాలయం నుండి కమిషనరేట్ దిశగా:** తిరుపతి జిల్లా ఏర్పాటైన తరువాత కూడా జిల్లాకు ప్రత్యేకంగా ఐపిఎస్ అధికారినే ఎస్పీ హోదాలో పాలన సాగిస్తున్నారు. పెరిగిన విస్తీర్ణం, కొత్తగా ఏర్పాటైన సబ్‌డివిజన్లు, పోలీస్ సర్కిళ్ళతో పరిపాలన మరింత ఎక్కువైంది. ఈ నేపథ్యంలో తిరుపతి నగరం జనాభా అనూహ్యంగా పెరిగింది. జనాభా 6లక్షల వరకు చేరగా ఓటర్లు 3లక్షల మంది ఉన్నారు. ఇదేగాక తిరుపతి నగరపాలక సంస్థ గ్రేటర్‌గా రూపుదిద్దుకోనున్న తరుణంలో పరిసరాల్లోని గ్రామాలు, కాలనీలు, పంచాయతీలు తిరుపతి గ్రేటర్ కార్పొరేషన్ క్రిందకు చేరనున్నాయి. దీంతో జనాభా కూడా మరింతగా అధికం కానుంది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాతోబాటు తిరుపతి మహానగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని తిరుపతిని పోలీస్



కమిషనరేట్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. తిరుపతి అర్బన్ పోలీస్ జిల్లాను పూర్తి స్థాయి పోలీస్ కమిషనరేట్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇందుకు అవసరమైన కార్యాచరణ, ప్రతిపాదనలు, నూతన సబ్‌డివిజన్లు, నగరంలో ట్రాఫిక్, క్రైమ్, శాంతిభద్రతల విభాగాలకు ఏసీపీలు రానున్నారు. కమిషనరేట్‌కు ఐజి హోదాలో పోలీస్ కమిషనర్ నియామకం కానున్నారు. ఆయన నేతృత్వంలో ముగ్గురు నలుగురు ఎస్పీలు, అదనపు ఎస్పీలు (ఎసిపిలు, డిసిపిలు)గా మారనున్నారు.

తిరుపతి అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రం కావడం, పర్యాటకుల రద్దీ పెరగడం, పెరుగుతున్న నేరాల నియంత్రణకు నగర స్థాయి పోలీసు వ్యవస్థ అవసరమని ప్రభుత్వం భావించింది ఇప్పటికే తిరుపతి నగరాన్ని పరిపాలన పరంగా రెండు ప్రధాన సబ్‌డివిజన్లుగా విభజించారు.

తిరుపతి సబ్‌డివిజన్ నగరం పరిధిలో తిరుపతి తూర్పు, అలిపిరి, తిరుపతి పడమర, ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ పోలీసు స్టేషన్లు, ట్రాఫిక్, క్రైమ్ సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఇదేగాక చంద్రగిరి సబ్‌డివిజన్ కింద ఎం.ఆర్.పల్లి (తిరుపతి రూరల్), తిరుచానూరు, రామచంద్రాపురం, పాకాల, యర్రావారిపాలెం, భాకరాపేట, చంద్రగిరి పోలీసు స్టేషన్లు ఉన్నాయి. తిరుమల సబ్‌డివిజన్‌లో తిరుమల 1, 2 టౌన్, తిరుమల ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఇదేగాక రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు సబ్‌డివిజన్లు ఉన్నాయి. తిరుపతి నగరం కమిషనరేట్‌గా మారితే కొత్త పరిపాలనా జోన్లు, పోలీస్ సర్కిళ్ల విభజన కానుంది. కొత్తగా పాకాల, పూతలపట్టు వరకు కమిషనరేట్ క్రిందకు వచ్చే సూచనలున్నాయి. పోలీసు పునర్వ్యవస్థీకరణలో తిరుపతి కమిషనరేట్ పరిధిలోనూ మరిన్ని కొత్త పోలీస్ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ చేయడానికి నగర విస్తరణ, జనాభా పెరుగుదల ఆధారంగా శాంతిభద్రతలను పర్యవేక్షించడానికి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించే దిశగా కార్యాచరణ మొదలుపెట్టారు. త్వరలోనే కమిషనరేట్ క్రిందకు సరిహద్దులను ఖరారు చేయడం, ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించేందుకు పూర్తి స్థాయి రూపురేఖలు హద్దులకు సంబంధించిన జియోగ్రాఫికల్ నోటిఫికేషన్లు అధికారికంగా నివేదికలను తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No. 05/A-12024/1/2026-AC-II/2nd call Dt: 20/07/2026
**E PROCUREMENT SHORT TENDER NOTICE (SECOND CALL)**
Name of Work: APCRDA - "RFP for Selection of Agency for Providing Strategic Resource Augmentation and Knowledge Support Services to APCRDA on Requirement Basis".
The bid can be downloaded on AP e-procurement portal from 21.07.2026 to 29.07.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid is 29.07.2026 up to 15.00 Hrs, Technical bid opening 29.07.2026 @ 16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Addl. Commissioner, APCRDA, Amaravati

21-7pg4:21-7pg4.qxd 7/20/2026 11:02 PM Page 1



వార్త

ప్రపంచపు నైతిక స్పృహను సమీకరించుకోగలిగితే గొప్ప సైన్యానికి మించిన శక్తి మనకి లభిస్తుంది.

న- ఉడ్రోవిల్సన్

# వణుకుతున్న 'ఉత్తరం'

ప్రకృతి విజృంభించినప్పుడల్లా అది ప్రకృతి ప్రకోపమా, మానవ తప్పిదమా అని ప్రశ్నించుకుంటూనే ఉంటాం. ప్రకృతి కళ్లెర్ర చేస్తే చేయగలిగినదేమీ ఉండక పోయినా తగిన జాగ్రత్తలు తీసుకుంటే జనంఅప్రమత్తమై ఉంటే ఎంతో కొంత నష్టాలను తగ్గించుకోగలమనే అంశం దీనితో ముడిపడి ఉంది. ప్రస్తుతం ఉత్తరాదిన వరదలు ముంచెత్తుతున్నాయి. కనీవినీ ఎరుగని బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ఉత్తరాఖండ్, నాగాలాండ్‌లలో ఆకస్మిక వరదలు చుట్టుముట్టాయి. జనజీవనం స్తంభించింది. జమ్మూకాశ్మీర్‌లో భారీ వర్షాలతో అతలాకుతలం అయిపోయింది. ఆదివారం నాటి వరదలకే కనీసం 17 మంది దుర్మరణం పాలయ్యారు. ఎడతెగని వర్షాలతో రాజౌరి, పూంచ్, అనంతనాగ్ జిల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. రాజౌరి నదులు పొంగిపొర్లాయి. రహదారులపై నీళ్లు చేరాయి. శనివారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు వరదలు పోటెత్తాయి. రాజౌరి జిల్లాలోని దర్హాలి, ఖండ్లీ, సుక్తోహ్, జమెలా నదులతోసహా అన్ని ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మరోపక్క కొండచరియలు జారిపడుతున్నాయి. జనసంచారం ఎంత తక్కువగా ఉన్నా ఎక్కడో అక్కడ జన నష్టానికి చేరువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అమర్‌నాథ్ యాత్రకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఆదివారం నుంచి భక్తజన సందోహాన్ని ముందుకు కదలనీయకుండా ప్రభుత్వాలు ఆంక్షలు విధించారు. బేస్ క్యాంపుల్లో ఉన్న భక్తులను ఎక్కడికీ కదలనీయకూడదని ఆదేశాలు జారీ చేశారు. అమర్‌నాథ్‌తోపాటు ప్రఖ్యాత వైష్ణోదేవి అమ్మవారియాత్ర కూడా స్తంభించిపోయింది. తదుపరి ఆదేశాలు ప్రకటించే వరకు వీటిని పునరుద్ధరించలేమని ప్రభుత్వ అధికారులు నిర్ద్వంద్వంగా ప్రకటించారు. జమ్మూ, కాశ్మీర్‌ల మధ్య యాత్రికులను అటునిటు వెళ్లకుండా ఆంక్షలు విధించడంతో ఎక్కడికక్కడ బ్లాక్ అయిపోయారు. వారంతా జమ్మూ, ఉధంపూర్ రాంబన్‌లలో ఏర్పాటు చేసిన వసతి కేంద్రాల వద్దే తలదాచుకోవాలి. బంగాళాఖాతం అరేబియా సముద్రాల నుంచి వస్తున్న తీవ్రతకు గాలుల ప్రభావంతో జమ్మూకాశ్మీర్‌లో ఈ నెల 23 వరకు కుండపోత వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. 21 నుంచి 23 వరకు కశ్మీర్‌లో అతి భారీ వర్షాలు పడవచ్చునని, 20 నుంచి 23 వరకు మధ్య జమ్మూ రీజియన్‌లోని రియాన్స్, ఉద్దంపూర్ జిల్లాల్లో రికార్డుల స్థాయి వానలు కురిసే పరిస్థితిఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. అనంత నాగ్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, మేఘా విస్పోటనాలు, ఫ్లాష్‌ఫ్లడ్‌లతోపాటు, కొండచరియలు విరిగిపడ్డాయి. పూంచ్, సురన్‌కోట్‌లోని లోయర్ ముర్రాలో 10 మంది రాజౌరీలో ఇద్దరు చనిపోగా, ఆరుగురి ఆచూకీ దొరకలేదు. చిట్టర్గఉల్ ప్రాంతంలో సాయంత్రం 7 గంటల దాకా మేఘవిస్పోటనం సంభవించింది. జమ్మూకాశ్మీర్‌లకు ఇది మూడో మేఘ విస్పోటనం దెబ్బ. ఇటీవలనే కిష్వార్‌లోని క్వార్ హైడ్రో ప్రాజెక్టు వద్ద దోడాలోని తత్రిలో కూడా ఇదే విధంగా క్లౌడ్‌బరస్ట్ సంఘటనలు జరిగాయి. హిమాలయ ప్రాంతం పూర్తిగా ఫ్లాష్ ఫ్లడ్‌లకు అలవాటుగా మారింది. ప్రధానంగా విలయానికి కారణం ప్రభుత్వాల వైఫల్యం, మానవ తప్పిదాలు కూడా అనిచెప్పాలి. జమ్మూకాశ్మీర్ అంటే అందాల లోయలే కాదు, ప్రకృతి సౌందర్యానికి ఆలవాలంగా ఉంటుంది. అలాంటి చోటప్రకృతిని కాపాడుకోవడం మనవంతు, ప్రభుత్వ బాధ్యత. ప్రకృతిని గౌరవించకుండా పర్వతాలపై దాడి చేస్తే ప్రకృతి పగబట్టినట్లుంటుంది. పర్యావరణాన్ని కాపాడుకోవడంలోవేసే ప్రతి నిర్లక్ష్యపుటడుగు మానవాళికి ప్రమాదమే. హిమాలయ ప్రాంతాల్లో నిర్మాణాలపై కఠిన నిబంధనలు, నదీ ప్రవాహ మార్గాలను ఆక్రమణల నుంచి కాపాడే విధాన నిర్ణయాలు, ప్రకృతి బీభత్సాల ముందస్తు సమాచారాన్ని గ్రామాలకు తక్షణమే చేరవేయడం వలన కొంత మేరకు నష్టాలను తగ్గించొచ్చు. అడవులను నరకడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలి. సుస్థిర పర్యాటకం కోసం ఇవన్నీ తప్పని సరి. లేకుంటే వర్షాకాలపు ప్రకృతి విపత్తులతో బహుళ స్థాయిలో నష్టాలు వాటిల్లుతాయి. ఇలా అనుకోని వరదలొచ్చినప్పుడు ప్రభుత్వపరంగా కొద్దిపాటి సంసిద్ధతలు సరిపోవు. వరద సమాచారం తెలియక జనం తల్లడిల్లిపోయిన సందర్భాల్లో వారిని ఆదుకునే ప్రత్యేక యంత్రాంగం ఏదీలేదనే చెప్పాలి. భారీయంత్రాలు ముందస్తుగానే ప్రమాద సూచిత ప్రాంతాలకు చేర్చాలి. లోయల్లోని గ్రామాలకు ప్రభుత్వ యంత్రాంగం చేరాలంటే చాలాసమయం పడ్తుంది. ఒకసారి వర్షానికి సమయం చిక్కితే నిరంతరం కురుస్తూనే ఉండడంవల్ల ప్రభుత్వ సాయం ఆలస్యంగా అందుతుంది. సహాయక చర్యలు ఎప్పుడైతే తక్షణమే అందవో అప్పుడే నష్టాలు ఎక్కువవుతున్నాయి. బాధితులకు తక్షణ ఆహారపొట్లాలు, లేదా సహాయం అందకపోతే వారి ఆక్రందనలకు అంతే ఉండదు. ఇప్పుడు కశ్మీర్‌లో ప్రకృతి విలయానికి సహాయం అందక ఎంతో మంది విలవిల్లాడుతున్నారు. అనంతనాగ్‌లో వరిపొలాలు, యాపిల్ తోటలు బాగా దెబ్బతిన్నాయి. రైతుకు ఆదాయం బాగా పోయేటట్లుంది. నిర్మాణాలు, అడవుల నరికివేత, సహజనీటి ప్రవాహ మార్గాలకు ఆటంకాలు, పర్యాటకులు పడేసిన చెత్తను సైతం తొలగించే ఏర్పాటు లేక పోవడం వల్లనే ప్రకృతితెచ్చే నష్టాలు ఎక్కువవుతున్నా యని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డా. మన్నా నిసార్ వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో కేరళ రాష్ట్రం వయెనాడ్ విలయం నాటి అనుభవాల గుణపాఠం నేర్చుకోవాలి. ప్రకృతి విలయాలను తట్టుకుని తక్షణ సహాయాన్ని పునర్నిర్మాణ పనులకు పూర్తి చేసేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు అవసరం.

పొగిడేవారు లేనప్పుడు కష్టాలు చుట్టుముట్టినప్పుడు మనల్ని మనం బాగా తెలుసుకోగలం.



శామ్యూల్ జాన్సన్

ఎవడు మహాబలశాలి అయినప్పటికీ, కోమల హృదయం కలిగి ఉంటాడో, అతడే నిజమైన మానవుడు, ధీరుడు.



స్వామి వివేకానంద

# వైద్యం, విద్యే పాలకుల లక్ష్యం కావాలి

***ఉచితంగా వైద్యం, విద్య అందుబాటులో ఉంచగలుగుతే అంతకు మించి ప్రజానీకానికి సంక్షేమ కార్యక్రమాలు ఏముంటాయి? రాజకీయాలు చేయటం ఎప్పుడూ అక్కరకు రావు! ఓట్లు పడుతేనే ప్రభుత్వంలోకి ఏ పార్టీ అయినా రాగలదు! కానీ ప్రజలను అన్ని రకాలుగా యోగ్యులుగా చేయగలిగే విధంగా అన్ని రాజకీయ పక్షాలు ఆలోచించే సమయం వచ్చింది! ఎన్నికల్లో గెలవటమే ప్రధానం కాదు! ఎన్నికల్లో గెలిచిన తర్వాత పార్టీలు తర్వాత ప్రజలందరూ ఒకటే అన్న సమున్నత విధానాన్ని అమలు చేయగలుగుతే దీర్ఘ కాలిక ప్రయోజనాలు ప్రజాస్వామ్య పరిధిలో న్యాయంగా నిజాయితీగా ప్రజలకు సమకూర్చిన వారవుతారు! అం దుకనే 'విద్య'ను లక్ష ్యంగా పెట్టుకొని గెలిచిన పార్టీ విద్యా ధికులను అభ్యున్నతి కోసం తయారు***



రావులపాటి సీతారాంరావు

రాజకీయాలు ఎట్లున్నా దేశంలో విద్యా విధానాన్ని సంస్కరించాల్సిన అవసరం ఏర్పడింది! అటు రాష్ట్ర ప్రభుత్వాలకూ ఇటు కేంద్ర ప్రభుత్వానికి విద్యావిధానంలో మార్పులు, చేర్పులు సంస్కరణలూ కాలానుగుణంగా చేసినప్పుడే విద్యకు విలువనిచ్చినవారవుతారు. 'విద్య నొసగు వినయంబు'తో బాటు జీవనవిధానాన్ని నేర్పుతుంది! మాతృదేవో భవ, పితృదేవో భవలతో పాటు ఉపాధ్యాయుడికి సమాజంలో వున్న ఉన్నత స్థానాన్ని తెల్పటానికి, పూర్వీకులు గురువును కూడా తల్లీదండ్రులతో పాటు 'గురుదేవోభవ'ను చేర్చి విద్యనొసగే గురు స్థానానికి సముచిత రీతిలో సూక్తుల పరంగా గుర్తు చేయటం జరిగింది! విద్యను 7వ షెడ్యూలులో కంకరెంట్ లిస్టులో చేర్చటం వల్ల రాష్ట్రాలతో పాటు కేంద్రానికి ఈ విషయంలో చట్టాలు చేసి సంస్కరించాల్సిన గురుతర బాధ్యత వుంది! పార్లమెంటు సమావేశాల్లో విద్య ప్రాముఖ్యతను ప్రజా ప్రతినిధులు గుర్తించి, డిబేట్లను చేపల మార్కెట్టు ధోరణిలో చేయకుండా అర్థవంతంగా పార్టీలకు అతీతంగా విద్యావిధానాలను అవసరమైతే సంస్కరించటానికి చట్టాలను పాస్ చేయాల్సిన బాధ్యత వుందని భావించటంలో తప్పులేదేమో! వైద్యం, విద్య ప్రజల అభ్యున్నతికి మూల స్థంభాల్లాంటివి! ఆ రెండింటిని ప్రైవేట్ పరం చేయటానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏ పార్టీ అధికారానికి వచ్చినా సరే, సిద్ధపడ్తుండటం దురదృష్టంగా భావించక తప్పదు. 'నీట్' పరీక్ష ఎంతోమందికి ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం కల్పించింది. సోనమ్ వాంగ్ చుక్ అనే విద్యావేత్త మార్పుల కోసం ప్రాణాన్ని ఫణంగా పెట్టి నిరాహార దీక్ష చేస్తున్నారు. కేంద్ర విద్యా మంత్రి రాజీనామా ఆయన డిమాండ్! వాంగ్ చుక్కు హాస్పిటల్కు తరలించారు! ఈ నేపథ్యంలో విద్యావిధానంలోని లొసుగులు, కావల్సిన మార్పులు విశ్లేషించుకోవాల్సిన సమయం ఆసన్నమయింది! విద్యను సాధ్యమైనంత త్వరగా ప్రైవేట్ వ్యక్తుల నుంచి, సంస్థల నుంచి తొలిగించి ప్రభుత్వ పరిధిలోకి తీసుకొని రావాలి! గవర్నమెంట్ స్కూళ్ళను, కాలేజీలనే ప్రోత్సహించాలి! అప్పుడే ఒకే రకమైన విద్యను గరపటానికి, విద్యా విధానాలను పాటించటానికి అవకాశం వుంటుంది. నీట్ లాంటి సంస్థల్లో తప్పుల ప్రమాదం అదుపులో ఉంటుంది! బాధ్యతలు ఏకీకృతమవుతాయి! రాష్ట్ర ప్రభుత్వాలు గూడా ప్రైవేటు పరంగా విద్యను ఒప్పచెప్పకూడదు! బాధ్యతలు ప్రభుత్వాలు తొలగించుకొని, కేవలం కర్ర పెత్తనానికి, అధికారానికి మాత్రమే పరిమితమవుతే అంతే సంగతులు! ఆచరణ మొదట్లో కష్టమే అయినా, స్వాతంత్ర్యం వచ్చిన కాలంలో మన దేశంలో విద్య ప్రయివేటు వారి చేతుల్లో చాలా తక్కువగా వుండేది. ప్రయివేట్ స్కూళ్ళల్లో, విద్యాలయాలల్లో చదువుకున్న వారిని ఆరోజుల్లో చిన్నచూపు చూసేవారు! కోచింగ్ కల్చర్ను పూర్తిగా తొలిగించాలి! కోచింగ్ల పేరుతో బలవంతంగా విద్యార్థులపై ఒత్తిడిని ప్రయివేట్ కోచింగ్ సెంటర్లు అమితంగా పెంచుతున్నాయి! అంతేగాదు ఒకరి కంటే మరొకరు మిన్న అని నిరూపించుకోటానికి అనేక రకాల మార్గాలను అన్వేషించటం మొదలుపెట్టారు! దీనితో మార్కులు ఇబ్బడి ముబ్బడిగా విద్యార్థులు తెచ్చుకుంటు



న్నారు కానీ, నాలెడ్జి పరంగా వారిలో సాధించేది దాదాపు సున్నాగా మిగులుతుంది. తల్లిదండ్రులు కోచింగ్ కోసం డబ్బులు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు! ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ల విద్యార్థులు ఎదగటానికి బదులు కేవలం మార్కుల కోసం జరుగుతున్న యుద్ధంగా మారింది! చాటుమాటుగా కోచింగ్ ఇచ్చేవారు పరీక్షలల్లో వచ్చే క్వశ్చన్ పేపర్లు నిజమైన పేపర్లుగా నమ్మబలికి వారి అనుయాయులతో పరీక్ష ఇచ్చే విద్యార్థులకు నమ్మించి డబ్బు చేసుకుంటున్నారన్న వదంతులు గూడా వున్నాయి! కొన్నిచోట్ల ఆ గెస్ పేపర్లు నిజమైన పేపర్లుగానే బయటపడి రభసగా మారటంతో పరీక్ష రాసిన వారందరికీ భయాందోళనలు కలిగించాయి. ప్రభుత్వాలకు తలవొంపులు గూడా తెచ్చాయి! అందుకనే కోచింగ్ సెంటర్లను నియంత్రించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి! నిజమైన విద్య ఎప్పుడు అబ్బుతుందంటే నిష్ణాతులైన అధ్యాపకులు బోధించినప్పుడే! అందుకనే ప్రభుత్వ విద్యాలయాలలో అసలు సిసలైన, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి విద్యార్థులను నిజమైన విద్యావంతులుగా మార్చే ప్రయత్నం చేయక తప్పదు! ద్రోణాచార్యులు, సాందీపుడు లాంటి ఆచార్య శ్రేష్ఠులు దొరకక పోవచ్చు కానీ ఈ ఆధునిక యుగంలో మన దేశంలో ఎందరో మెరికల్లాంటి టీచర్లు వున్నారు! వారి అవసరం, వారు అందుబాటులో వుండే విధంగా తీర్చి వారిని నియమించగలుగుతే విద్యార్థుల నిజమైన ప్రతిభను వెలికి తీసిన వారవుతారు! ఉద్యోగాలే లక్ష ్యంగా వున్నా నైతికంగా విద్య వల్ల శ్రేష్ఠమైన విజ్ఞానం సంపాదించటం వల్ల విద్యార్థిలోకం పరిపూర్ణ విజ్ఞతతో భాసిల్లి యువకులుగా మారి, దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టే విధంగా అన్ని రంగా లలో ఆరితేరిన రీతిలో ప్రభుత్వాలకు అందుబాటులో ఉం టారు! ఆ మార్గంలో చర్యలు తీసుకోవాలి! విద్యాలయాలలో టీచర్ల ఉద్యోగాలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి! ఒక పాఠ్యాంశం బోధించే ఉపాధ్యాయుడికి మరో అంశం బోధిం చే పని లేకుండా జాగ్రత్తలు ప్రభుత్వాలు ఏర్పరిచినప్పుడే సరియైన ఫలితాలు వస్తాయి! లేబరేటరీస్, లైబ్రరీలు, ఆట స్థలాలు, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పరిశుభ్ర పరిసరాలు, కనీ సం ఒక స్థాయిలో వుండే విధంగా తీర్చిదిద్దినప్పుడు (ప్రతి విద్యాలయంలో) పిల్లలకు ముఖ్యంగా ప్రైమరీ స్థాయి వారికి చదువంటే ప్రేమ ఏర్పడుతుంది. ఆకర్షణీయంగా విద్యావిధా నాన్ని రూపుదిద్దగలిగితే విద్యార్థులు ఎగిరిగంతేసి చదువు లను, జ్ఞానసంపదను ఎగరేసుకొని పోగలరు! ప్రభుత్వాలు విద్య కోసం గణనీయంగా బడ్జెట్‌ను పెంచాలి! ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు సమకూర్చటమంటే ఉచితాలు అప్ప నంగా ఇవ్వటం వారిని నిర్వీర్యులను చేసి ఓట్లు దండుకోవ టానికే అన్న విమర్శలు ఎక్కువగా వినబడుతున్నాయి! ఉచితంగా వైద్యం, విద్య అందుబాటులో ఉంచగలుగుతే అంతకు మించి ప్రజానీకానికి సంక్షేమ కార్యక్రమాలు ఏముంటాయి? రాజకీయాలు చేయటం ఎప్పుడూ అక్కరకు రావు! ఓట్లు పడుతేనే ప్రభుత్వంలోకి ఏ పార్టీ అయినా రాగలదు! కానీ ప్రజలను అన్ని రకాలుగా యోగ్యులుగా చేయగలిగే విధంగా అన్ని రాజకీయ పక్షాలు ఆలోచించే సమయం వచ్చింది! ఎన్నికల్లో గెలవటమే ప్రధానం కాదు! ఎన్నికల్లో గెలిచిన తర్వాత పార్టీలు తర్వాత ప్రజలందరూ ఒకటే అన్న సమున్నత విధానాన్ని అమలు చేయగలుగుతే దీర్ఘ కాలిక ప్రయోజనాలు ప్రజాస్వామ్య పరిధిలో న్యాయం గా నిజాయితీగా ప్రజలకు సమకూర్చిన వారవుతారు! అం దుకనే 'విద్య'ను లక్ష ్యంగా పెట్టుకొని గెలిచిన పార్టీ

# జంక్ ఫుడ్‌తో ఇంకిపోతున్న ఆరోగ్యం

బుర్ర మధుసూదన్ రెడ్డి

పాశ్చాత్య దేశాలు వంటింటికి ఎప్పుడో విడాకులు ఇచ్చాయి. వారి ఇండ్లల్లో జంక్ ఫుడ్స్ దండయాత్ర చేశాయి. ఒక్క పూట కూడా జంక్ ఫుడ్ లేకుండా దినం గడవడం లేదు. జంక్ అంటేనే చెత్త అని కదా అర్థం. 1950 తర్వాత మైక్రోబయాలజిస్ట్ మైఖేల్ జాకబాసన్ రూపొందించిన పదం 'జంక్ ఫుడ్' నేడు విశ్వవ్యాప్తం అయ్యింది. పెద్ద పెద్ద మాల్స్ నుంచి చిన్న చిన్న షాపుల వరకు అంతటా జంక్‌ఫుడ్ ప్యాకెట్ దండలే స్వాగతం పలుకుతున్నాయి. చిన్న, పెద్ద అందరూ తరుచుగా ఏదో ఒక సందర్భంలో జంక్, ఫాస్ట్, ప్రాసెస్డ్ అండ్ ప్యాకెట్ ఫుడ్స్‌ను అమితానందంగా రుచి చూస్తున్నారు. పిల్లలు మాత్రం జంక్ ఫుడ్ విషవలయంలో చిక్కినట్లే కనిపిస్తున్నది. మన ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యాన్ని శాసిస్తాయి. ఆధునిక వేగవంతమైన జీవనశైలిలో నేటి మానవుడు కొట్టుకుపోతున్నాడు. ఫ్యాషన్ల పేరుతో జంక్ ఫుడ్‌ను లొట్టలేసుకుంటూ ఆరగిస్తున్నాడు, ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నాడు. నేటి డిజిటల్ నరుడు జంక్, ఫాస్ట్‌ఫుడ్స్‌కు బానిస అయిపోయి తమ తమ ఆరోగ్యాలను గాలికి వదిలేస్తున్నాడు. జంక్, ఫాస్ట్ ఫుడ్‌కు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని, జంక్‌ఫుడ్ పట్ల జనాల్లో అవగాహన కల్పించవలసిన అగత్యం ఏర్పడిందని గమనించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏటా 21 జూలై రోజున 'జాతీయ జంక్ ఫుడ్ వ్యతిరేక దినం (నేషనల్ యాంటి జంక్ ఫుడ్ డే)' పాటించడం ఆనవాయితీగా మారింది. సాలీనా సగటున పొగాకు దురలవాట్లతో 8 మిలియన్ల ప్రజలు మరణిస్తే, జంక్ ఫుడ్ అతిగా తీసుకోవడం వల్ల 11 మిలియన్ల ప్రజలు మరణిస్తున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. 70 ఏండ్లు పైబడిన వృద్ధుల్లో సైతం 22 శాతం మరకలు జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల జరిగినట్లు స్పష్టం అవుతోంది. అధిక కొవ్వులు, చక్కెరలు, ఉప్పు, క్యాలరీలతో పాటు అతి తక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను జంక్ అండ్, ఫాస్ట్‌ఫుడ్ అని నిర్వచిస్తారు. తొలుత అమెరికాలో కాలుమోపిన జంక్ ఫుడ్ సంస్కృతి నేడు విశ్వవ్యాప్తం అయ్యింది. పెద్దపెద్ద మాల్స్



లో జంక్, ఫాస్ట్, ప్రాసెస్డ్, ప్యాకేజ్డ్, బేకరీ, ఫ్రోజెన్ ఫుడ్స్ వినియోగదారులకు నోరూరిస్తూ, వారిని బుట్టలో వేసుకుంటున్నాయి. డిజిటల్ నరులు ప్రయాణాలు అధికంగా చేయడం, భార్యాభర్తలు ఉద్యోగాలు చేయడం, ఆర్థికంగా బలపడడం, బజారు రుచులకు అలవాటు పడడం లాంటి అవలక్షణాలతో జంక్ ఫుడ్ విప్లవం కొనసాగుతున్నది. డీప్ ఫ్రై లేదా అతి వేపుడు చేసిన జంక్ అండ్ ఫాస్ట్ ఆహారం తీసుకోవడం వల్ల స్థూలకాయం లేదా అధిక బరువు, మధుమేహం/బీపీ లాంటి జీవనశైలి రుగ్మతలు, కొలెస్టరాల్ పెరగడం, గుండె జబ్బులు, చర్మ వ్యాధులు, జీర్ణ సంబంధ వ్యాధులు, అలసట, సోమరితనం, మానసిక అస్థిరత, ఏకాగ్రత లోపించడం, దంత సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్లు, కాలేయం/ మూత్రపిండ సమస్యలు, పోషకాహార లోపం, నిరాశ, దురలవాటుగా మారడం, మానసిక సమస్యలు లాంటి అనారోగ్యాలు కలుగుతాయి. మహా నగరాలకు పరిమితమైన జంక్ ఫుడ్ నేడు వాడవాడల్లో తిష్ట వేసింది. 1996లో మెక్‌డొనాల్డ్ సెంటర్ల రాకతో నేడుఅలాంటి శాఖలు 400లకు పైగా ఉన్నాయి. నేడు భారత్‌లో దాదాపు 400 వరకు పేరుమోసిన సెంటర్లు నడుస్తున్నాయి. జంక్ ఫుడ్‌ను ప్రచారం చేస్తున్నాయి. నేడు బహుళ జాతి సంస్థలు నెలకొల్పిన మాల్స్ ద్వారా జంక్‌ఫుడ్ విరివిగా అమ్ముడుపోతున్నది, ఆరోగ్యాలను కాటు వేస్తున్నది. బర్గర్లు, పిజ్జాలు, వైట్ బ్రెడ్, వేపుడు పదార్థాలు, కుక్కీస్, పొటా టో చిప్స్, ఐస్ క్రీమ్స్, శీతల పానీయాలు, చాకొలేట్స్, ప్రాసెస్డ్ మీట్, స్ట్రీట్ ఫాస్ట్ ఫుడ్స్ లాంటిరూపాల్లో జంక్ ఫుడ్స్‌గా మార్కెట్‌లను ముంచెతున్నాయి. భారత్‌లో ప్రతి ఏటా జంక్ ఫుడ్ వినియోగం 10 శాతం వరకు పెరగడం తో పాటు 93శాతం వరకు పిల్లలు వారానికి రెండు పూటలు జంక్ ఫుడ్, 56శాతం పిల్లలు ఐస్‌క్రిమ్స్/ చాకొలెట్స్ తింటున్నారు. కౌమార యువత రోజుకు ఒక్కసారైనా ప్యాకెట్ ఫుడ్స్ తింటున్నట్లు, 40శాతం పిల్లలలంచ్‌బాక్సుల్లో ప్యాకెట్ ఫుడ్స్ ఉంటున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇంటి వంటలు ఆరోగ్య ప్రదాయినులని, బజారు చిరుతిండ్లు బేజారు చేస్తాయని, జంక్‌ఫుడ్స్ తింటే రోగాలు దండయాత్ర చేస్తాయని, మన ఆహారమే మన ఆరోగ్యానికి మూలమని తెలుకొని, అనునిత్యం పోషకాహారం తీసుకుంటూ, సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవిద్దాం. ●

# వాన కోసం ఎదురు చూపులు.. కరవు కోరల్లో రైతులు

మేకిరి దామోదర్

తెలంగాణలో జూలై సగం దాటినా ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సాధారణంగా ఈ సమయానికి పచ్చదనంతో కళకళలాడాల్సిన పొలాలు ఇంకా బీడుగా కనిపిస్తున్నాయి. విత్తనాలు చేతిలో పట్టుకుని రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి కొరతపై చర్చలు మొదలయ్యాయి. చెరువులు, కుంటలు, వాగులు నీరులేక వెలవెలబోతున్నాయి. వర్షం కురవకపోతే కేవలం పంటలేకాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం కుదేలయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇటీవలి వాతావరణ విశ్లేషణలు ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావం కొనసాగవచ్చని, దాని కారణంగా దక్షి ణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటేతక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని సూచిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటివరకు నమోదైన వర్ష పాతం సాధారణ స్థాయికంటే గణనీయంగా తక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వర్షపాతం లోటు కొన్ని ప్రాంతాల్లో 30నుంచి 40శాతం వరకు ఉండే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కొనసాగితే కరవు పరిస్థితులు ఏర్పడే ప్రమాదాన్ని విస్మరించలేం. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాం తాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ దృగ్విషయం. ఈ ప్రభా వం ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం నమూనాలను మార్చే స్తుంది. భారత నైరుతి రుతుపవనాలపై కూడా దీని ప్రభా వం పడుతుంది. ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షాలు తగ్గడం, వేడి తరంగాలు అధికం కావడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి. గతంలో కూడా బలమైన ఎల్‌నినో సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిన్న సందర్భాలున్నాయి. ఇప్పుడు శాస్త్రవేత్తలు 'సూపర్ ఎల్‌నినో' అవకాశాలపై హెచ్చరిస్తుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. తెలంగాణ వ్యవసాయం ఇప్పటికీ ప్రధానంగా వర్షాధారంగానే కొనసాగుతోంది. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటల సాగు సమయానికి వర్షాలు అత్యంత కీలకం. ఇప్పటికే విత్తే కాలం ఆలస్యం కావడంతో రైతులు తీవ్ర అనిశ్చితిలో ఉన్నారు. ఆలస్యంగా విత్తిన పంటలకు దిగుబడి తగ్గే అవకాశం ఎక్కువ. తిరిగి విత్తనాలు కొనుగోలు చేయడం, భూమిని మళ్లీ సిద్ధం చేయడం రైతులకు అదనపు ఆర్థిక భారంగా మారుతోంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ పరిస్థితుల్లో తక్కువ నీటితో సాగయ్యే జొన్న, సజ్జ, రాగులు, పెసలు, కందులు, మినుములు వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలని సూచిస్తున్నారు. మార్కెట్, నేల స్వభావం, స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ మండల స్థాయిలో రైతులకు శాస్త్రీయ సలహాలు అందించాలి. రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులు, మధ్యతరహా జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోతే ముందుగా



ప్రభావం తాగునీటిపైనే పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో బోర్లు ఎండిపోవడం, భూగర్భ జలమట్టాలు పడిపోవడం, పట్టణాల్లో కూడా నీటి సరఫరాపై ఒత్తిడి పెరగడం వంటి పరిణామాలు సంభవించవచ్చు. భారతదేశంలో వినియోగించే మంచినీటిలో దాదాపు 80 శాతానికి పైగా వ్యవసాయ రంగమే వినియోగిస్తోంది. వర్షాలు తగ్గితే సాగునీటి అవసరాలు పెరుగుతాయి. అదే సమయంలో తాగునీటి అవసరాలను కూడా తీర్చాల్సి వస్తుంది. ఈ పరిస్థితిలో నీటి వినియోగంపై కఠినమైన ప్రణాళిక అవసరం. కరవు అంటే కేవలం పంటలు ఎండిపోవడం మాత్రమే కాదు. గ్రామీణఉపాధి తగ్గిపోవడం, వ్యవసాయ కూలీలకు పని లేకపోవడం, పశుగ్రాసం కొరత, పాల ఉత్పత్తి తగ్గడం, ఆహార ధరలు పెరగడం, గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరగడం వంటి అనేక సామాజిక-ఆర్థిక సమస్యలు వెంటవస్తాయి. చిన్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, పశుపోషకులే మొదటిగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. పరిస్థితి మరింత దిగజారకముందే ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కరవు నివారణ కార్యాచరణ ప్రారంభించాలి. మండలాల వారీగా వర్షపాతం, పంటల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ. తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ. పశుగ్రాస నిల్వ కేంద్రాల ఏర్పాటు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన, ఉచిత సాంకేతిక సలహాలు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, వడ్డీ భారం తగ్గింపు. పంట బీమా క్లెయిమ్‌లను వేగవంతం చేయడం. ఉపాధి హామీ పనులను విస్తరించి గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించడం. మైక్రో ఇరిగేషన్, డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులకు అధిక ప్రోత్సాహం. చెరువులు, కుంటలు, వర్షపు నీటి సంరక్షణ పనులను అత్యవసరంగా చేపట్టడం. కరవు నివారణలో ప్రభుత్వం ఒక్కటే బాధ్యత వహించదు. ప్రతి కుటుంబం నీటిని పొదుపుగా వినియోగించాలి. వర్షపు నీటి సంరక్షణను అలవాటు చేసుకోవాలి. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాలి. భూగర్భ జలాలను విచక్షణారహితంగా వినియోగించకుండా జాగ్రత్తలు పాటించాలి. వాతావరణ మార్పుల యుగంలో నీటి సంరక్షణ ఒక సామాజిక ఉద్యమంగా మారాల్సిన అవసరం ఉంది. కరువును ఎదుర్కోవాలంటే ప్రతి ఏడాది వర్షాలపై ఆధారపడే వ్యవస్థకు బదులుగా వాతావరణ మార్పులకు అనుగుణమైన వ్యవసాయ విధానాలను అవలంబించాల్సిన సమయం వచ్చింది. తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలు, పంటల వైవిధ్యీకరణ, నీటి పొదుపు సాంకేతికతలు, వాతావరణ సూచనలను రైతులకు వేగంగా చేరవేసే డిజిటల్ వ్యవస్థలు, గ్రామస్థాయిలో నీటి బడ్జెట్ రూపొందించడం వంటి చర్యలు భవిష్యత్తులో కరవు తీవ్రతను తగ్గించగలవు. తెలంగాణ మరోసారి కరవు నీడలోకి జారిపోకుండా ఇప్పుడే అప్రమత్తం కావాల్సిన సమయం ఇది. కరవు అనేది కేవలం వర్షాల లేమి కాదు, అది పాలనా సన్నద్ధత, శాస్త్రీయ ప్రణాళిక, ప్రజల బాధ్యతను పరీక్షి ంచే పరిస్థితి. ఆకా శం నుంచి కురిసే ప్రతిచుక్కను ఒడిసిపట్టే సంకల్పం, రైతు ను నిలబెట్టే విధానాలు, నీటిని కాపాడే సామాజిక చైతన్యం కలిసివస్తేనే ఈ సవాలును అధిగమించగలం. నేడు తీసుకునే ముందస్తు నిర్ణయాలే రేపటి రాష్ట్ర జీవజలంగా నిలుస్తాయి. వర్షాల కోసం

# ప్రజావాక్కు

### ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌కు సగం జనరల్ బోగీలు వెయ్యాలి

వందే భారత్, వందే మాతరం రైళ్లు ఎవడు అడిగాడు? అన్నీ ఏసీ రైళ్లు వేస్తున్నారు. రైల్వే మంత్రికి ప్రజల సామాజిక పరిస్థితులు తెలుసా! సామాన్యుడు రైలు ఎక్కాలంటే యుద్ధం చేసినంత పని అవుతుంది. ప్యాసింజర్ రైళ్లు తీసేసి వాటిని ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చారు. ఒకటి రెండు జనరల్ బోగీలు వేస్తారు. బుద్ధి జ్ఞానం ఉందా ఆ అధికారులకు అన్న అనుమానం వస్తుంది. గతంలో కాకినాడ తిరుపతి ప్యాసింజర్ రైలు ఉండేది. తిరుపతి వెళ్లే వారికి అది చాలా అనుకూలంగా ఉండేది. ఇప్పుడు దాన్ని రద్దుచేసి ఎక్స్‌ప్రెస్ చేసి ఒకటి రెండు జనరల్ బోగీలు వేశారు. రైల్వే మంత్రిని ఈ జనరల్ బోగీల్లో ప్రయాణం చెయ్యమని చెప్పండి. ప్రయాణికుల బాధలు తెలుస్తాయి. కృష్ణ ఎక్స్‌ప్రెస్ కూడా మొదటిలో అన్ని జెనరల్ బోగీలు ఉండేవి. ఒకటి రెండు రిజర్వేషన్ ఉండేది. ఇప్పుడు అన్ని రిజర్వేషన్ చేసి, ఒకటో రెండో జనరల్ బోగీలు వేశారు. ప్రతి ఎక్స్‌ప్రెస్‌కు సగంజనరల్ బోగీలు వేయాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### కుటుంబ సభ్యులందరికి ఒకే చోట..

సర్ కొన్నిచోట్ల బీఎల్ఓ తెలియకనో, చాదస్తమో, మరి యేం టోగాని ఫాం ఒకే కుటుంబం ఓటర్‌లిస్ట్ గతంలో తప్పులుగా నమోదుచేసి బిలేవోలు నేటికీ నాల్గురు నాలుగు పామ్ తీసుకువచ్చి మాకు ఇవ్వాలని అనడం వారి విధుల పట్ల వారికి ఎంతవరకు అవగాహన ఉందో దీన్ని బట్టి అర్థమవుతోంది. ఇప్పటికైనా విషయంతెలుసుకొని వ్యవహరించాలి. తప్పుడు సమాచారం మిడిమిడి జ్ఞానంతో ఉండకూడదు. మీకే కదా పనిభారం తగ్గుతుంది. ఒకే కుటుంబంలోని ఓటర్ లిస్ట్‌ఒకే బూతులో ఉండాలి. గతంలోనీ తప్పులు వేరువేరు బూతులలో మళ్ళీ జరుగకుండా జాగ్రత్త తీసుకోవాల్సింది. ఎన్నికల కమిషన్ అధికారులు నమోదు చేసేవిధంగా ఉండాలి.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

### అదనపు టీచర్లను ఏర్పాటు చేయాలి

కరీంనగర్ జిల్లాలో ఉన్న ఎస్సీ సైనిక్ స్కూల్, వరంగల్ జిల్లాలో ఉన్న ఎస్టిసైనిక్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎక్కువ సిబ్బంది ఉండాలి. అన్ని టీచింగ్ సబ్జెక్టులతో పాటుగా జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్, పోటీ పరీక్షలు ఆర్థిక సామాజిక విషయాలపై అవగాహన కోసం మిగులు టీచింగ్ సిబ్బందిని ఉపయోగించాలి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

### రైతుల ఆదాయం పెంచాలి

కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు రైతులఆదాయం రెట్టింపు చేయాలి అని కోరికను వెళ్ళిబుచ్చుతూ ఉంటుంది. నిజమే రైతుల ఆదాయం రెట్టింపు చేయవలసిందేఅందులో సందేహం లేదు. కరోనా, యుద్ధ వాతావరణం సృష్టించిన సంక్షోభ పరిస్థితులు రైతులు ఆయిల్ ఫామ్‌వైపు వెళ్ళేట్టు చేసాయి. రైతులు ఆయిల్‌ఫామ్ ద్వారా కొంతపంట వైవిధ్యతను ఆదాయన్ని పొందుతున్నారు. ఉపాధి హామీ ద్వారా ఒక పిట్ తీసి అందులో మొక్క పెడితే దాని ద్వారా వచ్చేఆదాయం 33 రూపాయలు ఆలా ఎకరం స్థలంలో 1000 మొక్కలు పెడితే వచ్చే ఆదాయం ఎంతో మనమే ఊహించవచ్చు. అంత మాత్రమే కాదు వాటిని ఎకరం స్థలంలో పెట్టి కాపాడినందుకు నెలకు ఒక మొక్కకు 20 రూపాయల చొప్పున చెల్లించే ఈ అవకాశం రైతులు ఉపయోగించుకుంటే బాగుంటుంది. ఇలా చేస్తే రైతుల ఆదాయం పెరగడం మాత్రమే కాదు వారి జీవన ప్రమాణ స్థాయీ కూడా పెరుగుతుంది.

- భారత అవినాష్, జనగామ

### ఉత్తీర్ణత శాతం పెంచాలి

పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత శాతం పెరగాలని ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష ్యం కావడంతో ప్రతి సబ్జెక్టు టీచర్ ఒక్కో రోజు ఒక్కో స్టడీ అవర్ నిర్వహించవలసి వస్తూ ఉన్నది ఉదయము సాయంత్రం రెండు గంటలు అదనంగా పని చేయవలసి వస్తూ ఉన్నది. ఇలాంటి ఈ నేపథ్యంలో ప్రతి దానికి ప్రధానోపాధ్యాయుడు అనుమతి అవసరమైన సంద ర్భంలోప్రధానోపాధ్యాయుడు కూడా ఉదయము సాయంత్రం సదరు ఉపాధ్యాయునితో ఖచ్చితంగా ఉండేలాంటి నియమ నిబంధన ప్రభుత్వం ఎందుకు విధించడం లేదు? అతనిని బాధ్యుడిగా ఎందుకు చేయడం లేదు? భార్యాభర్తల అయిన వారు వేరువేరు పాఠశాలల్లో పని చేసినప్పటికీ ఒకే ఇంట్లో ఉంటారు. వారికి జీతభత్యాలతో పాటు ఇస్తున్నటువంటి ఇంటి అద్దె ఇద్దరికీ ఇవ్వడం ఎంతవరకు సమంజసం?

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### ఆకాశం వైపు అన్నదాత చూపు

జూలై మాసం గడుస్తున్న ఇంకా సరిపడా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో ఇలాగే ఉంటే అన్నదాతలు అప్పులపాలు అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ పంటల పట్ల అవగాహన కల్పించాలి. రైతులను ఆదుకోవాలి.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

21-7Pg5exN:21-7Pg5exN.qxd 7/20/2026 11:03 PM Page 1



# సిట్‌ను పునర్వ్యవస్థీకరించండి




## ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సూచించిన సుప్రీంకోర్టు

## రామమందిర విరాళాల వివాదం

**న్యూఢిల్లీ, జులై 20:** శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందిన విరాళాలు, కానుకల నిర్వహణలో జరిగినట్లు ఆరోపించబడిన ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు చేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను పునర్‌వ్యవస్థీకరించడాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సోమవారం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ దర్యాప్తునకు ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి నేతృత్వం వహించాలని, దానిని 'తార్కిక ముగింపు'కు తీసుకువెళ్లాలని కూడా పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్య కాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని హెచ్చరించింది. ఒక నేరం జరిగినట్లు ఆరోపణలు వచ్చినప్పుడు, దానిపై నిష్పక్షపాత దర్యాప్తు జరిగేలా చూడటమే న్యాయస్థానాల బాధ్యత అని వ్యాఖ్యానించింది.

విచారణ సందర్భంగా, కేంద్రం, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఒక సీల్డ్ కవర్‌లో స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసినట్లు తెలియజేశారు. 'దర్యాప్తు కొనసాగుతోంది. ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఈ దశలో ఎక్కువ వివరాలు వెల్లడించలేం' అని ఎస్‌జి మెహతా తెలిపారు.

దర్యాప్తు బృందం కూర్పు వివరాలను సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కోరగా, ఆరోపణల వాస్తవికతను నిర్ధారించడానికి మాత్రమే గతంలో సిట్‌ను ఏర్పాటు చేశారని, అదే స్వయంగా నేర దర్యాప్తు చేపట్టడం లేదని ఎస్జీ మెహతా స్పష్టం చేశారు. 'ఇప్పుడు ఎవరు దర్యాప్తు చేస్తున్నారు? దర్యాప్తు అధికారులు ఎవరు?' అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనికి స్పందిస్తూ, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షణలో సంబంధిత పోలీసు అధికారులు దర్యాప్తు నిర్వహిస్తున్నారని ఎస్జీ మెహతా తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన సిట్‌లో ఇద్దరు ఐఎఎస్ అధికారులు, ఒక సీనియర్ ఐపి ఎస్ అధికారితో సహా సీనియర్ అధికారులు ఉన్నారని సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కొనసాగుతున్న దర్యాప్తును, ఈ విషయంపై ఇప్పటికే అవగాహన ఉన్న ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి నేతృత్వంలో పునర్‌వ్యవస్థీకరించిన సిట్‌కు అప్పగించాలని సూచించింది. 'కొనసాగుతున్న దర్యాప్తు కోసం ఒక సిట్‌ను ఏర్పాటు చేయండి. ఈ అధికారికి ఈ విషయంపై అవగాహన ఉంది కాబట్టి, ఆయనే దానికి నేతృత్వం వహించవచ్చు. ప్రభుత్వంతో మాట్లాడి, సిట్ ను పునర్‌వ్యవస్థీకరించండి. ఏవైనా అదనపు ఆదేశాలు అవసరమైతే, తాము వాటిని జారీ చేస్తామ్ను' అని సుప్రీంకోర్టు పేర్కొంది. సిట్ పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనపై స్టేటస్ రిపోర్ట్, రాష్ట్ర ప్రభుత్వ స్పందనను పరిశీలించిన తర్వాత, వచ్చే సోమవారం ఈ విషయాన్ని మళ్లీ విచారణకు స్వీకరిస్తామని సుప్రీంకోర్టు సూచించింది. 'తాము కేవలం హెచ్చరిస్తున్నాము, ఈవిషయాన్ని రాజకీయం చేయవద్దు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగి, తార్కిక ముగింపునకు చేరాల్లి' అని సీజేఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ, 'కోర్టులు రాజకీయాలకు వేదిక కాద్ను' అని కూడా పేర్కొంది.

# హైకోర్టు జడ్జిలకు ఒకే విధానం

## అత్యున్నత కమిటీని ఏర్పాటు చేయండి

## 3 నెలల్లోగా సిఫారసుల నివేదికివ్వండి

## కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 20:** దేశంలోని పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులకు సౌకర్యాల కల్పనలో ఏకరూప విధానం తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటుచేసి, మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులకు లభించే భద్రత, ఇతర పదవీ విరమణానంతర సౌకర్యాలకు సంబంధించి పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల సంఘం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. తమ ముందు లేవనెత్తిన ఆందోళనలను విన్న సిజెఐ, 'రాష్ట్రానికి రాష్ట్రానికి ఇటువంటి సౌకర్యాలు మారడానికి ఎటువంటి కారణం లేదుకాబట్టి, ఈ సౌకర్యాలను ఏకరూప ప్రాతిపదికన నిర్ధారించాలనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ దృక్కోణాన్ని దృష్టిలో ఉంచుకుని, ఏకరూప మార్గదర్శకాలను, అలాగే ఆర్థిక సహాయం అందించే విధానం, యంత్రాంగాన్ని నిర్దేశించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తాము భారత కేంద్ర ప్రభుత్వాన్ని కోరాము' అని అన్నారు. దీని ప్రకారం, ఏర్పాటు చేసిన కమిటీ, అది ఏర్పడిన తేదీ నుండి మూడు నెలలలోపు తన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని, అలాగే వాటిని కోర్టు ముందు కూడా ఉంచాలని ధర్మాసనం ఆదేశించింది.

# 'అపార్ణ్ ఐడి నిర్బంధం కాదు, ఐచ్ఛికమే!

## డేటా రక్షణ ఆందోళనలు పరిశీలించాలి

## సిబిఎస్ఇకి సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ, జులై 20:** 'అపార్ణ్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడిల జారీ కోసం ఇచ్చే సమ్మతి పత్రంలో స్పష్టమైన "ఆప్ట్ అవుట్" ఎంపికను తప్పనిసరి చేస్తూ ఒడిశా హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్య కాంత్, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఎపిఎఎఆర్ (అపార్) పథకం స్వచ్ఛందంగా ఉండేలా, తల్లి దండ్రుల సమ్మతి పత్రాలలో సమ్మతిని నిరాకరించడానికి స్పష్టమైన అవకాశం ఉండేలా తగిన ఆదేశాలు జారీ చేస్తామని సూచించింది. 'ఒడిశా హైకోర్టు ఉత్తర్వును అంగీకరించినందున... ఈ తీర్పును పాన్‌ఇండియా ప్రాతిపదికన అమలు చేయాలి. ఈ సమస్యలను కూడా పరిశీలించాలని తాము సిబిఎస్ఇని ఆదేశిస్తున్నాము," అని విచారణ సందర్భంగా సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సిబిఎస్ఇ సర్క్యులర్లు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టం, 2023తో సహా అమలులో ఉన్న చట్టానికి లోబడి ఉంటాయని, ఈ పథకాన్ని ప్రస్తుత చట్టపరమైన చట్రానికి అనుగుణంగా అమలు చేయాల్సి ఉంటుందని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'అపార్ణ్ ఐడి పథకం రాజ్యాంగ బద్ధతను, బోర్డు పరీక్షల రిజిస్ట్రేషన్ కోసం 'అపార్ణ్ ఐడిలను తప్పనిసరి చేయాలన్న సిబిఎస్ఇ నిర్ణయాన్ని సవాలు చేస్తూ నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపి ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

# హిందూ వివాహం ఒక ఒప్పందం కాదు

## భార్యపై ఆసక్తి పోయిందంటే కుదరదు: కర్ణాటక హైకోర్టు స్పష్టీకరణ

## విడాకుల అభ్యర్థనను కొట్టివేసిన కోర్టు




**బెంగళూరు, జులై 20:** కేవలం తన జీవిత భాగస్వామిపై ఆసక్తి పోయిందన్న కారణంతో ఒక వ్యక్తి వివాహబంధం నుండి వైదొలగడం లేదా విడాకులు కోరడం కుదరదని కర్ణాటక హైకోర్టు విస్పష్ట తీర్పునిచ్చింది. న్యాయమూర్తులు డి.కె.సింగ్, టి.ఎం.నాడాఫ్‌లతో కూడిన ధర్మాసనం, హిందూ చట్టం ప్రకారం వివాహం అనేది ఒక పవిత్ర బంధం అని, అది కేవలం ఒక ఒప్పందం కాదని నొక్కి చెప్పింది. కాబట్టి, వివాహం జరిగిన తర్వాత అది జీవితకాలం కొనసాగుతుందని పేర్కొంది. 'హిందూ చట్టం ప్రకారం వివాహం అనేది ఒక పవిత్ర బంధం, అది ఒప్పందం కాదు. వివాహం జరిగిన తర్వాత అది జీవితకాలం ఉంటుంది. అవతలి వ్యక్తిపై ఆసక్తి లేదన్న కారణంతో ఎవరూ ఆ వివాహ బంధం నుండి వైదొలగలేర్ను' అని ధర్మాసనం తీర్పునిచ్చింది. హిందూ వివాహ చట్టం, 1955లోని సెక్షన్ 13(1ఎ) కింద విడాకులు కోరుతూ భర్త దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసే క్రమంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రేమించి పెళ్లి చేసుకుని, ఇప్పుడు దాదాపు వయోజనురాలైన కుమార్తెకు తండ్రి అయిన భర్త, కేవలం వివాహంపై ఆసక్తి కోల్పోయానని చెబుతూ కోర్టును ఆశ్రయించడం ద్వారా తన తప్పును తానే సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని హైకోర్టు గమనించింది. హిందూ చట్టం ప్రకారం వివాహం ఒక సంస్కారం, ఒప్పందం కాదని, ఆసక్తి లేదనే కారణంతో ఒక పక్షం దాని నుండి వైదొలగలేదని కోర్టు పునరుద్ఘాటించింది. అందువల్ల, ఫ్యామిలీ కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం కనిపించకపోవడంతో, అప్పీల్‌ను కొట్టివేసింది.

# సుప్రీం జడ్జిల పెంపు బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం

**న్యూఢిల్లీ, జులై 20:** సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను మరోసారి పెంచేందుకు కేంద్రం సిద్ధమైంది. దీని కోసం రూపొందించిన బిల్లును కేంద్రం లోక్‌సభలో సోమవారం ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్‌మెంట్ బిల్, 2026ను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌పాల్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనిప్రకారం ఇప్పటికే ఉన్న సుప్రీంకోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) యాక్ట్, 1956ను మార్చనున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టడం విశేషం. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 33 మంది జడ్జీలున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య 37కు పెరుగుతుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో నీట్ యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ప్రభుత్వం ఈ బిల్లును కేంద్రం సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు కొత్తదేం కాదు. దీనిపై కేంద్రం గతంలోనే ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనికి రాష్ట్రపతి కూడా ఇంతకుముందే ఆమోదం తెలిపారు. ఈ ఆర్డినెన్స్ ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను 37కు పెంచుకోవచ్చు. దీన్ని పూర్తిస్థాయి చట్టంగా తీసుకురావాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. అందుకోసమే బిల్లును రూపొందించి, ప్రవేశపెట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 ప్రకారం సుప్రీకోర్టు జడ్జీల సంఖ్యను చట్టం ద్వారా పార్లమెంటే నిర్ణయించవచ్చు. దీనికోసం సాధారణ మెజారిటీ ఉంటే చాలు. ఇతర రాజ్యాంగ సవరణ చట్టాలలాగా మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం లేదు. దీంతో ఈ బిల్లు త్వరగానే ఆమోదం పొందే అవకాశం ఉంది.

# చర్చలు అర్థవంతంగా, వాస్తవాల ఆధారంగా సాగాలి

## పార్లమెంటు సమావేశాల సందర్భంగా విపక్షాలకు మోడీ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ, జులై 20:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, రాజకీయ పార్టీలకు కీలక సందేశం ఇచ్చారు. ఈ సమావేశాలు దేశానికి అత్యంత ఫలవంతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, పార్లమెంట్‌లో చర్చలు తర్కం, వాస్తవాల ఆధారంగా సాగాలని అన్నారు. వాదనలు, వాస్తవాలు ఉన్నచోట అనవసరమైన రాద్ధాంతం అవసరం లేదు. వాస్తవాలు బలంగా ఉంటే గొంతు పెంచాల్సిన అవసరం ఉండదని ప్రధాని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు మీడియాతో మాట్లాడిన ప్రధాని మోడీ రుతుపవనాలు ఎంత ముఖ్యమో, వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు కూడా అంతే ఫలవంతంగా సాగాలని ఆకాంక్షించారు. రుతుపవనాలు చురుకుగా ఉండి రైతులకు మేలు చేయడంతో పాటు, పార్లమెంట్ సమావేశాలు కూడా సజావుగా జరిగి దేశ ప్రయోజనాలకు దోహదపడాలని కోరుకున్నారు. దేశ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను కూడా ప్రధాని వివరించారు. ఇటీవల రాజస్థాన్లో భారీ చమురు శుద్ధి కర్మాగారాన్ని దేశానికి అంకితం చేసినట్లు గుర్తు చేశారు. అలాగే దేశంలోని మూడో సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభం, గ్రీన్ హైడ్రోజన్తో నడిచే రైలు ప్రారంభం వంటి ప్రాజెక్టులు భారత సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనాలని పేర్కొన్నారు. ప్రపంచంలో కొద్ది దేశాలకు మాత్రమే ఉన్న గ్రీన్ హైడ్రోజన్ రైలు సాంకేతికత ఇప్పుడు భారత్లో అందుబాటులోకి రావడం గర్వకారణమని చెప్పారు ప్రధాని మోడీ. గత నెలలో భారత్ సాధించిన పలు విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. జాతీయ, అంతర్జాతీయ, అంతరిక్ష రంగాల్లో దేశం విశేష పురోగతి సాధించిందని తెలిపారు. ఇటీవల ఒక భారతీయ యువత నేతృత్వంలోని స్టార్టప్ అంతరిక్ష రంగంలో కీలక మైలురాయిని చేరుకోవడం దేశానికి గర్వకారణమని అన్నారు. గత ఏడాది భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉండగా, ఇప్పుడు భారత యువత అంతరిక్ష సాంకేతిక రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తోందని పేర్కొన్నారు. ఇది యువత సామర్థ్యం, ఆశయాలు అపరిమితమని ప్రపంచానికి చాటి చెబుతోందని అన్నారు మోడీ. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపిన వివరాల ప్రకారం, జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు 25 రోజుల వ్యవధిలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగనున్నాయి. ఈ కాలంలో మొత్తం 19 సమావేశాలు జరగనున్నాయి. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై చర్చలు, సంప్రదింపులు, కీలక నిర్ణయాలు ఈ సమావేశాల్లో తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించి ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని ఆకాంక్షించారు ప్రధాని నరేంద్ర మోడీ.

# హమాస్ కొత్త అధినేతగా ఖలీల్ అల్‌హయ్యా



**గాజాసిటీ, జులై 20:** తీవ్రవాద సంస్థ హమాస్‌కు కొత్త నాయకుడు ఎన్నికయ్యారు. ఖలీల్ అల్-హయ్యాను తమ అధిపతిగా ఎన్నుకున్నట్లు హమాస్ ప్రకటించింది. గతంలో గాజాలోని హమాస్ రాజకీయ విభాగానికి నాయకత్వం వహించిన అల్‌హయ్యా ఇప్పుడు సంస్థకు అత్యున్నత స్థాయి నాయకుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన హమాస్ దాడి అనంతరం ప్రారంభమైన యుద్ధంలో కాల్పుల విరమణ, బందీల విడుదలకు సంబంధించిన చర్చల్లో ఖలీల్ అల్‌హయ్యా కీలక పాత్ర పోషించారు. హమాస్ ప్రధాన సంధానకర్తగా కూడా ఆయన వ్యవహరించారు. హమాస్ మాజీ నాయకులు యహ్యా సిన్వార్, ఇస్మాయిల్ హనియే మరణాల తర్వాత గత రెండేళ్లుగా ఐదుగురు సభ్యులతో కూడిన నాయకత్వ మండలి సంస్థను నడిపించింది. తాజాగా జరిగిన అంతర్గత ఎన్నికల్లో అల్‌హయ్యా కొత్త నాయకుడిగా ఎంపికయ్యారు. గాజా స్ట్రిప్‌లో జన్మించిన ఖలీల్ అల్‌హయ్యా తన జీవితంలో ఎక్కువ భాగాన్ని అక్కడే గడిపారు. 2023 అక్టోబర్ దాడులకు కొద్దికాలం ముందు గాజా నుంచి ఖతార్‌కు వెళ్లిన ఆయన అప్పటి నుంచి అక్కడి నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# డెంగ్యూ వ్యాక్సిన్ 'క్యూడెంగా' రెడీ



**న్యూఢిల్లీ, జులై 20:** వర్షాకాలం ప్రారంభమైతే దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు వేగంగా పెరుగుతుంటాయి. ప్రతి ఏడాది వేలాది మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, కొన్నిసార్లు ప్రాణాపాయ పరిస్థితులు కూడా ఎదురవుతుంటాయి. ఈ నేపథ్యంలో భారతదేశానికి ఊరటనిచ్చే కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశంలో తొలిసారిగా డెంగ్యూ నివారణ కోసం క్యూడెంగా వ్యాక్సిన్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆమోదం లభించింది. ఈ వ్యాక్సిన్ ప్రత్యేకత ఏమిటంటే, టీకా తీసుకునే ముందు డెంగ్యూ పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం లేదు. గతంలో డెంగ్యూ వచ్చినవారు అయినా, ఎప్పుడూ డెంగ్యూ రాకపోయినా ఈ టీకాను తీసుకోవచ్చు. దీంతో డెంగ్యూ నివారణలో ఇది ఒక కీలక ముందడుగుగా వైద్య నిపుణులు భావిస్తున్నారు. క్యూడెంగా వ్యాక్సిన్‌ను రెండు డోసులుగా ఇస్తారు. మొదటి డోస్ తీసుకున్న మూడు నెలల తర్వాత రెండో డోస్ వేయించుకోవాలి.

ఈ టీకాను చర్మం కింద (సబ్‌క్యూటేనియస్) ఇంజెక్షన్ రూపంలో ఇస్తారు. జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ టకేడా అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌ను 4 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల వారికి వినియోగించేందుకు అనుమతించారు. ప్రపంచవ్యాప్తంగా డెంగ్యూ కేసులు అధికంగా నమోదయ్యే దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచ డెంగ్యూ భారంలో దాదాపు మూడింట ఒక వంతు కేసులు భారతదేశంలోనే నమోదవుతున్నట్లు అంచనా. గత రెండు దశాబ్దాల్లో దేశంలో డెంగ్యూ కేసులు దాదాపు 11 రెట్లు పెరిగినట్లు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గత ఏడాదిలోనే లక్షకు పైగా కేసులు నమోదయ్యాయి. అయితే అసలు సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా. డెంగ్యూ వైరస్‌కు నాలుగు రకాల (సెరోటైప్స్) ఉన్న సంగతి తెలిసిందే. ఈ నాలుగు రకాల వైరస్‌ల నుంచి రక్షణ కల్పించేలా క్యూడెంగాను రూపొందించారు. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ వ్యాక్సిన్‌పై 28 వేల మందికి పైగా క్లినికల్ పరీక్షలు నిర్వహించారు. రెండో డోస్ తర్వాత 12 నెలలకు డెంగ్యూ నివారణలో 80.2 శాతం ప్రభావవంతంగా, డెంగ్యూ కారణంగా ఆసుపత్రిలో చేరే ప్రమాదాన్ని 90.4 శాతం వరకు తగ్గించడంలో ఇది సమర్థవంతంగా పనిచేసిందని అధ్యయనాలు సూచించాయి. దీర్ఘకాలిక పరిశోధనల్లో కూడా 4.5 సంవత్సరాల తర్వాత ఆసుపత్రి చికిత్స అవసరాన్ని 84.1 శాతం వరకు తగ్గించినట్లు గుర్తించారు.

ఈ వ్యాక్సిన్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే సిఫార్సు చేసింది. నాణ్యత, భద్రత, ప్రభావం వంటి అంతర్జాతీయ ప్రమాణాలను ఇది అందుకుందని డబ్ల్యుహెచ్ఓ ప్రీక్వాలిఫికేషన్ కూడా పొందింది. ప్రస్తుతం భారత్‌తో పాటు 43 దేశాల్లో ఈ వ్యాక్సిన్‌కు అనుమతి లభించింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 3.2 కోట్లకు పైగా డోసులు పంపిణీ అయ్యాయి. బ్రెజిల్, అర్జెంటీనా, కొలంబియా, ఇండోనేషియా వంటి దేశాల్లో ప్రజారోగ్య టీకా కార్యక్రమాల్లో దీనిని వినియోగిస్తున్నారు.

# భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు

## అమెరికాకు ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్, జులై 20:** అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ 'అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హార్ముజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్య ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తోపాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, దాన్ని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదు' అని తెలిపారు. ఇదిలా ఉండగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్న ప్పటికీ దాన్ని ఎక్కువ రోజులు ఆధీనంలో ఉంచు కోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఇరాన్ చమురు ఎగుమతుల్లో సుమారు 90శాతం ఈ ద్వీపం నుంచే జరుగుతుంది.

**చుక్క చమురు కూడా హార్ముజ్ దాటదు: ఇరాన్**

అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తమ హెచ్చరికలను ఖాతరు చేయకుండా హార్ముజ్ మీదుగా వెళ్తోన్న రెండు నౌకలను ఐఆర్‌జిసి టార్గెట్ చేసింది. వాటిలో పేలుడు సంభవించిందని, అవి కదల్లేని స్థితిలో ఉన్నాయని వెల్లడించింది. అమెరికా దురాక్రమణ కొనసాగుతున్నంతకాలం ఒక్క చుక్క చమురు కూడా సురక్షితంగా హార్ముజ్‌ను దాటదని ఐఆర్‌జిసి హెచ్చరించింది. ప్రతీకార చర్యలకు సిద్ధంగా ఉండాలని



అమెరికాను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసింది. మరోవైపు ఇరాన్‌పై సోమవారం తెల్లవారుజామున అగ్రరాజ్యం మరోసారి దాడులు చేపట్టింది. తమ సైనికుల మరణాలకు ప్రతీకారం తీర్చుకున్నామని, శక్తిమంతమైన దాడులు చేశామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం మొదలైన ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు అమెరికాకు ప్రాణనష్టం 17కు పెరిగింది. ఇదిలా ఉండగా పశ్చిమాసియా దద్దరిల్లుతుండటంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 90 డాలర్లకు చేరింది.

**కువైట్ ప్లాంట్స్‌లో చెలరేగిన మంటలు..**

అమెరికా-ఇరాన్ ఘర్షణలతో గల్ఫ్ దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కువైట్‌లోని అల్ సుబియా పవర్ జనరేషన్, వాటర్ డీసాలినేషన్ ప్లాంట్‌పై టెహ్రాన్ దాడులు చేసింది. దాంతో భారీగా మంటలు చెలరేగాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

# 400 డ్రోన్లతో విరుచుకుపడిన ఉక్రెయిన్



**కీవ్, జులై 20:** రష్యా రాజధాని మాస్కో లక్ష్యంగా ఉక్రెయిన్ ప్రతికార దాడులను తీవ్రతరం చేసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున ఒకేసారి 400 కంటే ఎక్కువ డ్రోన్లతో మాస్కోపై విరుచుకుపడింది. ఇటీవల ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు ఇతర నగరాలపై రష్యా జరిపిన తీవ్ర బాలిస్టిక్ క్షిపణి దాడులకు నిరసనగా ఉక్రెయిన్ ఈ చర్యకు దిగినట్లు అంతర్జాతీయ మీడియా స్పష్టం చేసింది. మాస్కో దిశగా వచ్చిన అత్యధిక డ్రోన్లను రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి. మాస్కో పరిసరాల్లో దాదాపు 85 డ్రోన్లను అడ్డుకున్నట్లు మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ వెల్లడించారు. మాస్కో పరిసర ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో 10 మంది గాయపడినట్లు సమాచారం. పడోల్స్క్‌లోని ఒక ఆయిల్ డిపోతో పాటు, మాస్కో సమీపంలోని యుజ్నే వ్రాతా ఇండస్ట్రియల్ పార్క్‌లో తీవ్ర అగ్నిప్రమాదాలు సంభవించాయి. పలు నివాస భవనాలు దెబ్బతిన్నాయి. ఉక్రెయిన్ వైమానిక రక్షణ లోపాలను అనుకూలంగా మార్చుకునేందుకు రష్యా ఇటీవల బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగాన్ని గణనీయంగా పెంచింది. ఆదివారం రష్యా జరిపిన దాడుల్లో ఉక్రెయిన్‌లో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయపడినట్లు తెలిసింది.

# సంక్షిప్త వార్తలు

## ఎబోలా వైరస్: కాంగాలో 930కి పెరిగిన మృతుల సంఖ్య




**బునియా, జులై 20:** మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. మే15నుంచి శనివారంనాటికి దేశ వ్యాప్తంగా 2,344 కేసులు నమోదు కాగా దాదాపు 930 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ఆరోగ్యశాఖ తాజాగా వెల్లడించింది. శుక్రవారం నుంచి 24 గంటల వ్యవధిలో 37మరణాలు నమోదైనట్లు తెలిపింది. ప్రస్తుతం కాంగోలో నమోదవుతున్న కేసులన్నీ బుండిబుగ్యో ఎబోలా రకానివే. ఈ తరహా కేసులు నమోదవుతున్నట్లు మే 15న అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఈ వైరస్‌ను అరికట్టేందుకు ప్రస్తుతం వ్యాక్సిన్ గానీ, చికిత్స గానీ అందుబాటులో లేవు.

## నాలుగో బిడ్డకు జన్మనిచ్చిన ఉషావాన్స్



**వాషింగ్టన్, జులై 20:** అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ శుభవార్త పంచుకున్నారు. ఆయన సతీమణి ఉషావాన్స్ ఆదివారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) పండంటి మగబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. అతనికి అలెక్ నీల్ వాన్స్ అని పేరు పెట్టామని చెప్పారు. తల్లి, బిడ్డఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారంటూ జెడి వాన్స్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తమ ముగ్గురు పిల్లలు తమ్ముడిని చూసి సంతోషిస్తున్నారని తెలిపారు. 2014లో ఉష, జెడివాన్స్ వివాహం చేసుకున్నారు. వీరికి ఇప్పటికే ఇద్దరు కుమారులు ఇవాన్(9), వివేక్(6), కుమార్తె మిరాబెల్ (4)ఉన్నారు. ఇప్పుడు నాలుగో సంతానానికి జన్మనిచ్చారు. ఉషావాన్స్ తెలుగు మూలాలున్న వ్యక్తి అన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తమ చిన్న కుమారుడి పేరులో 'నీల్' అని చేర్చడం ఆసక్తికరంగా మారింది.

## భారీ వర్షాలతో చార్‌ధామ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్



**డెహ్రాడూన్, జులై 20:** ఉత్తరాఖండ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, భారత వాతా వరణశాఖ జారీ చేసిన రెడ్ అలర్ట్ నేపథ్యంలో చార్‌ధామ్ యాత్రను సోమవారం నుంచి తాత్కాలికంగా నిలిపివేశారు. కుండపోత వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం, వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గఢ్వాల్ కమిషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం యాత్ర మార్గంలో ఉన్న భక్తులను సురక్షిత ప్రాంతాల్లో వసతి కల్పించాలని, రహదారులు పూర్తిగా సురక్షితమని అధికారులు ప్రకటించిన తర్వాతే యాత్రను తిరిగి కొనసాగించేందుకు అనుమతించాలని సూచించారు.

## అయోధ్య కానుకల లెక్కింపునకు ఎస్‌బిఐ పర్యవేక్షణ



**న్యూఢిల్లీ, జులై 20:** అయోధ్య రామమందిరానికి భక్తుల నుంచి అందుతున్న విరాళాల లెక్కింపు ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆలయ విరాళాల (కానుకల) లెక్కింపు బాధ్యతలను దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షించనుంది. భక్తుల రద్దీ విపరీతంగా పెరగడం, అందుకు అనుగుణంగా కానుకల రూపంలో వస్తున్న నగదు, బంగారు, వెండి కానుకలను ఎప్పటికప్పుడు లెక్కించడం ట్రస్ట్ సిబ్బందికి పెద్ద సవాలుగా మారింది.

## సిఎంపై వివాదాస్పద వ్యాఖ్యలు.. డిఎంకె ఎమ్మెల్యే అరెస్టు



**చెన్నై, జులై 20:** ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌పై బహిరంగ సభలో బెదిరింపు వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో డీఎంకే ఎమ్మెల్యే మార్కండేయన్‌ను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. కోవిల్‌పట్టిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయగా, రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేగింది. మార్కండేయన్ అరెస్టు నేపథ్యంలో విలాతికుళంలోని ఆయన నివాసం వద్ద డీఎంకే కార్యకర్తలు, అనుచరులు పెద్ద సంఖ్యలో చేరుకుని నిరసన చేపట్టారు. పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం పోలీసులు నిరసనకారులను చెదరగొట్టి, రోడ్డును ఖాళీ చేయించి ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు.

21-7Pg6exHMNWJQE:21-7Pg6exHMNWJQE.qxd 7/20/2026 11:04 PM Page 1



# విపత్తు ఎప్పుడు, ఎంత తీవ్రతతో సంభవిస్తుందో ఖచ్చితంగా అంచనా వేయడమే కీలకం

● ముందస్తు ప్రణాళిక, సన్నద్ధతే ప్రాణ, ఆస్తి నష్టాల నుండి విముక్తి: పరిశ్రమలు, వాణిజ్యం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** విపత్తు ఎప్పుడు సంభవిస్తుంది, ఎంతసేపు కొనసాగుతుంది, దాని తీవ్రత ఎంత ఉంటుందో ముందుగానే ఖచ్చితంగా అంచనా వేయడం సమర్థవంతమైన విపత్తు నిర్వహణకు మూలాధారం. విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు ప్రణాళిక, సన్నద్ధతే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గిస్తుంది" అని పరిశ్రమలు, వాణిజ్యం (చేనేత, జౌళి) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా పేర్కొన్నారు. మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఏపీఎచ్ఆర్డీఐ)లో శిక్షణ పొందుతున్న ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు విపత్తు నిర్వహణ అంశంపై ఆయన సోమవారం ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ముందుగానే అవసరమైన సిబ్బంది, యంత్రాలు, సామగ్రిని సమీకరించేందుకు కార్యాచరణ సిద్ధంగా ఉండాలని సిసోడియా సూచించారు. ప్రమాద సూచనలు అందిన వెంటనే ప్రజలకు వేగంగా సమాచారం చేరవేయడం, ప్రమాద ప్రాంతాల్లో నివసించే వారిని అప్రమత్తం చేయడం, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు అత్యంత కీలకమని తెలిపారు.

విపత్తు సంభవించిన అనంతరం సహాయక చర్యలు, పునరావాసం, మౌలిక వసతుల పునరుద్ధరణ వేగంగా చేపట్టాలని పేర్కొ న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్య మవుతాయని సిసోడియా అన్నారు. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఆధునిక టెలికమ్యూనికేషన్ వ్యవస్థలు,



డ్రోన్లు వంటి సాంకేతిక పరిజ్ఞానం విపత్తుల ముందస్తు అంచనా, పరిస్థితుల పర్యవేక్షణ, నష్టం అంచనా, సహాయక చర్యల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ లో సంభవించిన వివిధ ప్రకృతి వైపరీత్యాల అనుభవాలను ప్రస్తావిస్తూ ఇటీవల సంభవించిన విజయవాడ వరదల నిర్వహణపై ప్రత్యేకంగా వివరించారు.

అలాగే రాష్ట్రాన్ని తరచూ ప్రభావితం చేసే తుఫాన్లు, వరదలు, కరువు పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రభుత్వం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, పరిపాలనా విధానాలపై అవగాహన కల్పించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రత్యేక అధికారిగా పనిచేసిన అనుభవాన్ని కూడా ఆయన శిక్షణార్థులతో పంచుకున్నారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే భారీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలంటే ముందస్తు ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం, వనరుల సమర్థ వినియోగం ఎంత ముఖ్యమో వివరించారు. ఏపీఎచ్ఆర్డీఐ నిర్వహిస్తున్న 12 వారాల ఇండక్షన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ ఉపన్యాసం జరిగింది. ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.

# జియో స్పేషియల్ సాంకేతిక పరిజ్ఞానం సమాజాభివృద్ధికి ఎంతో అవసరం

● తిరుపతి ఐఐటిలో వర్క్ షాప్‌లో వక్తలు




తిరుపతి ఐఐటిలో మూడు రోజుల వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ దేశాల అతిథులు

**శ్రీకాళహస్తి, జులై 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తికి సమీపంలో ఏర్పడిన తిరుపతి ఐఐటిలో బ్రిక్స్ దేశాలతో మూడు రోజుల వర్క్ షాప్‌ను నిర్వహించారు. సోమవారం ప్రారంభమైన ఈ వర్క్ షాప్‌కు తిరుపతి ఐఐటి ఆతిథ్యమిచ్చింది. ఈ కార్యక్రమాలకు హాజరైన జియో స్పేషియల్ టెక్నాలజీలు, దాని అనువర్తనాలపై 5వ బ్రిక్స్ వర్కింగ్ గ్రూప్ సమావేశానికి ఐఐటి తిరుపతి ఆతిథ్యం ఇస్తోంది. బ్రిక్స్ దేశాలలో జియో స్పేషియల్ ఎకోసిస్టమ్‌లను బలోపేతం చేయడంలో అంతర్జాతీయ సహకారం, సాంకేతిక ఆవిష్కరణల ప్రాముఖ్యతను ప్రముఖులు నొక్కి చెప్పారు. సమావేశానికి వివిధ దేశాల అతిథులను ఐఐటి డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ సారథ్యంలో స్వాగతం పలికారు.

అసోసియేట్ ప్రొఫెసర్ నవవిష్కర్ ఐహబ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాస్తవ్, సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో జియో స్పేషియల్ టెక్నాలజీల పరివర్తనాత్మక పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకార పరిశోధన, సామర్థ్య నిర్మాణ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. సుస్థిర అభివృద్ధి, వాతావరణ స్థితిస్థాపకత కోసం భౌగోళిక మౌలిక సదుపాయాలు, పొజిషనింగ్, నావిగేషన్, టైమింగ్ సాంకేతికతల గురించి వివరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐఐటి తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ, శాస్త్ర, సాంకేతిక శాఖ అండర్ సెక్రటరీ గౌతమ్ గోవింద్, జాతీయ జియో స్పేషియల్ ప్రోగ్రామ్ డివిజన్ హెడ్ డాక్టర్ మనోరంజన్ మొహంతి, సైంటిస్ట్ డాక్టర్ శుభా పాండే, డాక్టర్ అరిందమ్ భట్టాచార్య హాజరయ్యారు. బ్రిక్స్ దేశాలలో జియోస్పేషియల్ ఎకోసిస్టమ్‌లను బలోపేతం చేయడంలో అంతర్జాతీయ సహకారం, సాంకేతిక ఆవిష్కరణల ప్రాముఖ్యతను ప్రముఖులు వివరించారు.

# మరింత వేగవంతంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు

- డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండిలో శివశంకర్ లోతేటి



**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరును వేగవంతం చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. అలాగే వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, ఓల్టేజ్ లో హెచ్చుతగ్గులు, సోలార్ బిల్లింగ్, ఇనుప విద్యుత్ స్తంభాల మార్పిడి, తదితర సమస్యలను సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా 56 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారులకు విన్నవించారని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపుల పట్ల వినియోగదారులకు సంస్థ అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు1912 గానీ 1800 425 155333కు కాల్ చేయడం వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్ శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, భాస్కర్ రెడ్డి, జగదీష్, లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# యువతిపై జిమ్ ట్రైనర్ లైంగిక వేధింపులు

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో సత్యనారాయణ పురంలో ఒక యువతిపై గురువు లాంటి వ్యక్తి లైంగికదాడికి దాడికి పాల్పడ్డాడు. నగరంలో శారీరక వ్యాయమం, పిట్‌నెస్ కోసం ఒక యువతి జిమ్ ట్రైనింగ్ సెంటర్లో చేరింది. అక్కడ ఆమెపై జిమ్ ట్రైనర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమెకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసి, నగ్న ఫోటోలు తీసినట్లు వేదింపులకు గురిచేస్తున్నాడు. దాంతో ఆ బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో జిమ్ ట్రైనర్ అబ్దుల్ ఖాదర్‌పై కేసు నమోదు చేసారు. ఫిర్యాదు చేసిన యువతి ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పని చేస్తున్నారు. ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్న మహిళకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయిన జిమ్ ట్రైనర్ అబ్దుల్ ఖాదర్. లావుగా ఉన్న తనను స్లిమ్‌గా మార్చేందుకు జిమ్ సలహాలు ఇస్తూ పరిచయం పెంచుకున్నాడు. ప్రైవేట్ హోటల్‌కు తీసుకువెళ్ళి బరువు తగ్గడానికి షేక్ తాగాలంటూ మత్తు మందు ఇచ్చాడని యువతి ఆరోపిస్తుంది. మత్తు ఇచ్చి అత్యాచారం చేశాడని సత్యనారాయణపురం పోలీసులను ఇచ్చిన ఫిర్యాదులో యువతి అభియోగించింది. కేసు నమోదు చేసి యువతిని వైద్య పరీక్షల కోసం పోలీసులు తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

# సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు తల్లి విజయలక్ష్మి స్టేట్‌మెంట్ రికార్డ్

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రౌడీ షీటరు గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు దర్యాప్తును సిట్ మరింత వేగవంతం చేసింది. అందులో భాగంగా సోమవారం విజయవాడలోని సాయికృష్ణ నివాసానికి సిట్ అధికారులు చేరుకున్నారు. అతడి తల్లి విజయలక్ష్మి ్మ స్టేట్‌మెంట్‌ను వారు రికార్డ్ చేశారు. ఈ లాకప్ డెత్ వెనుక ఉన్న కారణాలు ఏమిటనే అంశంపై ఆమెను ప్రశ్నించారు. హైకోర్టులో సాయికృష్ణ తల్లి పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆ వివరాలు కూడా సిట్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. సీఐ నాగరాజు, కృష్ణలంక పోలీసులపై విజయలక్ష్మీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన ఆధారాలను ఆమెను అడిగిన తెలుసుకున్నారు. ఈ కేసులో కృష్ణలంక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసుల ప్రమేయానికి సంబంధించిన అంశాలను విజయలక్ష్మీ నుంచి సిట్ అధికారులు సేకరించారు. ఇక ఈ కేసులో తనకు తెలిసిన అన్ని వివరాలను ఈ సందర్భంగా సిట్ అధికారులకు విజయలక్ష్మీ వివరించారు.

# ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై అవనిగడ్డ కరకట్టపై యువకుడి దాడి

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై కరకట్టపై ఓ యువకుడి దాడి భయాందోళనకు గురిచేసింది. తోట్లవల్లూరు మండలం రొయ్యూరు వద్ద ద్విచక్ర వాహనంతో అడ్డగించి మరీ వారిద్దరిపై యువకుడు దాడికి తెగబడ్డాడు. బస్సు ఆపలేదనే కారణంతో డ్రైవర్ సురేష్, కండక్టర్ లీలాప్రసాద్‌పై దాడి చేశాడు. అడ్డొచ్చిన ప్రయాణికులనూ అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో అతడిని స్థానికులు అడ్డుకున్నారు. ఈ ఘటనతో కరకట్టపై గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. యువకుడి వీరంగం దాదాపు 94 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన వ్యక్తిని పి.కృష్ణప్రసాద్‌గా గుర్తించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కిషోర్ వెల్లడించారు.

# ఏజెన్సీలో అశాంతిని సృష్టించొద్దు

## ప్రభుత్వానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి విజ్ఞప్తి

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆదివాసీల దీర్ఘకాలిక హక్కులకి భంగం వాటిల్లుతున్న నేపథ్యంలో 1/70 చట్టాన్ని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేసారు. ఈ మేరకు ఆయన మీడియాకు విడుదల చేసిన సమాచార పత్రంలో చట్టాన్ని రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలని, గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ అంతటా ప్రదర్శనలు, సభలు జరుగుతున్నాయి. ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నేడు రంపచోడవరంలో జరుగుతున్న ర్యాలీ, సభపై పోలీసులు తీవ్రమైన ఆంక్షలు పెట్టి జనం రాకుండా నిరోధించేందుకు ప్రయత్నిస్తున్నారు. సిపిఐ(ఎం) దీన్నీ తీవ్రంగా ఖండిస్తున్నది. రంపచోడవరం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి ఆదివాసి ప్రజలు ప్రత్యేకించి యువతి యువకులు ప్రశాంతంగా వస్తున్న సందర్భంలో వారిని దారి మధ్యలో ఆటంకపరిచి రెచ్చగొట్టడం ద్వారా ఏజెన్సీలో అశాంతి పరిస్థితినీ ప్రభుత్వమే సృష్టిస్తున్నది. ఆదివాసి యువత అసంతృప్తికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. వారు చెప్పేది విని 24వ తేదీ ముఖ్యమంత్రి రంపచోడవరం వస్తున్న సందర్భంగా వాటిపై స్పందించి పరిష్కరిస్తే యువతలో ఆందోళన పరిష్కారం అవుతుంది. అందుకు బదులుగా నిర్బంధ పద్ధతుల ద్వారా అడుకోవాలనుకోవడం అవివేకం. 24న ముఖ్యమంత్రి సభకు కూడా ఇదే మాదిరి జనాన్ని రాకుండా ఆటంకపరుస్తారా అని ప్రశ్నిస్తున్నాము. అధికార పార్టీకి పోలీసు యంత్రాంగం అన్ని రకాల అండదండలు ఇస్తూ ఆదివాసీల సంఘాలపై నిర్బంధం ప్రయోగించడం దారుణం. వెంటనే హోం మంత్రి, డీజీపీ జోక్యం చేసుకొని రంపచోడవరం సభ ప్రశాంతంగా జరిగే విధంగా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నానన్నారు.

# నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో తమ్మినేని సీతారామ్ భూకబ్జా

- విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకరు తమ్మినేని సీతారామ్ సహా ఆయన కుటుంబ ఖరీదైన భూకబ్జా లక్ష్యంగా పలు అక్రమాలకు పాల్పడిందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆరోపించారు. వైసీపీ నేత, ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసారు. సోమవారం అమరావతిలో ఆయన మాట్లాడుతూ నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో తమ్మినేని కుటుంబ సభ్యులు రూ.4 కోట్ల భూమి కబ్జా చేశారని ఆరోపించారు. బతికున్న వ్యక్తిని కాగితాల్లో మృతుడిగా చూపించారని ఆయన టీడీపీ ఎంపీ వివరించారు. శ్రీకాకుళం దావులపేరంలో 922 గజాల భూమి లక్ష్యంగా ఈ కుట్ర జరిగిందని వెల్లడించారు. నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ సృష్టించి ఈ రిజిస్ట్రేషన్ చేశారని ఎంపి కలిశెట్టి పేర్కొన్నారు. తమ్మినేని సీతారాం కుమారుడి పేరిట 2023లో ఈ భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. నకిలీ ఆధార్ కార్డులు, క్రిమినల్ ముఠాల సహకారంతో ఈ దందా జరిగిందని వివరించారు. రిజిస్ట్రేషన్‌కు తమ్మినేని సీతారాం కాలేజీ సిబ్బందిని సాక్షులుగా ఉపయోగించారని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. బాధితుడు కోర్టును ఆశ్రయించడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని విజయనగరం ఎంపీ అన్నారు. విచారణ తప్పించుకునేందుకు హైకోర్టు నుంచి స్టే తీసుకొచ్చే ప్రయత్నం చేశారంటూ తమ్మినేని సీతారాంతోపాటు ఆయన కుటుంబ సభ్యులపై ఎంపీ కలిశెట్టి నిప్పులు చెరిగారు. తమ్మినేని కుటుంబ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం చేసి దోషులపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర ఉత్సవంగా మండలి కృష్ణారావు జయంతి

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వపు విద్యామంత్రి దివంగత మండలి కృష్ణారావు జయంతిని రాష్ట్ర ఉత్సవంగా జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆగస్టు 4న మండలి వెంకట కృష్ణారావు జయంతిని జరపాలని ఉత్తర్వులు జారీ చేశారు. దివిసీమ గాంధీగా పేరొందిన మండలి తొలి తెలుగు ప్రపంచ మహాసభల నిర్వహణకు నాందిగా నిలిచారు. దివిసీమ ఉప్పెన సమయంలో అందించిన సేవలు అజరామరం. అవనిగడ్డలో గాంధీ క్షేత్రం ఏర్పాటు చేసి ఎందరికో అండగా నిలిచారు. ఆయన సేవలకుగాను ఏపీ ప్రభుత్వం అధికారభాషా సంఘానికి ఆయన పేరు పెట్టింది. మండలి జయంతిని అధికారికంగా నిర్వహించాలని పలు ఏపీ రచయిత్రుల సంఘం, పంచాయతీరాజ్ ఉద్యమ నాయకుడు జాస్తి వీరాంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ఇందుకు స్పందించిన ప్రభుత్వం మండలి జయంతిని అధికారికంగా నిర్వహిస్తుంది.

# తిరుమల సమాచారం



## టిటిడి విద్యాదాన ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

**తిరుమల, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు ట్రస్టులు, పథకాలకు దాతలు తమవంతు విరాళాలు అందిస్తున్నారు. దాతలకు కల్పించే సదుపాయాలు కోత విధించినా దాతలు నుండి విశేష స్పందన లభిస్తోంది. సోమవారం ఉదయం విజయవాడకు చెందిన అన్ బ్లిక్స్ క్లౌడ్ డేటా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సిఇఒ తిరుమల కుమార్ కనకమేడల వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు కోటి రూపాయలు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంకు విరాళం డిడిలను అందజేశారు.

## తిరుమలలో మహారాష్ట్ర భక్తుడు అదృశ్యం



**తిరుమల, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలేశుని దర్శనార్థం వచ్చి కొండపై మహారాష్ట్ర భక్తుడు తప్పిపోయాడు. సోమవారం అతని కుటుంబసభ్యులు తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. మహారాష్ట్ర పుణె జిల్లాకు చెందిన హైదర్ అన్వరుల్లా హక్ ఖాన్ (40) తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం ఈనెల 15వతేదీ తిరుమలకు వచ్చారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 2లో క్యూలైన్‌లో ప్రవేశించారు. ఆరోజు రాత్రి 8గంటలకు కంపార్ట్‌మెంట్-4 వద్ద కుటుంబ సభ్యుల నుండి విడిపోయి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిసిటివి ఫుటేజీని పరిశీలించగా, హైదర్ అన్వరుల్లా హక్ ఖాన్ బాలాజీనగర్ వైపు కాలినడకన వెళ్తు, ఆ తరువాత కనిపించకుండా పోయాడు. అతని భార్య అర్చనా రోహిదాస్ రోకడే తిరుమల 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తెలిసిన వాళ్ళు సమీప పోలీస్ స్టేషన్‌కు, తిరుమల 1టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని స్టేషన్ రైటర్ మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. ఆచూకీ తెలిస్తే 94407 96771, 94407 96769, 0877- 2289027 నంబర్లకు తెలపాలని కోరారు.

# తిరుమలేశుని బ్రహ్మోత్సవాలపై టిటిడి ఫోకస్!

● సిద్ధమవుతున్న ఏడుకొండలు ● ఈ యేడాది సాలకట్ల, నవరాత్రి ఉత్సవాలు

**తిరుమల, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి జరిగే ఉత్సవాల్లో అత్యంత ప్రధానమైన తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలు ముఖ్యం. సాంవత్సరిక ఉత్సవాల్లో ప్రత్యేకంగా తొమ్మిదిరోజులు ఉదయం, రాత్రి వాహనసేవలతో అంగరంగ వైభవంగా "బ్రహ్మోత్సవాలు" ఈ ఏడాది రెండు సార్లు జరిపించనున్నారు. సెప్టెంబర్‌లో సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ తేదీలను ఇప్పటికే టిటిడి ఆగమ సలహా మండలి పండితులు ఖరారుచేశారు. దేవదేవుని బ్రహ్మోత్సవాలకు శేషాచలకొండల్లోని సప్తగిరులు సిద్ధమవుతున్నాయి. ఈఏడాది ఉత్సవాలపై ఇప్పటికే టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఇటీవల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యాచరణ రూపొందించి ఆ దిశగా పనులు చేపట్టాలని ఆదేశించారు. తిరుమల ఆలయం పరిసరాలు, మాఢవీధులు సుందరంగా తీర్చిదిద్దాలని, రంగురంగుల రంగవల్లులు, భక్తులకు సాఫీగా గ్యాలరీలు, అదనపు తాగునీటి కొళాయిలు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. మాఢవీధులు పూర్తిగా గ్యాలరీలు ఏర్పాటు చేయాలని, వర్షానికి, ఎండకు భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.



ఈ ఏడాది సెప్టెంబర్ 14నుండి 23వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 14వ తేదీ అంకురార్పణ, 15న ధ్వజారోహణం, పెద్దశేషవాహనం, తొలిరోజే సిఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించే ఘట్టాలు జరగనున్నాయి. ఆ తరువాత బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడసేవ సెప్టెంబర్ 19న రాత్రి నిర్వహిస్తారు. 20న సాయంత్రం బంగారురథం, 22న ఉదయం రథోత్సవం, 23న చక్రస్నానంతో పరిసమాప్తమవుతాయి.

ఆ తరువాత రెండు వారాల వ్యవధిలో అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరిపిస్తారు. అక్టోబర్ 11నుండి 20వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో 17న పుష్పపుల్లకీ సేవ, 16వ తేదీ రాత్రి గరుడవాహనం ప్రధానమైన ఘట్టాలు. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదిరోజులు ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8గంటలకు ప్రారంభమవుతుంది. రాత్రి వాహనసేవ 7గంటలకు మొదలవుతాయి. దేశంలోనే మరే ఆలయంలోనూ జరగని విధంగా ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలేశుని ఆలయంలో అంగరంగ వైభవంగా జరిగే 'బ్రహ్మోత్సవాలు'కు దేశవిదేశాల నుండి లక్షలాదిమంది భక్తులు నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివస్తారు. ఇష్టదైవమ్ వాహన సేవలను వీక్షించి పునీతులవుతారు. తొమ్మిది రోజులు రోజుకు రెండు వాహనాలపై ఎంతో ముగ్ధమనోహరంగా, సర్వాలంకార భూషితుడై శ్రీవేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులు శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేస్తారు.

సామాన్య భక్తులకు ఎక్కువగా దర్శన సమయం కల్పించేందుకు ఆ తొమ్మిది రోజులు బ్రేక్ దర్శనాలు ఉండవు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సారథ్యంలో వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

# దేవుని దర్శనం సులభతరం చేయండి: మాజీ సైనికోద్యోగులు

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ సేవలో, దేశ భద్రతలో అహర్నిశలు ప్రాణాలు కూడా లెక్కచేయకుండా సేవ చేసిన మాకు తిరుమలేశుని దర్శనం సులభతరంగా కల్పించాలని మాజీ సైనికోద్యోగులు విజ్ఞప్తి చేశారు. తాము అనేక రకాల ఆరోగ్య సమస్యలు సైతం లెక్కచేయకుండా దేశసేవ చేశామన్నారు. సోమవారం ఉదయం పలు డిమాండ్లతో తిరుపతి టిటిడి పరిపాలన భవనం వద్దకు మాజీ సైనికులు చేరుకున్నారు. దేశ సేవ చేసిన మాజీ సైనికులకు దర్శన భాగ్యం కల్పించాలని టిటిడి ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దేశ సేవ చేసి రిటైర్డ్ అయిన 1.10లక్షల మంది మంది మాజీ సైనికులు ఉన్నారన్నారు. మాజీ సైనికులకు టిటిడిలో మరింత ప్రాధాన్యత నివ్వాలని కోరారు.





# కన్నుల పండువగా ద్రౌపదీ దేవి గ్రామోత్సవం

**శ్రీకాళహస్తి, జులై 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ద్రౌపదీ సమేత శ్రీకృష్ణుడు, అర్జునుని విగ్రహాలనుకన్నుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు. ఛైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గురప్పశెట్టి పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఉత్సవానికి ఆలయ పూజారి పురుషోత్తం వారి సహాయకులు చక్కగా అమ్మవారిని అలంకరించారు. సప్పరంలో ప్రతిష్టించి చెన్నై రోడ్డు మీదు నుంచి పాతవరదయ్యపాళెం రోడ్డు, జయరామారావు వీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధుల మీదుగా ఉత్సవం సాగింది, ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, ఉత్సవాల ఇన్‌చార్జి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో సాగింది.

# ఉద్యోగుల సర్వీసు రికార్డుల నిర్వహణలో కొత్త అధ్యాయం

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డుల నిర్వహణలో కొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ఉన్న ఫిజికల్ సర్వీసు రికార్డుల స్థానంలో ఎలక్ట్రానిక్ సర్వీస్ రిజిస్టర్‌ను వినియోగించనున్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఈఎస్ఆర్ 2.0 అప్లికేషన్‌ను అమలు చేస్తోంది. ఈ నూతన డిజిటల్ విధానం ద్వారా ఉద్యోగుల సర్వీసు వివరాల నమోదు, నిర్వహణ మరింత సులభతరం కానుంది. పారదర్శకత కూడా పెరుగుతుంది.

21-7Pg7exHMNWJQE:21-7Pg7exHMNWJQE.qxd 7/21/2026 12:14 AM Page 1





ధర్మవరంలో శ్రీ జగన్నాథ రథయాత్రను బూడిద గుమ్మడికాయతో దిష్టితీసి, జెండా ఊపి ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్

## జగన్నాథుని ఆశీస్సులతో ధర్మవరం మరింత అభివృద్ధి చెందాలి

- రథయాత్రను ప్రారంభించిన మంత్రి సత్యకుమార్

**ధర్మవరం టౌన్, జులై 20 ప్రభాతవార్త:** ఇస్కాన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. ఈ రథయాత్రలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా బూడిద గుమ్మడి కాయతో దిష్టి తీసి, జెండా ఊపి రథయాత్రను ప్రారంభించారు. అనంతరం భక్తులతో కలిసి రథాన్ని లాగుతూ స్వామివారిపై తన భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ఇస్కాన్ సంస్థ అనేక సంవత్సరాలుగా ధర్మవరంలో శ్రీ జగన్నాథ రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. జగన్నాథ స్వామి ఆశీస్సులు ధర్మవరం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని, పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం అస్థిరంగా ఉండే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, జగన్నాథ స్వామి కటాక్షంతో ప్రకృతి అనుకూలించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ధర్మవరం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగేందుకు స్వామివారి ఆశీస్సులు లభించాలని కోరారు. ఈ మహోత్సవంలో ఇస్కాన్ ప్రతినిధులు, వివిధ హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంగళగిరి రచయిత్రులకు అంతర్జాతీయ గుర్తింపు

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బర్మింగ్‌హామ్ భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన గీతాంజలి సర్కిల్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్ ఆధ్వర్యంలోని "కృష్ణన్ తల్వార్ అవార్డ్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్" కార్యక్రమంలో భారతీయ యువ రచయిత్రులు ప్రణవి బిట్రా (16 సంవత్సరాలు), ఇషాన్వి బిట్రా విశిష్ట గౌరవాలు అందుకున్నారు. ఇరువురు సోదరీమణులు మంగళగిరికి చెందిన బిట్రా వెంకటేశ్వరరావు, మల్లికల కుమార్తెలు. ప్రణవి బిట్రాకు (16 సంవత్సరాలు) సృజనాత్మక రచనలో ప్రతిభ, ఊహాశక్తి, సాహిత్య నిబద్ధతకు గుర్తింపుగా "కృష్ణన్ తల్వార్ అవార్డ్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్ - 2026" ప్రదానం చేశారు. అదే కార్యక్రమంలో ఇషాన్వి బిట్రాకు (12 సంవత్సరాలు) సృజనాత్మక రచనా కార్యక్రమంలో చురుకైన భాగస్వామ్యానికి పాల్గొనిన ధ్రువపత్రం అందజేశారు. డా. కృష్ణ కుమార్, చిత్ర కుమార్ స్థాపించిన గీతాంజలి సర్కిల్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్ ఈ యువ రచయిత్రుల సాహిత్య ప్రతిభను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత సృజనాత్మక రచనలు చేసి ప్రపంచ సాహిత్యానికి విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించింది. ప్రణవి బిట్రా, ఇషాన్వి బిట్రా సాధించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు భారతీయ యువ రచయితల ప్రతిభకు ప్రపంచస్థాయిలో లభిస్తున్న గౌరవానికి నిదర్శనంగా నిలుస్తూ, సాహిత్య రంగంలో ముందుకు రావాలనుకునే యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.




**తిరుపతి హెల్త్, జూలై 20 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా ఏర్పేడు వద్ద గల వ్యాసాశ్రమంలో జూలై 25న శాంతియుత నిరసన దీక్ష చేపట్టుతున్నట్టు శివానంద స్వామి తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామీజీ మాట్లాడుతూ మహర్షి సద్గురు మలయాళ స్వామి ఆరాధన ఉత్సవం సందర్భంగా వందలాది మంది భక్తులతో, పూర్వ విద్యార్థులతో, స్వామీజీలతో, భక్తాదులతో నిరసన దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. కేరళలో పుట్టిన మలయప్ప స్వామి ఆంధ్రను ఉద్ధరించడానికి ఇక్కడికి వచ్చి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారని పేర్కొన్నారు. ఆశ్రమం మేనేజరు, పీఠాధిపతులు, నిరసన దీక్షను అడ్డుకోవాలని చూస్తే చట్టపరంగా, శాంతియుతంగా ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో బాలికలతో పాటు బాలురులకు సంస్కృతం, వేద పాఠశాల ఉండేవి అని, అవన్నీ ఇప్పుడు కనుమరుగయ్యాయని, వేసాశ్రమానికి మునుపటి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని, వాటన్నిటిని తిరిగి ఏర్పాటు చేయాలనే ఆకాంక్షతోనే నిరసన దీక్షకు దిగుతున్నట్లు చెప్పారు. రోజు రోజుకు వేసాశ్రమం ఖ్యాతి దిగజారుతున్నదని అన్నారు. ఈ విషయమై దేవదాయ శాఖ ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి విన్నవించినా ఫలితం లేదని చెప్పారు. భావితరాలకు ధర్మాన్ని అందించాలంటే వ్యాసాశ్రమను మనం రక్షించుకోవాలని భక్తాదులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా కర్ణాటక, కేరళ నుండి భక్తులు ఈ నిరసన దీక్షలో అధిక సంఖ్యలో పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో స్వామీజీలు పాల్గొన్నారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమర్థవంతంగా సన్నద్ధం కావాలి

- రోజూ మానిటర్ చేయాలి.. ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలి
- అధికారులు ఎవరూ విధులకు గైర్హాజరు కాకూడదు
- నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం.. కఠిన చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, జులై 20 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను ధీటుగా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం సమర్థవంతంగా సన్నద్ధం కావాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ఆదేశించారు. నగరంలోని ఆర్.అండ్.బి అతిథి గృహంలో సోమవారం జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులు, త్రాగునీరు సరఫరాపై వ్యవసాయ, ఉద్యాన, హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్.ఎల్.సి, మైనర్ ఇరిగేషన్, కెవికె శాస్త్రవేత్తలు, ఆర్డబ్ల్యుఎస్, డిపిఓ, ఆయా శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్‌లతో కలిసి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. జిల్లాలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను రోజు మానిటర్ చేయాలని, ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు. అమరావతిలో ఉన్నతాధికారులతో మానిటర్ చేసేందుకు జిల్లా నుంచి ఒక లైజనింగ్ అధికారిని నియమించి అగ్రికల్చర్, మైనర్



ఇరిగేషన్, డ్వామా, తదితర శాఖల పరిధిలో తీసుకుంటున్న చర్యలు, పురోగతిపై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు. ఎదురయ్యే సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

**హెచ్.ఎల్.సి సిస్టం హైఅలర్ట్ మోడ్‌లో ఉండాలి:** ఎల్‌నినో నేపథ్యంలో హెచ్.ఎల్.సి సిస్టం హైఅలర్ట్ మోడ్‌లో ఉండాలని ఆదేశించారు. అధికారులు ఎవరూ విధులకు గైర్హాజరు కాకూడదని, ప్రతి ఒక్కరూ 24/7 విధుల్లో ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్.ఎల్.సి నుంచి నీరు వచ్చిన వెంటనే 25- 30 రోజుల్లోపు తాగునీటి ట్యాంకులను నింపాలని, ఇందుకు బ్లూ ప్రింట్ సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా ట్యాంకుల వద్ద మోటార్లను ఉపయోగించుకునేందుకు వీలుగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. హెచ్.ఎల్.సి మెయిన్ కెనాల్ పై ఆయా శాఖల అధికారులకు డ్యూటీలు వేయాలని, ఇతర శాఖల అధికారులను కూడా డ్యూటీలు వేయాలని, ఎవరు విధుల్లో కనబడకపోయినా కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ సమస్య వస్తుందో ముందుగానే పసికట్టి కనుక్కోవాలని, జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిత్యం మానిటర్ చేయాలని ఆదేశించారు. పిఏబిఆర్ లో స్టాప్ లాగ్ గేట్ కు సంబంధించి టెండర్ పిలవడం జరగగా, ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

**గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలి :** గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని డిపిఓ, ఆర్.డబ్ల్యు.ఎస్, ఇతర అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బందికి ఒక్కో బోర్వెల్ ను దత్తత ఇవ్వాలని, అవి పని చేస్తున్నాయా లేదా అనేది పర్యవేక్షణ చూస్తూ అవి పని చేసేలా చూడాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందుగానే అన్ని విధాల సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, రెడ్డపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.మల్లీశ్వరి, హెచ్.ఎల్.సి ఎస్ఈ సుధాకర్ రావు, డిపిఓ నాగరాజునాయుడు, కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చెన్నరాయుడు, హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్2 ఎస్ఈ సిఆర్.రాజగోపాల్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణా జలాలు తీసుకొచ్చిన ఘనత చంద్రన్నదే

- కూటమి పాలనపై, వైసిపి పాలనపై చర్చకు సిద్ధమా..?
- మంత్రి సవిత సవాల్

**శ్రీ సత్యసాయి జిల్లా, జులై 20, ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకొచ్చి రతనాల సీమగా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం చెరువును ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూరెడ్డి, ఇతర కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.లక్ష కోట్లతో రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గాను, పారిశ్రామిక హబ్ గాను సీఎం తీర్చిదిద్దుతున్నారన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో గాల్లో సినిమా సెట్టింగ్‌ల వేసి, కొబ్బరికాయలు కొట్టి హడావుడి తప్ప రాయలసీమకు జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు. దోపిడీకి కేరాఫ్ అడ్రాస్ వైసీపీ అని మండిపడ్డారు. రెండేళ్ల కూటమి పాలన, అయిదేళ్ల వైసీపీ పాలనపై చర్చకు సిద్ధమా..? అని ఆ పార్టీ నేతలకు మంత్రి సవిత సవాల్ విసిరారు. ప్రపంచమంతా ఎల్‌నినో ప్రభావంతో విలవిలలాడుతుంటే రాయలసీమలో చెరువులు, ఇతర నదులు జలకళతో కళకళలాడుతున్నాయని, దానికి కారణంగా సీఎం చంద్రబాబేనని అన్నారు. అటు కుప్పం, ఇటు మడకశిర వరకూ కృష్ణా జలాలను తీసుకొచ్చిన ఘనత సీఎం



చంద్రబాబుదేనన్నారు. రాయలసీమలోని అన్ని జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో జిల్లాను ఒక్కో రంగంలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. తిరుపతిలో రాయల్ ఇన్ ఫీల్డ్ పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. పులివెందులకు కూడా సాగు, తాగు నీరందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు.

అంతకుముందు బుక్కపట్నం చెరువులో బోటులో మంత్రి సవిత ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూరెడ్డి, కూటమి నాయకులు పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల శ్రీరామ్ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షా పిటిఐ ఉద్యోగుల పోరాటాలకు ఎపి జెఎసి మద్దతు

**విజయవాడ, జూలై 20 (ప్రభాతవార్త):** సమగ్ర శిక్షా పథకంలో భాగంగా పనిచేస్తున్న ఆర్ట్, వర్క్, వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు ఇతర విభాగాల కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసంచేపట్టిన ప్రత్యక్ష పోరాటాలకు ఏ.పిజె.ఎ.సి అమరావతి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జెనరల్ పలిశెట్టి దామోదరరావు ప్రకటించారు.

ఆదివారం విజయవాడలోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమగ్ర శిక్ష ఆర్ట్, వర్క్, వ్యాయామ ఉపాధ్యాయుల రాష్ట్ర స్థాయి సదస్సులో తీసుకున్న నిర్ణయాలను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారి రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకరరావు మీడియాకు వివరించారు.

14ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగాల క్రమబద్ధీకరణ జరగలేదని, కనీస ఉద్యోగ భద్రత, కనీస వేతన టైమ్ స్కేల్ కూడా అమలు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 13 ఏళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగులకు ఈఎస్ఐ, ఈపిఎఫ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, పదవీ విరమణ సమయంలో గ్రాట్యుటీ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టి ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమగ్ర శిక్షలోని ఇతర విభాగాల ఉద్యోగ సంఘాలతో పాటు పీటీఐ సంఘాలను ఏకం చేసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

ఇందుకోసం త్వరలోనే నిరసన కార్యక్రమాల షెడ్యూల్, కార్యాచరణను రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు సైతం పిటిఐల పోరాటానికి తమ మద్దతు తెలిపారు.

ఏపిజెఎసి మహిళా విభాగం సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, పిటిఐ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, కన్వీనర్లు వెంకటరమణ, కామేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు

- అపజయాన్ని విజయానికి పునాదిగా మలుచుకోవాలి
- మంత్రి పొంగూరు నారాయణ
- ప్రతిభావంతులైన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రదానం చేసిన మంత్రి, కలెక్టర్ హిమాన్షు

**నెల్లూరు(కలెక్టరేట్), జులై 20, ప్రభాత వార్త:** జీవితంలో ఏ లక్ష్యాన్నైనా సాధించాలంటే కష్టపడటమే ఏకైక మార్గమని, అపజయాన్ని చూసి నిరాశ చెందకుండా దానిని విజయానికి పునాదిగా మలుచుకోవాలని మంత్రి పొంగూరు నారాయణ విద్యార్థులకు సూచించారు. సోమవారం ఉదయం విద్యాశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డ్స్-2026 కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నప్పుడు ఆటలపై మక్కువతో చదువుపై శ్రద్ధ పెట్టకపోవడంతో తాను పదో తరగతిలో ఒకసారి విఫలమైనట్లు మంత్రి గుర్తు చేసుకున్నారు. అయితే ఆ అపజయాన్ని సవాల్‌గా తీసుకుని రోజుకు 15-16 గంటలు కష్టపడి చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించానని చెప్పారు. అనంతరం వీఆర్ కళాశాలలో డిగ్రీ, ఎస్వీ యూనివర్సిటీలో ఎంఎస్సీ పూర్తి చేసి రెండింటిలోనూ కాలేజ్ టాపర్‌గా నిలిచానన్నారు. నెలకు రూ.120 జీతంతో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా ప్రారంభమైన తన ప్రయాణం, నేడు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు విద్యను అందించే సంస్థలను నిర్మించే స్థాయికి చేరిందన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా రంగంలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం ప్రతిభ ఉంటే సరిపోదని, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే అంకిత భావం, కమిట్‌మెంట్, క్రమశిక్షణ అత్యంత అవసరమన్నారు. విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లులు పడే కష్టం ఎంతో గొప్పదని కొనియాడారు. తాను కూడా 23 సంవత్సరాల క్రితం ఇంటర్మీడియట్ టాపర్‌గా ఇలాంటి వేదికపైనే నిలబడ్డానని, నేడు అదే వేదికపై విద్యార్థులను అభినందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల విద్య పూర్తయిన తర్వాతే అసలైన జీవిత ప్రయాణం ప్రారంభమవుతుందని, ఇకపై ప్రతి నిర్ణయాన్ని బాధ్యతగా తీసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. చదువుకునే సమయంలో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా డిస్ట్రాక్షన్లకు దూరంగా ఉండాలని,



ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా సమయం కేటాయించి చదివే క్రమశిక్షణ కలిగిన విద్యార్థులే గొప్ప విజయాలు సాధిస్తారని చెప్పారు. ప్రతిభకు కొదవ లేదని, క్రమశిక్షణతో కూడిన కృషి ఉంటే ఎవరైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చున్నారు. విద్యార్థులు ఐఐటీ, ఎంబీబీఎస్ వంటి తమ లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో నక్షత్రాల్లా వెలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్చి-2026 పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్, ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు బహుమతి అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 224 మంది పదో తరగతి, 36 మంది ఇంటర్మీడియట్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వంతో ఏదైనా సాధించవచ్చని, విద్యార్థులందరూ ఇదే సూత్రాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అనంతపురంలో వైసిపి నేత అంకే నరేంద్ర ఆత్మహత్యాయత్నం

**అనంతపురం రూరల్, జులై 20 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం, అనంతపురం రూరల్ మండలం, ఆలుమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంకే నరేంద్ర స్థానిక టిడిపి నాయకుడు గోనుగుంట్ల సూర్యనారాయణ, రూరల్ పోలీసుల వేధింపులు కారణంగా వాటిని తట్టుకోలేక సోమవారం ఉదయం తన తోటలో సెల్ఫీ వీడియో తీసుకొని తన బాధలు చెప్పుకుంటూ పురుగుల మందు సేవించి ఆత్మహత్య ప్రయత్నం చేయడం జరిగిందని అంకె నరేంద్ర కుటుంబ సభ్యులు, బంధువులు తెలియజేశారు. ఆలమూరులో జగనన్న కాలనీలోని బోర్‌లకు మరమ్మతులు చేయించాలని కాంట్రాక్టర్ రమణారెడ్డి తెలియజేయడంతో ఆయన పిలుపు మేరకు చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయించి తిరిగి యథాస్థానంలో అంకె నరేంద్ర మార్చడం జరిగిందని, కానీ ఈదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొనుగుంట్ల సూర్యనారా యణ గ్రామంలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో దొంగ ఓట్లను ఎక్కిస్తుండడంతో వాటిని నరేంద్ర అడ్డుకున్నందుకు అంకె నరేంద్రపై అక్రమంగా దొంగతనం కేసు రూరల్ పోలీస్ స్టేషన్‌లో పెట్టడంతో రూరల్ పోలీసులు ఆయన ఫిర్యాదు మేరకు అంకె నరేంద్రపై కేసు నమోదు చేసి ఎటువంటి విచారణ చేయకుండానే అంకే నరేంద్రరే జగనన్న కాలనీలో గల బోర్ల మోటర్‌ను దొంగలించినట్లు నిర్ధారించి బోర్లకు అమర్చిన మోటార్లను పైపులను వాటికి సంబంధించిన సామాగ్రిని తీయించి, స్టేషన్‌కు తరలించి, ఆ సామాగ్రితో పాటు అంకె నరేంద్రకు ముసుగు వేసి పోలీసులు మీడియా సమావేశం ఏర్పాటు చేయడంతో అంకె నరేంద్ర తన కుటుంబ పరువు పోయిందని, భావించి తన చావుకు గోనుగుంట్ల సూర్యనారాయణ, అదేవిధంగా దొంగతనం కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులే కారణమంటూ అంకె నరేంద్ర తీవ్ర అవమానంగా భావించి, మానసిక వేధింపులను తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడముతో ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, వైఎస్ఆర్సిపి నాయకులు వెంటనే ఆయనను హుటాహుటిన సవేరా ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు వైద్య సేవలు అందించి ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులకు, బంధువులకు, వైఎస్ఆర్సిపి నాయకులకు తెలియజేయడంతో కుటుంబ సభ్యులు బంధువులు వెంటనే మెరుగైన వైద్యం కోసం నరేంద్రను బెంగళూరుకు తరలించారు. నరేంద్ర ఆత్మహత్య ప్రయత్నానికి గల కారకుడు గోనుగుంట్ల సూర్యనారాయణతో పాటు, అక్రమంగా కేసు నమోదు చేసి వేధించిన పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు.



## అనుమతి లేని ఇసుక తవ్వకాలపై కొరడా
# 13 డ్రెడ్జింగ్ బోట్లు సీజ్

అధికారుల సంయుక్త తనిఖీలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 20 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోటిలింగాల డిసిల్టేషన్ రీచ్‌లో సోమవారం నిర్వహించిన సంయుక్త తనిఖీలో అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణా కార్యకలాపాలకు వినియోగిస్తున్న 13 డ్రెడ్జింగ్ బోట్లను అధికారులు సీజ్ చేశారు. నూతన ఇసుక విధానం 2024, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ సమక్షంలో జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు, వారి సాంకేతిక సిబ్బంది, రాజమహేంద్రవరం అర్బన్ తహ సీల్దార్, రెవెన్యూ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారుల తో కలిసి కోటిలింగాల డిసిల్టేషన్ ర్యాంపు వద్ద సంయుక్తతనిఖీ నిర్వహించారు. తనిఖీలో సాయిరామ్ శాండ్ అండ్ బోట్స్‌మెన్ సొసైటీ పరిధిలో మొత్తం 13 డ్రెడ్జింగ్ బోట్లు అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణా కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. విచారణలో మూడు డ్రెడ్జింగ్ బోట్ల యజమానిగా నండూరి రాజు (మాదిగపల్లి, వైకుంఠపురం, గుంటూరు), మరో మూడు బోట్ల యజమానిగా ముత్యాల వెంకట రమణ (రామాలయం వీధి, విజ్జేశ్వరం, తూర్పుగోదావరి జిల్లా), మరో మూడు బోట్ల యజమానిగా కూచిపూడి బాలస్వామి (గరుడాచలపాలెం, తకెళ్లపాడు, గుంటూరు జిల్లా) ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన నాలుగు డ్రెడ్జింగ్ బోట్లకు సంబంధించిన యజమానులు తనిఖీ సమయంలో గుర్తించబడకపోవడంతో వాటిని అన్‌క్లెయిమ్డ్ బోట్లుగా నిర్ధారించారు.

నూతన ఇసుక విధానం 2024, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తూ డ్రెడ్జింగ్ బోట్లను ఇసుక త్రవ్వకాల కోసం వినియోగించినందున మొత్తం 13 బోట్లను సీజ్ చేసి తదుపరి చట్టపరమైన చర్యల కోసం నీటిపారుదల శాఖకు అప్పగించారు. సంబంధిత నిబంధనల మేరకు ఇరిగేషన్ శాఖ ద్వారా తదుపరి క్రిమినల్ చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

అలాగే వంతెనలకు ఇరువైపులా 500 మీటర్ల పరిధిలో ఎటువంటి ఇసుక త్రవ్వకాలు చేపట్టినా సంబంధిత వ్యక్తులపై కఠినమైన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ఈ సంయుక్త తనిఖీలో రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్. శివరాముడు, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి డి. ఫణిభూషణ్ రెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. విఘ్నేశ్వరుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి. జ్యోతిర్మయి, టెక్నికల్ అసిస్టెంట్ పి.ఎన్.వి.ఎల్. శైలజ, రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్ యు. రంజిత్ కుమార్, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభకు నిలయాలు

- విద్యార్థుల చదువు రాష్ట్రానికి ఆర్థిక వనరు
- కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల, డాక్టర్ కలికిరి



విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డును ప్రదానం చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల, డాక్టర్ కలికిరి మురళీమోహన్

**చిత్తూరు, జులై 20 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభకు నిలయాలు అని, ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసం పెరిగి అత్యధిక మంది షైనింగ్ స్టార్స్ వెలుగులోకి రావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు పేర్కొన్నారు. జడ్పీ సమావేశభవనంలో సోమవారం జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గత విద్యాసంవత్సరం టెన్త్, ఇంటర్మీడియేట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానోత్స కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలు ఏ ఇతర ప్రైవేటు విద్యాసంస్థలకు తీసిపోవని, ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థవంతమైన ఉపాధ్యాయులు, మెరుగైన అవకాశాలు వున్నాయన్నారు. ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసంను పెంపొందించడానికి అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యాశాఖ అధికారులు తరచు పాఠశాలలను సందర్శిస్తూ బోధన, మౌలిక వసతులు, విద్యార్థుల అభ్యాస ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై గణనీయమైన వ్యయం చేస్తోందని, అందుకు తగిన విధంగా విద్యా ఫలితాలు సాధించాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తుకు విద్యార్థులు పునాదులని, ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం కూడా ముఖ్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో దేశం, రాష్ట్రానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ షైనింగ్ స్టార్స్ కార్యక్రమం కేవలం అవార్డుల ప్రదానోత్సం మాత్రమే కాదని, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే మహత్తరమైన కార్యక్రమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏ మాత్రం తీసిపోవన్నారు. ఈ సందర్భంగా టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 168 మంది విద్యార్థులు, ఇంటర్మీడియేట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేసి, ఒకొక్కొ విద్యార్థికి రూ.20 వేలు నగదు ప్రోత్సహకం, ప్రశంసాపత్రంను అందజేశారు.

21-07pg10:21-07pg10.qxd 7/20/2026 11:06 PM Page 1



ఆట

# టీమిండియాకు మిడిల్ ఓవర్ బౌలర్ కొరత

## భారత్ మ్యాచ్ విన్నర్ బెంచ్‌కే పరిమితం

## ఇంగ్లండ్ వన్డే ఓటమిపై పోస్ట్‌మార్టమ్

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో టీమ్ ఇండియా ఓటమి అనేక ప్రశ్నలను లేవనెత్తింది. వీటిలో అత్యంత చర్చనీయాంశంగా ఉన్నది కుల్దీప్ యాదవ్. తన స్పిన్‌తో ప్రపంచవ్యాప్తంగా బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెట్టినప్పటికీ, అతనికి మూడు మ్యాచ్‌లలో ఒక్క అవకాశం కూడా లభించలేదు. లార్డ్స్‌లో జరిగిన మూడవ వన్డేకు గాయం కారణంగా జస్ప్రీత్ బుమ్రా దూరమయ్యాడు. అయినప్పటికీ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కుల్దీప్‌ను తుది జట్టులోకి తీసుకోవాల్సిన అవసరం లేదని భావించారు. వన్డే ఓటమిపై భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు పోస్ట్‌మార్టంలో కుల్దీప్ వ్యవహారం విమర్శపాలైంది.



ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌లోని మొదటి మ్యాచ్ నుంచే, వికెట్లు తీస్తూ పరుగులు నియంత్రించడంలో నైపుణ్యం ఉన్న మిడిల్ ఓవర్ బౌలర్ కొరత టీమ్ ఇండియాకు ఏర్పడింది. ఈ పాత్రకు కుల్దీప్ యాదవ్ కంటే మెరుగైన ఆటగాడు లేడు. మొదటి వన్డేలో, 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయినప్పటికీ, ఇంగ్లాండ్ జట్టు 258 పరుగులు చేయగలిగింది. ఆ తర్వాత, రెండవ వన్డేలో, 53 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయినప్పటికీ, వారు 234 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించారు. లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో, జస్ప్రీత్ బుమ్రాను తుది జట్టులోకి తీసుకోకపోవడం వల్ల 192 పరుగుల వద్ద మొదటి వికెట్ పడింది. ఇది ఒక ప్రశ్నను లేవనెత్తుతోంది. కుల్దీప్ యాదవ్‌ను బెంచ్‌కే పరిమితం చేయడం అతని కెరీర్‌పై ప్రశ్నలను లేవనెత్తింది. జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్ అందుబాటులో లేకపోయినప్పటికీ లార్డ్స్ వన్డే తుది జట్టులో కుల్దీప్‌కు చోటు దక్కకపోవడం చర్చనీయాంశమైంది. కుల్దీప్ యాదవ్ యొక్క అద్భుతమైన రికార్డును చూస్తే అతను మూడు ఫార్మాట్లలోనూ తనదైన ముద్ర వేశాడు. ముఖ్యంగా వన్డే ఫార్మాట్‌లో అతను తనను తాను నిరూపించుకున్నాడు. 121 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లలో, అతను 118 ఇన్నింగ్స్‌లలో 194 వికెట్లు పడగొట్టాడు. అతని చివరి వన్డే ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగింది, ఆ మ్యాచ్‌లో అతను 10 ఓవర్ల స్పెల్‌లో 42 పరుగులిచ్చి వికెట్లేమీ తీయలేదు. అయితే, జట్టు యాజమాన్యం కేవలం ఒక మ్యాచ్ ఆధారంగా కుల్దీప్‌ను అంచనా వేసి పొరపాటు చేసిందనే చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

# దులీప్ ట్రోఫీలో పశ్చిమ జోన్‌కు కెప్టెన్‌గా రుతురాజ్

**న్యూఢిల్లీ:** దులీప్ ట్రోఫీలో పశ్చిమ జోన్‌కు నాయకత్వం రుతురాజ్ గైక్వాడ్ వహించనున్నాడు. ఈ దులీప్ ట్రోఫీ ఆగస్టు 23 నుండి సెప్టెంబర్ 10 వరకు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్ 2026-2027 సీజన్‌కు కూడా జోనల్ ఫార్మాట్‌లోనే కొనసాగుతుంది. ముంబై చీఫ్ సెలెక్టర్ రాజేష్ పవార్ అధ్యక్షతన జరిగిన ఎంపిక కమిటీ సమావేశం అనంతరం సోమవారం ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో, మహారాష్ట్ర బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్‌గా, ముంబైకి చెందిన షామ్స్ ములానీని వెస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా నియమించారు. గత సీజన్‌లో జట్టుకు నాయకత్వం వహించిన పేసర్ శార్దూల్ ఠాకూర్ నుండి, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న మరియు ఇటీవల శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్‌లతో జరిగిన ట్రై సిరీస్‌లో ఇండియా ఎ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన గైక్వాడ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించబడ్డాయి. ఆగస్టు 23, 26 తేదీలలో జరిగే టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్ 2లో వెస్ట్ జోన్, నార్త్ జోన్‌తో తలపడుతుంది. దులీప్ ట్రోఫీలో ఫైనల్‌తో సహా మొత్తం ఐదు మ్యాచ్‌లు ఉంటాయి, ఇవి సెప్టెంబర్ 6 నుండి 10 వరకు దివీని గ్రౌండ్ 1లో ఆడబడతాయి. కెప్టెన్ గైక్వాడ్ నేతృత్వంలో పృథ్వీ షా, ముషీర్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్, శివాలిక్ శర్మ, జయమీత్ పటేల్, సిద్ధార్థ్ దేశాయ్ వంటి బ్యాటింగ్ ఎంపికలు జట్టుకు యువత, అనుభవం కలయికను అందిస్తున్నాయి. ఈ జట్టులో సౌరాష్ట్ర నుండి ఏకైక ఆటగాడైన హార్విక్ దేశాయ్, గుజరాత్‌కు చెందిన ఉర్విల్ పటేల్ ఇద్దరూ వికెట్ కీపర్లుగా ఉంటూ, జట్టుకు వికెట్ల వెనుక బలమైన ప్రత్యామ్నాయాలను అందించనున్నారు.






# స్పెయిన్‌దే ఫుట్‌బాల్ ప్రపంచకప్

**న్యూఢిల్లీ:** ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో స్పెయిన్ విజేతగా నిలిచింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో స్పెయిన్ 1-0తో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను ఓడించింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో మ్యాచ్ నిర్ణీత సమయంలో ఫలితం తేలలేదు. దాంతో ఎక్స్‌ట్రా టైమ్ ఆడించాల్సి వచ్చింది. ఈ సమయాన్ని స్పెయిన్ సద్వినియోగం చేసుకుంది. 106వ నిమిషంలో స్పెయిన్ ప్లేయర్ ఫెర్రాన్ టొర్రెస్ అద్వితీయమైన గోల్‌తో చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఈ విజయంతో స్పెయిన్ రెండో ప్రపంచకప్‌ను ముద్దాడింది. 2010లో తొలి ప్రపంచకప్‌ను గెలుచుకున్న స్పెయిన్ 16 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మళ్లీ విశ్వవిజేతగా నిలిచింది. ఈ ఫైనల్లోస్పెయిన్ టికి టాకా వ్యూహం ముందు అర్జెంటీనా తేలిపోయింది. ఫైనల్లో పూర్తిగా స్పెయిన్ ఆధిపత్యం కనబర్చింది. బంతిని పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకున్న స్పెయిన్ అర్జెంటీనా గోల్ పోస్ట్‌పై పదే పదే దాడి చేసింది. కానీ ఆ జట్టు గోల్ కీపర్ మార్టినెజ్ అడ్డుగోడలా నిలిచాడు. లేకుంటే అర్జెంటీనా ఘోర పరాజయాన్ని మూటగట్టుకునేది. స్పెయిన్ ఆటలో 68 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని ఆధిపత్యం చెలాయించింది. అంతేకాకుండా అర్జెంటీనా గోల్ పోస్ట్‌పై 11 సార్లు దాడి చేసింది. తమ టికీ టాకా వ్యూహంతో చిన్న చిన్న పాస్‌లు ఇచ్చుకుంటూ ఆటను వేగంగా నడిచేలా చూసుకుంది. ప్రత్యర్థి ప్రణాళికలను ముందే పసిగడుతూ చెలరేగింది. అర్జెంటీనా ప్లేయర్ ఫెర్నాండో 90+3 నిమిషంలో రెడ్ కార్డుతో బయటకు వెళ్లి పోవడం ఆ జట్టు కొంపముంచింది. దాంతో అర్జెంటీనా 10 మంది ప్లేయర్లతోనే మిగతా ఆటను కొనసాగించాల్సి వచ్చింది. ఈ అవకాశాన్ని స్పెయిన్ సద్వినియోగం చేసుకుంది. ఫైనల్లో గోల్ కొట్టి స్పెయిన్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఫెర్రాన్ టొర్రెస్‌కు సుపీరియర్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# ఫిఫా వరల్డ్ కప్‌లో ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాప్పేకు రెండు అవార్డులు



**న్యూఢిల్లీ:** ఫిఫా వరల్డ్‌కప్ చాంపియన్‌గా స్పెయిన్ అవతరించిన విషయం తెలిసిందే. అసాధారణ రీతిలో సాగిన ఫైనల్లో 1-0 గోల్స్ తేడాతో అర్జెంటీనాను స్పెయిన్ ఓడించింది. అయితే వరల్డ్‌కప్‌లో అందజేసే అవార్డుల్లో ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాప్పేకు రెండు అవార్డులు దక్కాయి. ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శించిన స్పెయిన్ ప్లేయర్ రోడ్రికి గోల్డెన్ బాల్, అర్జెంటీనా ప్లేయర్ లియోనల్ మెస్సీకి సిల్వర్ బాల్, ఫ్రాన్స్ ప్లేయర్ కైలియన్ ఎంబాప్పేకు బ్రాంజ్ బాల్ అవార్డులు దదక్కాయి. ఇక ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ బూట్ అవార్డు ఎంబాప్పేకు దక్కింది. అతనికి బ్రాంజ్ బాల్‌తో పాటు గోల్డెన్ బూట్ అవార్డు దక్కడం విశేషం. టోర్నీలో అతను 10 గోల్స్, 4 అసిస్టలతో ఆ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఇక సిల్వర్ బూట్ అవార్డు మెస్సీని వరించింది. ఇంగ్లండ్ ప్లేయర్ జూడ్ బెల్లింగ్‌హామ్‌కు బ్రాంజ్ బూట్ అవార్డు దక్కింది. ఇక టోర్నీలో ప్రత్యర్థులకు గోల్ పోస్టులో అడ్డుగోడలా నిలిచిన గోల్‌కీపర్ ఉనాయ్ సిమన్‌కు గోల్డెన్ గ్లోవ్ అవార్డు దక్కింది. ఫిఫా యంగ్ ప్లేయర్ అవార్డు స్పెయిన్ ప్లేయర్ పావు కుబారిస్‌కు దక్కింది. ఇక ఫెయిర్ ప్లే ట్రోఫీ నెదర్లాండ్స్ జట్టను వరించింది.

# స్విస్ ఓపెన్‌లో సిట్సిపాస్‌కు టైటిల్



**న్యూఢిల్లీ:** స్విస్ ఓపెన్‌లో సిట్సిపాస్ ఏటీపీ టైటిల్‌ను గెలుచుకున్నాడు. స్విస్ ఓపెన్‌లో, గ్రీస్‌కు చెందిన స్టెఫానోస్ సిట్సిపాస్ బెల్జియంకు చెందిన రాఫెల్ కొలిగ్నాన్‌పై మూడు సెట్ల విజయంతో దాదాపు ఏడాదిన్నర తర్వాత ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. మాజీ ప్రపంచ ర్యాంకర్ 3, క్లే కోర్ట్ టోర్నమెంట్‌లో 6-4, 6-7 (3), 6-3 తేడాతో గెలిచి, తన కెరీర్‌లో 13వ ట్రోఫీని, ఫిబ్రవరి 2025లో దుబాయ్ తర్వాత మొదటి ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. 27 ఏళ్ల అతను 2021లో తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్ అయిన మూడో స్థానం నుండి ప్రపంచ ర్యాంకింగ్‌లో 85వ స్థానానికి పడిపోయాడు మరియు ఆ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో, 2023లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. సిట్సిపాస్ 2019లో లండన్‌లో జరిగిన ఏటీపీ మాస్టర్స్‌ను, అలాగే 2021, 2022 మరియు 2024లో మూడుసార్లు మాంటె కార్లో మాస్టర్స్‌ను కూడా గెలుచుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 42వ స్థానంలో ఉన్న 24 ఏళ్ల కొలిగ్నాన్, సెమీఫైనల్స్‌లో అర్జెంటీనాకు చెందిన జువాన్ మాన్యుయెల్ సెరుండోలోను ఒక మ్యాచ్ పాయింట్‌తో ఓడించి, తన మొదటి ఏటీపీ ఫైనల్ ఆడుతున్నాడు.

# రాణించడమే నా బాధ్యత


## రిటైర్మెంట్ పై రోహిత్



**న్యూఢిల్లీ:** లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన చివరివన్డే మ్యాచ్‌లో భారత్‌కు పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ 138 పరుగులతో అద్భుతమైన సెంచరీ సాధించినప్పటికీ భారత్‌కు విజయాన్ని అందించలేకపోయాడు. 110 బంతుల్లో అయిదు భారీ సిక్సర్లు, ఏడు మెరుపు బౌండరీలతో హిట్ మ్యాన్ 138 పరుగులు బాదాడు. లాఫ్టెడ్, హుక్, లాంగ్, స్వీప్, కవర్ డ్రైవ్ ఇలా దాదాపు అన్ని షాట్లతో రెచ్చిపోయాడు. ఈ సెంచరీతో రోహిత్ శర్మ ఎన్నో అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకుని ఐకాన్‌గా నిలిచాడు. వన్డే సిరీస్ ఓటమి అనంతరం రోహిత్ శర్మ మాట్లాడాడు. తన రిటైర్మెంట్ పుకార్లపై స్పందించాడు. తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను తేలిగ్గా తీసుకున్నాడు. వాటిని కొట్టిపారేశాడు. దేశం కోసం రాణించడమే ఓ క్రికెటర్ గా తన బాధ్యత అని స్పష్టం చేశాడు. తన భవిష్యత్ గురించి వస్తోన్న వ్యాఖ్యలు విమర్శలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వట్లేని, క్రీడా జీవితంలో ఉన్నప్పుడు ఇలాంటి ప్రచారాలు సహజమేనని, ఆట ద్వారా మాత్రమే వీటికి సమాధానం ఇస్తానని పేర్కొన్నాడు. కెరీర్‌లో అరంగేట్రం చేసినప్పటి నుంచే తన చుట్టూ ఇటువంటి వాతావరణం ప్రచారంలో ఉందని, అవి లేకపోతే ఎంటర్టైన్మెంటే ఉండబోదని నవ్వుతూ చెప్పాడు. విరాట్ కోహ్లీ గురించి మాట్లాడుతూ కెరీర్ ప్రారంభం నుండే కలిసి ప్రయాణిస్తోన్నామని, క్రీజ్ లో ఉన్నప్పుడు ఒకరి వ్యూహాలను ఒకరు పంచుకుంటూ బ్యాటింగ్ చేస్తుంటామని, అది విజయానికి దోహదపడుతుందని వివరించాడు. లార్డ్స్ వన్డే ఓటమిపై రోహిత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టులోని యువ బౌలర్లకు వన్డే ఫార్మాట్‌లో తగినంత అనుభవం లేదని, వారు రాణించడానికి మరికొంత సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. ఈ ఓటమి నుంచి నేర్చుకున్న పాఠాలు భవిష్యత్తు సిరీస్‌లలో ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డాడు. ఇంగ్లాండ్ పర్యటనలో లభించే కఠిన సవాళ్లు ఓ క్రికెటర్‌గా తనకు ఎంతో సంతృప్తిని ఇస్తాయని వ్యాఖ్యానించాడు.

# విదేశీ డిపాజిట్ల సమీకరణలో బ్యాంకుల రికార్డు

## ఎఫ్‌సిఎన్‌ఆర్ డిపాజిట్లపై 20.712 బిలియన్ డాలర్ల సేకరణ



**న్యూఢిల్లీ:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ చేపట్టిన విదేశీ నిధుల డిపాజిట్ పథకానికి విశేష స్పందన లభించింది. విదేశీ మారక నిల్వలను బలోపేతం చేయడం, చెల్లింపుల సమతుల్యతకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా తీసుకొచ్చిన చర్యల ద్వారా జూన్ 8 నుంచి జులై 17, 2026 వరకు బ్యాంకులు 17.4 బిలియన్ డాలర్ల తాజా ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్లను సమీకరించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఇదే కాలంలో ఓవర్సీస్ ఫారిన్ కరెన్సీ బారోయింగ్స్ ద్వారా 1.97 బిలియన్ డాలర్లు, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ ద్వారా మరో 1.342 బిలియన్ డాలర్లు సమీకరించాయి. ఈ మూడు మార్గాల్లో మొత్తం 20.712 బిలియన్ డాలర్ల విదేశీ నిధులు దేశంలోకి వచ్చాయి. విదేశీ మూలధన పెట్టుబడులు, డిపాజిట్లను ప్రోత్సహించడం, దేశ చెల్లింపుల సమతుల్యతను బలోపేతం చేయడం, విదేశీ మారక నిల్వలను పెంచడం ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశం. ఈ ప్యాకేజీలో భాగంగా, కొత్తగా సమీకరించే ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్లు, ఓఎఫ్‌సీబీలు, ఈసీబీ నిధుల కోసం ఆర్‌బీఐ రాయితీ స్వాప్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ సదుపాయం ద్వారా బ్యాంకులు విదేశీ కరెన్సీలో వచ్చిన నిధులను అనుకూల మారకపు నిబంధనలతో రూపాయిలుగా మార్చుకునే అవకాశం కల్పించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్లకు స్వాప్ విండో సెప్టెంబర్ 30, 2026 వరకు, ఓఎఫ్‌సీబీలు, ఈసీబీలకు డిసెంబర్ 31, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. పథకం ప్రారంభమైనప్పటి నుంచి బ్యాంకులు, విదేశీ పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభించిందని ఆర్‌బీఐ తెలిపింది. ఆర్‌బీఐ అందిస్తున్న రాయితీ స్వాప్ సౌకర్యం వల్ల బ్యాంకులకు కూడా ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం లభిస్తోంది. విదేశీ మారక నిధుల ప్రవాహాన్ని పెంచడం, దేశ బాహ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడం, చెల్లింపుల సమతుల్యతకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ చర్యలు ఇప్పటికే ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని తాజా గణాంకాలు సూచిస్తున్నాయి.

వాణిజ్యం




# మూలధన లాభాల పన్ను రేట్లలో మార్పు ప్రతిపాదన లేదు: కేంద్రం

**న్యూఢిల్లీ,జులై20:** దేశంలో మూలధన లాభాలపై విధించే పన్ను రేట్లలో మార్పులు చేయాలన్న ప్రతిపాదనఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్ను విధానంలో మార్పులపై వస్తున్న ఊహాగానాలకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంట్‌లో ఇచ్చిన సమాధానంతో తెరపడింది. పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ మూలధన లాభాల పన్ను రేట్లతో పాటు ఇతర పన్ను విధానాలను ప్రతి ఏడాది కేంద్ర బడ్జెట్ ప్రక్రియలో భాగంగా, దేశంలోని స్థూల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమీక్షిస్తామని పేర్కొంది. ప్రస్తుతం క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ రేట్లలో మార్పు చేసే ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది. ఇక ఈక్విటీ లావాదేవీలపై విధించే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది. ఈక్విటీ లావాదేవీలపై లిగిదిబి పన్ను ద్వారా రూ.1, 29,158 కోట్లు వసూలుకాగా అంతకు ముందు ఈ ఆదాయం రూ.72,249 కోట్లు మాత్రమే ఉంది. తాజా గణాంకాల ప్రకారం 79 శాతం వృద్ధి నమోదైంది. స్టాక్ మార్కెట్‌లో లావాదేవీలు పెరగడం, పన్ను వసూళ్ల అధికం కావడం ఇందుకు ప్రధాన కారణాలని ప్రభుత్వం పేర్కొంది.

# ఈ యేడు ఆర్థికవృద్ధి 6.5 -6.8శాతమే

## -డెలాయిట్ ఇండియా




**న్యూఢిల్లీ,జులై 20:** భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం నుంచి 6.8 శాతం మధ్య వృద్ధిని నమోదు చేసే అవకాశముందని డెలాయిట్ ఇండియా అంచనా వేసింది. పండుగల సీజన్‌లో వినియోగ డిమాండ్ పెరగడం, రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన సడలింపులు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు క్రమంగా స్థిరపడటం వంటి అంశాల కారణంగా ఆర్థిక వృద్ధి రెండో అర్ధభాగంలో మరింత బలపడుతుందని సంస్థ తన తాజా ఎకనామిక్ అవుట్‌లుక్ నివేదికలో పేర్కొంది. నివేదిక ప్రకారం, ఈఏడాది ప్రారంభంలో భారత్ ఆర్థిక వ్యవస్థ గోల్డీలాక్స్ దశలోకి ప్రవేశించింది. ద్రవ్యోల్బణం, వృద్ధి, వడ్డీ రేట్లు వంటి కీలక స్థూల ఆర్థిక సూచీలు సమతుల్య స్థితిలో కనిపించాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేశాయి. కీలక సముద్ర రవాణా మార్గాల్లో అంతరాయాలు ఏర్పడటం, వస్తు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు రావడం, పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతినడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని నివేదిక వెల్లడించింది. ఈ పరిణామాల ప్రభావంతో భారత వాణిజ్య లోటుపెరిగిందని, విదేశీ పెట్టుబడులవిత్‌డ్రా కొనసాగిందని, అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తక్కువ కాలంలోనే గణనీయంగా పడిపోయిందని పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గత నెలలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుమ్కి మజుందార్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వాతావరణం మరింత అనిశ్చితంగా మారిందన్నారు. ఇటీవల చోటుచేసుకున్న భౌగోళిక పరిణామాలు, ఆర్‌బీఐ తీసుకున్న విధానపరమైన చర్యలు కొన్ని ప్రమాదాలను తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ, ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం, వాతావరణ అనిశ్చితులు, వ్యవసాయ ఉత్పత్తి తగ్గుదల, ఆహార ధరల పెరుగుదల వంటి అంశాలు వృద్ధికి ప్రధాన ప్రతికూల ప్రమాదాలుగా మిగిలి ఉన్నాయని తెలిపారు ఎఫ్‌టీఏల ద్వారా లభించే మార్కెట్ అవకాశాలను శాశ్వత పోటీ సామర్థ్యంగా మార్చుకోవడం అత్యంత అవసరమని రుమ్కి మజుందార్ సూచించారు. వాణిజ్య విధానాలకు తోడు పారిశ్రామిక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, దేశీయ సరఫరా వ్యవస్థల బలోపేతం, నిబంధనల సరళీకరణ, ఆవిష్కరణలు, నైపుణ్యాల అభివృద్ధిపై పెట్టుబడులు పెంచాలని ఆమె అభిప్రాయపడ్డారు. ముడి చమురు, ఎరువులు, కీలక ఖనిజాలు, వంటనూనెల ధరలు పెరగడం, రూపాయి బలహీనపడటం వల్ల దేశీయ ధరలపై ఒత్తిడి పెరుగుతోందని నివేదిక తెలిపింది.



## ఈక్విటీ సూచీలను దెబ్బతీసిన ప్రైవేటు బ్యాంకులు

# నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,జులై 20:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ప్రైవేట్ బ్యాంకుల ఫలితాల తర్వాత ఈ రంగ షేర్లలో భారీ అమ్మకాలు జరగడంతో మార్కెట్లపై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం వంటి అంశాలు కూడా పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. రంగాల వారీగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఫార్మా, ఎనర్జీ షేర్లు లాభపడగా, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 442.93 పాయింట్లు పడిపోయి 77,708.52 వద్ద ముగిసింది. ఎన్ఎస్‌ఈ నిఫ్టీ 95.80 పాయింట్లు కోల్పోయి 24,238.50 వద్ద స్థిరపడింది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.47లాభపడగా, స్మాల్‌క్యాప్ సూచీ0.21 పెరిగింది. బీఎస్‌ఈలో2,226 షేర్లు లాభపడగా, 2,039 షేర్లు నష్టపోయాయి. 255 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.780 నుంచి 6.782 శాతానికి స్వల్పంగా పెరిగింది. రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే గత ముగింపు 96.3050 నుంచి 96.4500 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ 0.66 పెరిగి రూ.1,41,793కు చేరాయి. సెప్టెంబర్ 2026 బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 14 సెంట్లు తగ్గి 87.96 డాలర్ల వద్ద ట్రేడైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 5.08 క్షీణించింది. యాక్సిస్ బ్యాంక్ 5.37 పడిపోయింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.96 నష్టపోయింది. యెస్ బ్యాంక్ 2.80 తగ్గింది. ఐడీబీఐ బ్యాంక్ 2.10 పడిపోయింది. ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం 1.16 లాభపడింది. ఆర్‌బీఎల్ బ్యాంక్ 0.19 పెరిగింది. కంపెనీ స్వతంత్ర నికర లాభం ఏడాది ప్రాతిపదికన 26.64 పెరిగి రూ.253.70 కోట్లకు చేరింది.

## సైబర్ భద్రతా లోపాలపై సిడిఎస్ఎల్‌కు

# సెబీ కోటి జరిమానా

**న్యూఢిల్లీ,జులై 20:** దేశీయ మూలధన మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ 2022లో జరిగిన మాల్వేర్ సైబర్ దాడికి సంబంధించి సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) రూ.1 కోటి జరిమానా విధించింది. సైబర్ భద్రతా నిబంధనలను పాటించడంలో నిర్లక్ష్యం కారణంగానే ఈ దాడి జరిగిందని, ఇది ముందుగానే ఊహించదగిన ఘటనేనని సెబీ తన ఉత్తర్వులో స్పష్టం చేసింది. విడుదల చేసిన 88 పేజీల ఉత్తర్వులో, సెబీ చట్టం కింద రూ.90 లక్షలు, డిపాజిటరీస్ చట్టం కింద రూ.10 లక్షలు జరిమానా విధించింది. సీడీఎస్ఎల్ మాజీ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజేష్ నద్కర్ణి, మాజీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అమిత్ మహాజన్లపై విచారణను ముగించినప్పటికీ, వారికి ఎలాంటి ఆర్థిక జరిమానా విధించలేదు. సైబర్ దాడి అనేది దురదృష్టకరమైన, ఊహించలేని ఘటన అని సీడీఎస్ఎల్ చేసిన వాదనను సెబీ తిరస్కరించింది. భద్రతా నియంత్రణల్లో జరిగిన నిర్లక్ష్యం వల్లే మాల్వేర్ దాడి జరిగిందని, ఇది పూర్తిగా నివారించగలిగే పరిణామమని సెబీ పేర్కొంది. సెబీ గుర్తించిన ప్రధాన లోపాలుదర్యాప్తులో సీడీఎస్ఎల్ పలు కీలక సైబర్ భద్రతా నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలింది.

# 8 కీలక రంగాల వృద్ధి 5 శాతం

## సిమెంట్, ఉక్కు రంగాల జోరు



**న్యూఢిల్లీ,జులై 20:** దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావించే ఎనిమిది కీలక మౌలిక రంగాలు జూన్ నెలలో వార్షిక ప్రాతిపదికన 5% వృద్ధిని నమోదు చేశాయి. మేలో నమోదైన 3.2% వృద్ధితోపోలిస్తే ఇది గణనీయమైన మెరుగుదల. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన 2023 ప్రామాణికసంవత్సరంతో రూపొందించిన కొత్త శ్రేణి గణాంకా వెల్లడయ్యాయి. జూన్‌లో ముఖ్యంగా సిమెంట్ ఉత్పత్తి 9.8 శాతం పెరిగింది. మేలో ఇది 8.4 శాతం వృద్ధి నమోదు చేయగా, జూన్‌లో మరింత పెరగడం దేశంలో నిర్మాణ కార్యకలాపాలు వేగం పుంజుకున్నట్లు సూచిస్తోంది. ఉక్కు ఉత్పత్తి కూడా బలమైన ప్రదర్శన కనబరిచింది. మేలో 5.1% పెరిగిన ఉత్పత్తి, జూన్‌లో 4.6% వృద్ధిని నమోదు చేసింది. బొగ్గు ఉత్పత్తి మే నెలలో 9.5% క్షీణించిన తర్వాత జూన్‌లో 1.4% వృద్ధితో కోలుకుంది. ముడి చమురు ఉత్పత్తి మాత్రం ఒత్తిడిలోనే కొనసాగింది. జూన్‌లో ఇది 4.2%తగ్గింది. సహజ వాయువు (నేచురల్ గ్యాస్) ఉత్పత్తి కూడా వరుసగా క్షీణిస్తూ జూన్‌లో 7.4 శాతం పడిపోయింది. మేలో ఈ తగ్గుదల 5 శాతంగా నమోదైంది. ఎరువుల ఉత్పత్తి జూన్‌లో 3.3 శాతం తగ్గింది. మేలో ఇది 1 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. ఇక ఎనిమిది కీలక రంగాల సూచీలో అత్యధిక వాటా కలిగిన పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు కూడా 4.7 శాతం క్షీణించాయి. మేలో ఈ తగ్గుదల 8.2 శాతంగా ఉండగా, జూన్‌లో కొంత మేర తగ్గుదల పరిమితమైంది. దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఈ ఎనిమిది కీలక రంగాల వాటా సుమారు 40 శాతం ఉంటుంది. అందువల్ల వీటి పనితీరు పారిశ్రామిక రంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# ఇల్లు మారుతుంటే ..



ఉద్యోగం కోసమో, పిల్లలను మంచి స్కూల్లో వేయాలనో కారణాలేమైనా ఉన్న ఇంటిని వదిలేసి కొత్త ఇంట్లోకి మారే తల్లిదండ్రులు చాలామందే ఉన్నారు. అయితే, ఆ ఆలోచన మన పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని తెలుసా! పిల్లల బాల్యంలో కనుక.. తరచూ ఇళ్లు మారుతోంటే పెద్దయ్యాక వాళ్లు కుంగుబాటు బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తాజాగా యూనివర్సిటీ ఆఫ్ ప్లైమౌత్ చేసిన పరిశోధనలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా డెన్మార్క్‌లో 1981 నుంచి 2001 వరకూ జన్మించిన పదిలక్షల మందిని ఎంపికచేసు కుని వారి మొదటి 15 ఏళ్ల జీవితాన్ని పరిశీలించారు. వారికే పెద్దయ్యాక తిరిగి పరీక్షిస్తే, అందులో 35వేల మందికి పైగా డిప్రెషన్ బారిన పడినట్లు గుర్తించారు. ముఖ్యంగా 10 నుంచి 15 ఏళ్ల మధ్యలో ఒక్కసారి నివాసం మారిన వారిలో 41 శాతం కుంగుబాటుకు గురవగా, రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు మారిన వారిలో ఆ రిస్క 61 శాతానికి పెరిగిదట. ఇది దుర్భర జీవన పరిస్థితులు ఎదుర్కొనే పిల్లల్లో ఉన్న కుంగుబాటు శాతం కంటే అధికమట. ఇక వృత్తిరీత్యా అనేక ప్రాంతాలు మారాల్సి వచ్చే మిలిటరీ తల్లిదండ్రులూ పిల్లల మీద అత్యంత శ్రద్ధ చూపించాలం టున్నారు పరిశోధకులు. నిజానికి మానసిక అనారోగ్యాలకు కారణాలు అనేకం ఉన్నప్పటికీ, పెరిగే వయసులో పదేపదే వాతావరణాన్ని మార్చడమూ ఒక కారణమవుతుందంటు న్నారు పరిశోధకులు. ఆటలూ, రకరకాల యాక్టివిటీలతో అప్పుడప్పుడే స్కూల్లో తోటి విద్యార్థులతో స్నేహ బంధాలు ఏర్పరచుకోవడంతో పాటు చుట్టూ ఉండే వాతావణానికీ అలవాటు పడుతుంటారు. ఇలాంట ప్పుడు మన తరచూ నివాస ప్రాంతాన్ని మారుస్తుంటే వాళ్ల ఎదుగుదలకు అంతరాయం కలుగుతుంటుంది. కాబట్టి, పిల్లలకు చిన్నతనంలో స్థిరమైన బాల్యాన్ని అందించాల్సి న అవసరం ఉందని చెబుతున్నారు పరిశోధకులు.

చిట్కా

కాల్చిన అల్లపుముక్కను ఉప్పుతో అద్ది తింటున్న అరుచి తగ్గును.

# మెరిసే చర్మం కోసం



కీరదోస, ఓట్స్ ఫేస్‌మాస్క్‌ను ప్రయత్నిం చండి. ముందుగాతొక్క తీసిన కీరదోస ముక్కలను మిక్సీలో వేసి మెత్తని ముద్దగా చేసుకోండి. దానికి రెండు టేబుల్ స్పూన్ల ఓట్స్‌ను కలిపి మరోసారి మిక్సీ పట్టండి. ఆ మిశ్రమానికి ఓ టీస్పూన్ తేనె వేసి కలిపి.. శుభ్రపరచుకున్న ముఖానికి రాయాలి. అరగంట అయ్యాక, గోరువెచ్చని నీటితో ముఖం కడిగేసుకుంటే సరి. కీరదోస చర్మాన్ని చల్లబరిచి వాపును తగ్గిస్తుంది. మచ్చలు మానేలానూ చేస్తుంది. ఓట్స్‌లో అధికంగా ఉండే జింక్.. ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి, మొటిమలు పెరగకుండా చేస్తుంది. కాబట్టి, తరచూ ఈమాస్క్‌ను వేసుకుంటే మెరిసే చర్మం మీ సొంతమవుతుంది.

# ఇండోర్ మొక్కలకు వర్షం నీరు



ఇంట్లో డైనింగ్ టేబుల్ లేదా కిటికీలో ఉండే ఇండోర్ మొక్కలకు ఈ సీజన్‌లో వర్షపు నీటిని అందేలా చేయొచ్చు. అలాగని భారీ వర్షంలో కాకుండా చిన్న చిన్నకులు పడే చోట వీటిని ఉంచితే అవి చక్కగా పెరుగు తాయి. వర్షపునీరు మొక్కలకు పలు ప్రయోజనాలనిస్తుంది. సాధారణంగా పంపు నీటిలో లవణాలు, ఖనిజాలుంటాయి. ఈ నీటిని మొక్కలకు పోయడంవల్ల ఇవన్నీ తొట్టెలలోని మట్టిలో కరిగి ఉంటాయి. ప్రత్యేకంగా కాల్షియం, మెగ్నీసియం ఎక్కువగా చేరిపోతయాఇ. దాంతో మట్టిపై కాల్షియం కార్బొనేట్ పొర ఏర్పడుతుంది. ఫలితంగా మట్టి ఎండిపోయినట్లు అయ్యి నీటిని పీల్చుకోదు. మొక్కకు ఆక్సిజన్ అందనివ్వదు. అయితే వర్షపునీరు సహజంగా మృదువైంది. ఇది తొట్టెలో పేరుకున్న ఖనిజాలను బయటకు పంపడంలో సహచపడి, మొక్క ఆరోగ్యంగా పెరిగేలా చేస్తుంది. ఆకులపై ఉండే రంధ్రాలను వర్షపునీరు తెరిచేలా చేస్తుంది. దీంతో కిరణజన్య సంయోగక్రియ కోసం కార్బన్ డయాక్సైడ్, పోషకాలను తీసుకునే సామర్థ్యాన్ని మెరుగుపడేలా చేస్తుంది. దీంతో మొక్క ఎదుగుదల బాగుంటుంది.

**ఏం చేయాలి....** సాధారణంగా ఇండోర్ మొక్కల తొట్టెల్లోని మట్టి చెమ్మగా ఉంటుంది. వీటిని గాలి ఎక్కువగా వీచకుండా చిన్నగా పడుతున్న వర్షంలో ఉంచితే దెబ్బ తినవు. వర్షపునీరులో ఎక్కువ ఆక్సిజన్ ఉంటుంది. దీంతో తొట్టెలో నీరు నిండపోయినా మొక్కకు అంతగా ప్రమాదం ఉండదు. అలాగని ఎక్కువ వర్షంలో లేదా ఎక్కువ సేపు మాత్రం ఇండోర్ మొక్కలను ఉంచకూడదు. అలాగేరాత్రి సమయాల్లో బయట వదిలేయకుండా ఇంట్లోకి తేవడం మంచిది. పగటి పూట వర్షం వెలిసిన తర్వాత కూడా మొక్కను బయట ఉంచ కూడదు. వర్షం తర్వాత వచ్చే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంవల్ల మొక్క దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

# సీతమ్మ నయనాలు.. రామయ్య వైనాలు

## ప్రథమ సంకల్పం



సీతమ్మ అందాలు రఘురామయ్య వైనాలు కలిసి 'శుభ సంకల్పం' అయినట్లుగానే సీతమ్మ నయనాలను రఘురామ వైనాలను వెరసి ఒక మహత్తర ఇతిహాస కావ్యం రామాయణాన్ని ప్రఖ్యాత దర్శకుడు నితీష్ తివారీ ఓ అద్భుత చిత్రంగా మలిచాడు. రామాయణం ప్రథమ సంకల్పంలో భాగంగా ఢిల్లీ కార్యక్రమంలో ఈ పాత్ర పోషించే అవకాశం లభించడం నా అదృష్టం," అని సాధ్వీమణి సీత పాత్రధారి సాయి పల్లవి అన్నారు. 4 వేల కోట్ల రూపాయల బడ్జెట్‌తో నిర్మించిన ' రామాయణం : మొదటి భాగం' 2026 నవంబర్ 8న థియేటర్లలోకి రానుంది. ఆ చిత్ర తారాగణం సాంకేతిక బృందంతో ఢిల్లీలో ప్రమోషన్ కోసం నిర్వహించిన 'ప్రథమ సంకల్ప్' అనే మీడియా కార్యక్రమంతో ప్రచారాన్ని ప్రారంభించారు. హిందూ ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రంలో పౌరాణిక పాత్రలు పోషించే అవకాశం లభించడంపై చిత్ర బృందం నటీనటులు రణబీర్ కపూర్, సాయి పల్లవి, యశ్, కునాల్ కపూర్, రవి దూబే, కుమార్ విశ్వాస్, అరుణ్ గోవిల్ ఎంతో అదృష్టంగా భావించారు. నటి సాయి పల్లవి గులాబీ బంగారు రంగుల కంచీవరం చీరలో అందరి దృష్టిని ఆకర్షించారు. క్లిష్టమైన జరీ పనితో కూడిన ఈ చీర అంచు గులాబీ రంగులో ఉండగా, మిగిలిన భాగం బంగారు వర్ణంలో ఉంది. జాకెట్ కూడా గులాబీ రంగులో, బంగారు జరీతో అలంకరించినట్లుంది. ఈ లుక్‌ను సింపుల్‌గానూ సొగసు దనం ఉట్టిపడేలా, చీర రంగుకు సరిపోయేలా గులాబీ రత్నాలు పొదిగిన బంగారు టెంపుల్ జ్యువెలరీతో ఆ నటి సాంప్రదాయమ హుందాతనంతో కనిపించింది. ఆమె తన కుడి చేతికి వరుసగా గాజులు, ఎడమ చేతికి చీర కొంగు కింద జపమాల ధరించింది. ఈ యాక్సెసరీస్‌ను పూర్తి చేస్తూ, ప్రతి చేతికి బంగారు ఝుమ్కాలు ఒక ఉంగరం ధరించారు. మేకప్‌లోనూ ఏ మాత్రం పవిత్రతనూ తీసిపోకుండా ఢిల్లీలోని వేడి, తేమతో కూడిన వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని సాయి పల్లవి డ్యూయీ బేస్‌ను ఎంచుకున్నారు. ఆమె తక్కువ ఫౌండేషన్, పింక్ బ్లష్‌ను వాడారు. బంగారు రంగు హైలైటర్ ఆమె ముఖంలోని ఎత్తైన భాగాలకు మెరుపును జోడించింది. నుదుటి మధ్యలో ఎర్రటి బొట్టు, పలుచని ఐలైనర్ పొర ఆమెను అపురూప సౌందర్యవతిగా మలిచాయి. .ఆమె తన సహజంగా ఉంగరాల జుట్టును మధ్య పాపిడి తీసి సగం హెయిర్‌డోగా తీర్చిదిద్దుకుంది. ఈ సందర్భంగా సీత పాత్రధారి సాయిపల్లవి మాట్లాడుతూ ఒక దేవత పాత్రను పోషించడం అంత తేలిక కాదు. ఇంత దేవదత్తమైన పాత్ర పోషించగలనని తాను ఎప్పుడూ అనుకోలేదని ఆ అవకాశం తనకు ఒక వరం అని ఎంతో భావోద్వేగంతో ఆ పాత్ర పోషించే అవకాశం నాకు లభించడం నా అదృష్టం. ఇది మనం వెంటపడి వెదికితే వచ్చేది కాదు. చిత్రీకరణ జరుగుచున్న సమయంలో ధ్యానంలోనే సీతమ్మతల్లీ నన్ను బాగా నటించేలా చేయి అని వేడుకున్నా అన్నారు. వెండితెరపై సీత పాత్రను పోషించడంలోనూ ఎంతో పవిత్రాత్మతో ఉండేందుకు ప్రయత్నించా. వీలైనంత స్వచ్ఛమైన మనసుతో, ఆలోచనలతో నేను నాలోని ఉత్తమ రూపాన్ని తెరపై ప్రదర్శించగలిగాను. రామాయణ చిత్ర నిర్మాతలు ఈ సినిమా ట్రైలర్‌ను జులై 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దీని గ్రాండ్ లాంచ్ ఈవెంట్ అనంతరం, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ట్రైలర్ అదే రోజున ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల కోసం డిజిటల్‌గా అందుబాటులోకి రానుంది. ఈ వేదికకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు రామాయణ ట్రైలర్ విడుదల కార్యక్రమంలో రణబీర్ కపూర్ నలుపు రంగు బంద్‌గాలా కుర్తాను తెల్లటి ప్యాంటుతో జతచేసి 'క్లాసిక్ లుక్'లో కనిపించారు. ఆయన ఈ దుస్తులకుముదురు రంగు సన్ గ్లాసెస్, ఒక స్టైలిష్, వాచ్, మెరిసే నల్లటి బూట్లు ఒక చిన్న బ్రోచ్‌తో =పూర్తి హంగును చేకూర్చారు. ఈ ఇతిహాస భాగాలు 2026 దీపావళి , 2027 దీపావళి నాడురెండు భాగాలుగా విడుదల కానుంది. దర్శకుడు నితీష్ తివారీ రాముడిగా నటిస్తున్న రణ్‌బీర్ కపూర్, సీతగా నటిస్తున్న సాయి పల్లవిలపై ప్రశంసల జల్లు కురిపించారు. వీరిద్దరి నటన సినిమాకు ప్రాణమని కొనియాడారు."నటీనటుల కళ్లు ఎప్పుడూ నిజాలనే చెబుతాయి. రణ్‌బీర్ కళ్లల్లో నాకుశ్రీరాముడు, సాయి పల్లవి కళ్లల్లో సీతమ్మ తల్లి కనిపించారు. ఈ పాత్రలకు కావాల్సిన నిజాయితీ, పవిత్రత నాకు ఈ ఇద్దరిలోనే దొరికాయి. ఇప్పుడు స్క్రీన్‌పై నాకు రణ్‌బీర్, సాయి పల్లవి లు కనిపించడం లేదు.. కేవలం రాముడు, సీత మాత్రమే కనిపిస్తున్నారు" అని దర్శకుడు నితీష్ తివారీ సగర్వంగా వివరించారు.

# చింతాకు చికెన్ ఫ్రై ..



**కావలసినవి :** బోన్‌లెస్ చికెన్-అరకేజీ, చింతచిగురు-ఒకటింపావు కప్పు, కొబ్బరి తురుము-రెండు చెంచాలు, అల్లంవెల్లుల్లి ముద్ద-చెంచా, ఉల్లిపాయలు-రెండు, పచ్చిమర్చి-మూడు, పసుపు-పావుచెంచా, కారం-రెండు చెంచాలు, ధనియాలపొడి- చెంచా, గరంమసాలా-అరచెంచా, ఉప్పు-తగినంత, నూనె-అరకప్పు, దాల్చినచెక్క-రెండు ముక్కలు, అవంగాలు-మూడు. **తయారీ :** చింత చిగురును శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. స్టౌమీద కడాయి పెట్టి నూనె పోయాలి. అదికాగాక దాల్చినచెక్క, లవంగాలు వేసి వేయించుకోవాలి. అందులోనే ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి తరుగు వేయాలి. అవి బాగా వేగాక అల్లం వెల్లుల్లి ముద్ద,చికెన్ ముక్కలు వేసి బాగా కలిపి మూత పెట్టేయాలి. అయిదు నిమిషాల య్యాక పసుపు, కారం, తగినంత ఉప్పు, ధనియాలపొడి, కొబ్బరి తురుము, గరంమసాలా వేసి బాగా కలిపి మూత పెట్టాలి. చికెన్ పూర్తిగా ఉడికాక చింతచిగురు వేసి బాగా కలపాలి. ఇప్పుడు స్టావ్ సిమ్‌లో పెట్టి మధ్య మధ్య కలుపుతూ ఉంటే కాసేపటికి కూర పొడిపొడిగా అవుతుంది. అప్పుడు దింపేయాలి.

# సాష్టాంగ నమస్కారం

దేవాలయానికి వెళ్లిన భక్తుల్లో కొందరు దైవానికి ఎదురుగా సాష్టాంగ నమస్కారం చేస్తుంటారు. దైవానికి ఎదురుగా చేతులు సాచి దేహాన్ని పూర్తిగా నేలకి తాకిస్తూ సాష్టాంగ నమస్కారం చేస్తుంటారు. అయితే సాష్టాంగ నమస్కారం ధ్వజ స్థంభం దగ్గరే చేయాలనే నియమమొకటి ఆధ్యాత్మిక గ్రంథాల్లో కనిప స్తుంది. సాష్టాంగ నమస్కారం ధ్వజ స్థంభం దగ్గర చేయడం వలన, ఆ నమస్కారం తప్పకుండా ప్రధాన దైవానికి చేరుతుంది. అంతే కాకుండా సాష్టాంగ నమస్కారం కోసం బోర్లా పడుకున్న ప్పుడు కాళ్ల భాగం దిశలో ఎలాంటి దేవతా మూర్తులు వుండవు. ఆలయంలోని ముఖ మంటపంలో సాష్టాంగ నమస్కారం చేసినప్పుడు. కాళ్లు .. ఆ దైవం వాహనం వైపుకు వస్తాయి. కొన్ని ఆలయాల్లో ముఖ మంటపంలో సాష్టాంగ నమస్కారం చేసినప్పుడు కాళ్లు ఉపాలయాల వైపు ఉం టాయి. అందువల్లనే ఎలాంటి దైవ సంబంధ మైన వాహనాల వైపు.. ఉపాలయాల వైపు కాళ్లు పెట్టకుండా ఉండటం కోసం, ధ్వజ స్థంభం దగ్గర నిర్దేశించిన ప్రదేశంలోనే సాష్టాంగ నమస్కారం చేయవలసి ఉంటుంది.

# 'కొరియన్ కనకరాజు' 'రాసా గుమ్మాడి' సాంగ్ లాంచ్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరికొత్త చిత్రం 'కొరియన్ కనకరాజు'తో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రానున్న ఈ హారర్‌కామెడీ సినిమాని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ మూవీ పోస్ట్‌ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ప్రస్తుతం ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ రాసా గుమ్మాడి వచ్చేసింది. ఈ పాటను అనంతపురంలోఎస్. థమన్ స్వరపరిచిన ఈ ఎనర్జిటిక్ ఫోక్ సాంగ్ అదిరిపోయింది. అభిమానుల సమక్షంలో విడుదల చేశారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మాట్లాడుతూ.. 'కొరియన్ కనకరాజు' చిత్రీకరణ అనంత పూర్‌లోనే జరిగింది. అందుకే ఈ పాటను ఇక్కడే రిలీజ్ చేయా లని అనుకున్నాం. అభిమానుల సమక్షంలో ఇలా పాటను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. మేర్లపాక గాంధీ మాట్లాడుతూ.. 'కొరియన్ కనకరాజు'లో మాస్‌కి నచ్చే ఎలిమెంట్స్ అన్నీ ఉన్నాయి. ఈ పాటను అనంతపూర్‌లో రిలీజ్ చేయాలని వరుణ్ చెప్పారు. ఇక్కడి బ్యాక్ డ్రాప్‌తోనే ఈ మూవీ ని చేస్తున్నాం. డబ్బింగ్ అద్భుతంగా జరుగుతోంది. నిర్మాత రాజీవ్‌రెడ్డి మాట్లా డుతూ.. .. వరుణ్‌తో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. మా 'కొరియన్ కనకరాజు' 'రాసా గుమ్మాడి' సాంగ్ లాంచ్‌కొరియన్ కనక రాజుకి థమన్ సంగీతం బిగ్గెస్ట్ అస్సెట్ అవు తారు. మా చిత్రం ఆగస్ట్ 7న రాబో తోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి అని అన్నారు.

# నభా నటేష్ స్టన్నింగ్ లుక్..

కారమెల్ టోన్స్‌లో క్లాసీ వైబ్! టాలీవుడ్ 'ఇస్మార్ట్ బ్యూటీ' నభా నటేష్ తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన




సాంప్రదాయ ఫోటో షూట్ పిక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది.టాలీవుడ్ 'ఇస్మార్ట్ బ్యూటీ' నభా నటేష్ తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సాంప్రదాయ ఫోటో షూట్ పిక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. రిచ్ మెరూన్ ఆరెంజ్ కాంబినేషన్ సిల్క్ శారీలో ఆమె దేవకన్యలా మెరిసిపోయింది. "కారామెల్ టోన్స్‌లో చుట్టేసి ఉంది" అంటూ ఆమె ఇచ్చిన క్యాప్షన్, ఆ ఫోటోలలోని ఆమె రాయల్ లుక్ ఇప్పుడు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. మోడ్రన్ టచ్‌తో కూడిన ఈ సౌత్ ఇండియన్ ట్రెడిషనల్ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతోంది. ప్రేక్షకుల అభిరుచి! డిజైనర్ శారీలో కారమెల్ బ్యూటీ: ఈ లేటెస్ట్ ఫోటో షూట్ కోసం నభా నటేష్ ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అర్చన కార్తీక్ డిజైన్ చేసిన సంప్రదాయ పట్టు చీరను ఎంచుకుంది. మెరూన్, ఆరెంజ్ రంగుల కలయికతో ఉన్న ఈ సిల్క్ శారీకి మ్యాచింగ్‌గా ఎంతో అందంగా ఎంబ్రాయిడరీ చేసిన బ్లౌజ్‌ను ధరించింది. ఇక ఫ్యాషన్ స్టైలిస్ట్ నిహా వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్టైలింగ్ నభా అందాన్ని సరికొత్తగా ఎలివేట్ చేసింది. ట్రెడిషనల్ వేర్ అయినా సరే, తనదైన గ్రేస్ అండ్ స్టైల్‌తో కారామెల్ వైబ్స్ ఇస్తూ అందరి చూపు తనవైపే తిప్పుకుంది.నిండుతనానికి కేరాఫ్ అడ్రస్.. ఎక్స్‌క్లూజివ్ జ్యువెలరీ: ఈ రాయల్ లుక్‌ను పర్‌ఫెక్ట్‌గా కంప్లీట్ చేయడం కోసం నభా ఎంచుకున్న జ్యువెలరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఖిది జ్యువెల్ గ్యాలరీఖి నుండి సేకరించిన హెవీ నెక్ సెట్, సాంప్రదాయ చెవి కమ్మలు ఆమె ముఖంలో సరికొత్త కాంతిని తీసుకొచ్చాయి. ఇక క్లాసిక్ మేకప్, నుదుటన చిన్న బొట్టు, కళ్లకు కాటుకతో అచ్చమైన తెలుగుదనానికి నిదర్శనంగా నిలిచింది. మోడ్రన్ లుక్స్‌లోనే కాదు ట్రెడిషనల్ అవుట్‌ఫిట్స్‌లోనూ తను ఎల్లప్పుడూ తోపే అని ఈ ఫోటోలతో నభా మరోసారి నిరూపించింది. క్రేజీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్న ఇస్మార్ట్ పాప.

# CULT సాంగ్ 'హీ ఈజ్ మై దోస్తీ' రిలీజ్




మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ మరోసారి ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. తన కెరీర్‌లో ఎప్పటికప్పుడు విభిన్న కథలతో ముందుకొచ్చే ఆయన ఇప్పుడు CULTతో పూర్తిగా కొత్త జానర్‌లో రాబోతున్నారు. విశ్వక్‌సేన్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన ఈ చిత్రాన్ని సందీప్ కాకరాల తారక్ సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఆ ఆసక్తిని మరింత పెంచుతూ తాజాగా చిత్ర బృందం తొలి పాట 'హీ ఈజ్ మై దోస్తీ' ని విడుదల చేసింది. పాట ప్రారంభంలోనే స్నేహం అంటే ఏమిటో విశ్వక్‌సేన్ తనదైన శైలిలో వివరిస్తారు. తమ జీవితంలో తొలిసారిగా గోవా ట్రిప్‌కు వెళ్లిన స్నేహితుల బృందం అక్కడి నైట్‌లైఫ్, విదేశీ పర్యాటకులు, ఫ్రీ లైఫ్ స్టైల్ ఆస్వాదించే సన్నివేశాలు ఉత్సా హ భరితంగా కనిపిస్తాయి.సంగీత దర్శకుడు రవి బస్రూర్ ఎనర్జిటిక్ ట్యూన్ ఆకట్టుకోగా, సంతోష్ వెంకీ రాసిన సాహిత్యం స్నేహంలో ఆప్యాయతను, అనుబంధాన్నిఅందించిన చక్కగా ప్రజెంట్ చేసింది. ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ, అయ్యంగార్, కార్తికేయ, అనిరుధ్ భాస్కర్, ఈజీ, యజ్ఞ తుర్లపాటి, కబీర్ భార్టియా, విశాక్ నాయర్, చేపూరి వివేక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# సెప్టెంబర్ 10న 'మండాడి' రిలీజ్



ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ మీద మతిమారన్ పుగళేంది తెరకెక్కిస్తున్న చిత్రం 'మండాడి'. ఈ మూవీని ఎల్రెడ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సుహాస్, సూరి ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ మూవీ నుంచి వచ్చిన కంటెంట్ అందరినీ మెప్పించింది. సుహాస్, సూరి పాత్రలు, ఆ కారెక్టర్స్ మేకోవర్ అదిరిపోయింది. 'మండాడి' మూవీని సెప్టెంబర్ 10న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్న సంగతి తెలిసిందే. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో సినిమా విడుదల కానుంది. ఇక ఈ సినిమాని తెలుగులో మైత్రి మూవీస్ రిలీజ్ చేయబోతోంది. ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్‌ఎల్‌పి భారీ ఎత్తున విడుదల చేయనుంది.ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించారు. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు ఇతర కీలక పాత్రలను పోషించారు. ఈ సినిమాకి సంగీతాన్ని జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా, ఎస్.ఆర్. కథిర్ సినిమాటోగ్రఫర్‌గా పని చేశారు. ప్రొడక్షన్ డిజైన్‌ను డి.ఆర్.కె. కిరణ్, ఎడిటింగ్‌ను ప్రదీప్ ఇ. రాఘవ్, యాక్షన్ సన్నివేశాలకు పీటర్ హెయిన్, దిలీప్ సుబ్బురాయన్, మహేష్ మాథ్యూ కంపోజ్ చేశారు.

# M4M-2 సీక్వెల్ విడుదల



శాన్‌ఫ్రాన్సిస్కో (కాలిఫోర్నియా): అమెరికాలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సైకాలజికల్ థ్రిల్లర్ M4M-2 (మోటివ్ ఫర్ మర్డర్) మూవీ 60 రోజుల విజయోత్సవాన్ని జూలై 18, 2026న శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలోని సినీ లౌంజ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో దర్శకనిర్మాత మోహన్ వడ్లపట్ల, హీరోయిన్ Jo Sharma కలిసి M4M-2 సీక్వెల్‌ను అధికారికంగా ప్రకటించారు.ఈ కార్యక్రమానికి M4M-2 అభిమానులు, కమ్యూనిటీ నాయకులు, సినీ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, విశిష్ట అతిథులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కేక్ కట్ చేసి చిత్ర విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన దర్శకనిర్మాత Mohan Vadlapatla, M4M విజయానికి ప్రేక్షకుల అపారమైన ఆదరణే ప్రధాన కారణమని అన్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, మీడియా అందించిన సహకారం లేకుండా ఈ విజయాన్ని సాధించడం సాధ్యమయ్యేది కాదని పేర్కొన్నారు. మొదటి భాగంలో తన నటనతో ప్రశంసలు అందుకున్న ఈచిత్ర హీరోయిన్ Jo Sharma మాట్లాడుతూ, ప్రేక్షకులు చూపించిన ఆదరణకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సీక్వెల్‌లో మరింత శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నానని, ప్రేక్షకులకు మరోసారి థ్రిల్లింగ్ సినీ అనుభూతిని అందించేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు.

# 'మిస్టర్ మిడిల్ క్లాస్' : సక్సెస్ మీట్



శ్రీకాంత్, లయ హీరో హీరోయిన్స్‌గా హెచ్‌ఆర్‌ఆర్ నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు జి. నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన లేటెస్ట్ ఫన్ హిట్ 'మిస్టర్ మిడిల్ క్లాస్. సక్సెస్ మీట్ లో హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈ సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు. సరదాగా థియేటర్‌కు వెళ్లి ప్రేక్షకుల మధ్య సినిమా చూసి ఇంతగా ఎంజాయ్ చేసి చాలా సంవత్స రాలు అయింది. త్వరలో మరో సక్సెస్ మీట్ కూడా నిర్వహిస్తాం. దర్శకుడు జి. నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... సినిమా చాలా బాగుంది. ఎవరూ మిస్ అవ్వకండి. ఈరోజు కలెక్షన్స్ చూసి మాకు చాలా ఆనందంగా అనిపించింది. నిర్మాత చందు మాట్లాడుతూ... ఈ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఇంకా చూడని ప్రేక్షకులు తప్పకుండా థియేటర్లకు వెళ్లి సినిమా చూడాలని కోరుకుంటున్నాను.సంగీత దర్శకుడు సాయి కార్తీక్ మాట్లాడుతూ... ఈ సినిమాను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులం దరికీ ధన్య వాదాలు. సింగిల్ స్క్రీన్స్, మల్టీప్లెక్స్‌లు ఇలా అన్ని చోట్ల నుంచి చాలా మంచి స్పందన వస్తోంది. డీవోపీ అంజి మాట్లా డుతూ... ఈ సినిమా మేము అనుకున్నట్టుగానే అద్భుతమైన హిట్ అయింది. చాలా రోజుల తర్వాత ఇలాంటి సక్సెస్ మీట్‌లో కలుసుకోవడం ఆనందంగా ఉంది. మురళి గౌడ్ మాట్లా డుతూ... మిస్టర్ మిడిల్ క్లాస్ విజయవంతం కావడం చాలా ఆనందంగా ఉంది.

21-7Pg8exHMNWJQE:21-7Pg8exHMNWJQE.qxd 7/21/2026 12:11 AM Page 1



# మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**• కేంద్ర మంత్రి లాలన్ సింగ్‌తో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భేటీ**



**శ్రీకాకుళం, జులై 20 ప్రభాతవార్త:** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, వీరాంజనేయ స్వామి, ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజుతో కూడిన ప్రతినిధి బృందం కేంద్ర మత్స్య, పశుసంవర్థక మరియు పాడి పరిశ్రమల శాఖ మంత్రి లాలన్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, టీడీపీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎన్డీఏ ఎంపీలతో కలిసి ఫిష్ ఫీడ్ ధరలు గణనీయంగా పెరగడంతో ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఫీడ్ ధరలను నియంత్రించడంతో పాటు మత్స్యకారులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.

ప్రతినిధి బృందం విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి లాలన్ సింగ్, ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులపై ఫీడ్ వ్యయ భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రపంచ స్థాయి నాణ్యతతో చేపల ఉత్పత్తులు ఎగుమతి చేస్తూ రాష్ట్రానికీ, దేశానికీ కీర్తి తీసుకొస్తున్న మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి లాలన్ సింగ్‌కు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# తెలుగు భాష, సంస్కృతి వైభవానికి 2 ప్రతిష్టాత్మక ఉత్సవాలు

**• 25-26న ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవం • ఆగస్టు 8-9న అమరావతి చిత్రకళా వీధి**

**• కళాకారులు, రచయితలు భాగస్వాములు కావాలి: రాష్ట్ర సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్**




**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతికి పునర్వైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు. విజయవాడ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య, సంగీత కళాశాలలో సోమవారం విలేకరుల సమావేశంలో ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే సాంస్కృతిక రాజధానిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ దిశగా జులై 25, 26 తేదీలలో ఉండవల్లి గుహల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ తెలుగు మహోత్సవంను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలుగు భాషను కేవలం మాట్లాడే భాషగా కాకుండా, భావితరాలకు వారసత్వంగా అందించే లక్ష్యంతో ఈ మహోత్సవాన్ని రూపొందించినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో సూర్యోదయ సుప్రభాతం, సంగీత కార్యక్రమం, ఆమె మాట – అక్షర బాట, కవి సమ్మేళనాలు, అమ్మమ్మ కథల ముచ్చట్లు నెక్స్ట్ జెన్ తెలుగు యువతతో చర్చలు, నవస్వరం ప్యానెల్ డిస్కషన్లు, తపాలా శాఖ సహకారంతో పూర్తిగా తెలుగులో పోస్టుకార్డులు రాసే వినూత్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 8, 9 తేదీలలో గుంటూరు విద్యానగర్ రింగ్ రోడ్డులో అమరావతి చిత్రకళా వీధి పేరుతో ఓపెన్ ఎయిర్ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది రాజమండ్రిలో 550 మంది కళాకారులతో విజయవంతంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఈసారి 800స్టాల్స్‌తో మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర చిత్రకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు స్వరాష్ట్రంలోనే విశాల వేదిక కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. జులై 26 సాయంత్రం జరిగే తెలుగు మహోత్సవం ముగింపు సభకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు, సాంస్కృతిక సంస్థలు, యువత, ప్రజలందరూ భాగస్వాములై తెలుగు సంస్కృతి పరిరక్షణకు తోడ్పడాలని తేజస్వి పొడపాటి పిలుపునిచ్చారు.

## ప్రైవేటు పారిశ్రామికవాడలలో బలహీనవర్గాలకు భాగస్వామ్యం కల్పించాలి

**రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల్లో బిజెపి వినతిపత్రాల సమర్పణ**

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి వేగవంతం కావడం స్వాగతించదగిన పరిణామమే అయినప్పటికీ, ఆ అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా చేరేలా ప్రభుత్వం విధానపరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్ మాధవ్ కోరారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో బీజేపీ నాయకులు వినతిపత్రాలు సమర్పించినట్లు ఆయన తెలిపారు.ప్రభుత్వం ఇటీవల ఎనిమిది ప్రైవేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు 4,196.55 ఎకరాల భూమిని కేటాయించడం, సుమారు ..1,720.88 కోట్ల పెట్టుబడులతో 1.72 లక్షలకుపైగా ఉపాధి అవకాశాలు కల్పించే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని పి.వి.ఎన్ మాధవ్ పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి కోసం ఇప్పటికే ఉన్న భూములకు అదనంగా మరింత భూసేకరణ చేపట్టాలనే ప్రభుత్వ ఆలోచన కూడా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.ప్రభుత్వం కేటాయిస్తున్న భూములు ప్రజల ఆస్తి కాబట్టి, ఆ భూములపై ఏర్పడే పరిశ్రమల ద్వారా కలిగే ప్రయోజనాలు కూడా అన్ని వర్గాలకు సమానంగా అందేలా ప్రత్యేక విధానాలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బి.సి., ఎస్సీ, ఎస్టీ వర్గాలు పారిశ్రామిక యాజమాన్యం, పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనలో ఇప్పటికీ ఆశించిన స్థాయిలో భాగస్వామ్యం పొందలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మూలధనం కొరత, బ్యాంకు రుణాల లభ్యతలో సమస్యలు, సాంకేతిక పరిజ్ఞానం, భూమి, మార్కెట్ అవకాశాల కొరత వంటి కారణాల వల్ల ఈ వర్గాలు పారిశ్రామిక రంగంలో వెనుకబడి ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్టాండ్‌అప్ ఇండియా, పి.ఎం.ఇ.జి.పి., ఎం.ఎస్.ఎం.ఇ ప్రోత్సాహకాలు, మూలధన సబ్సిడీలు, వడ్డీ రాయితీలు, ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం వంటి పథకాలను మరింత సమర్థంగా అనుసంధానిస్తూ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో సామాజిక భాగస్వామ్యానికి స్పష్టమైన విధానాలు తీసుకురావాలని కోరారు.ప్రతి ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులో బి.సి., ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు,షెడ్లు కేటాయించే ప్రత్యేక విధానం రూపొందించాలని,ప్రభుత్వ రాయితీలు పొందే పార్కులు సామాజిక భాగస్వామ్య లక్ష్యాలు సాధించినప్పుడే పూర్తి ప్రోత్సాహకాలు అందేలా ఒప్పందాల్లో నిబంధనలు చేర్చాలని సూచించారు.

# ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త లక్ష్యం

**• మెప్మా మహిళల వ్యాపారాభివృద్ధిపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తా: మంత్రి నారాయణ**



**నెల్లూరు(కలెక్టరేట్), జులై 20 ప్రభాతవార్త:** ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక మహిళా పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం విస్తృత అవకాశాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మెప్మా అధికారు లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓలు), రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు), మహిళా సంఘాల సభ్యులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మెప్మా మహిళలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపారాల పురోగతి, లావాదేవీలపై ఆరా తీశారు. జీవనోపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు పలు సూచనలు చేశారు. పట్టణ పేదరిక నిర్మూ లనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, లైవ్లీహుడ్ యూనిట్ల ద్వారా మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. వ్యాపారాల్లో మహిళలపై ఒత్తిడి తగ్గించేలా ప్రత్యేక ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పాచిపని చేసుకునే మహిళ కూడా నేడు పారిశ్రామికవేత్తగా ఎదిగి కోట్ల రూపాయల టర్నోవర్ సాధిస్తోందని పేర్కొంటూ, మెప్మా మహిళలందరూ అలాంటి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వ్యాపారాల్లో రాజకీయాలను చొప్పించవద్దని, రిసోర్స్ పర్సన్లు నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా పనిచేయాలని సూచించారు. చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళలను గుర్తించి ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశించారు. మెప్మా మహిళల్లో అత్యధికులు నిరుపేదలేనని, వారి కష్టాలు తనకు తెలుసని, వారి ఆర్థికాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తూనే ఉంటానన్నారు. వారి పిల్లలకు విద్యనే నిజమైన ఆస్తిగా అందించాలనే ఉద్దేశంతో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 10 వేల సైకిళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మెప్మా మహిళల వ్యాపారాభివృద్ధిపై ప్రతి నెలా సమీక్ష నిర్వహించి, లక్ష్యాల సాధనను పర్యవేక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మెప్మా ఏఎండి వెంకటేశ్వర్లు, పీడీ కిరణ్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు కాలువకు 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలి : ప్రభుత్వ విప్



నీటిపారుదల సలహామండలి సమావేశంలో కలెక్టర్ బాలాజీ, ప్రజాప్రతినిధులు

**గన్నవరం(కృష్ణా), జులై 20 ప్రభాతవార్త:** ప్రస్తుత తీవ్రవర్షాభావ పరిస్థితుల్లో ఏలూరు కాలువ ఆయకట్టు పరిధిలోని పంటలు ఎండిపోతున్నందున కాలువకు పూర్తిసామర్థ్యంతో నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అధికారులను కోరారు. కృష్ణాజిల్లా నీటిపారుదల సలహామండలి సమావేశం సోమవారం మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లాకలెక్టర్ డి.కె.బాలాజీ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో పాల్గొన్న యార్లగడ్డ మాట్లాడుతూ ఏలూరు కాలువ ఆయకట్టులో సింహభాగం గన్నవరం నియోజకవర్గంలోనే ఉందని, ప్రస్తుతం నారుమళ్ళు, నాటిన వరిపైరు నీరులేక ఎండిపోతున్న సంగతిని సమావేశం దృష్టికి తెచ్చారు. ఏలూరు కాలువలో 1650 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు వీలుగా కాలువ నిర్మాణం జరిగిందని, ప్రస్తుతం 800 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేయటం వల్ల పంటకాలువలకు నీరు అందటంలేదన్నారు. గరిష్ట సామర్థ్యంతో నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేసారు. ఒక్క గన్నవరం నియోజకవర్గంలోనే కాకుండా కాలువ చివరి ప్రాంతాలైన ఏలూరు జిల్లాలోని పెదపాడు, ఏలూరు మండలాల్లో సైతం పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని యార్లగడ్డ ఆవేదన వ్యక్తం చేసారు. తక్షణం ఏలూరు కాలువకు కనీసం 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లలో ఎపి గణనీయ వృద్ధి

**• విశాఖలో ఆదాయపు పన్ను శాఖకు నూతన క్వార్టర్లు**

**• ఆదాయపు పన్ను శాఖ (ఎపి అండ్ తెలంగాణ) ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బట్టిని**



**విశాఖపట్నం, జులై 20 ప్రభాతవార్త:** విశాఖపట్నం ఎండాడ, సాగర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన "సాగర్ సమీరం" ఆదాయపు పన్ను శాఖ నివాస సముదాయాన్ని సోమవారం ఆదాయపు పన్ను శాఖ (ఏపీ అండ్ తెలంగాణ) ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బట్టిని ప్రారంభించారు. ఈ నివాస సముదాయంలో 5 టైప్5, 8 టైప్4 క్వార్టర్లను ఉద్యోగుల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో విశాఖ ఆదాయపు పన్ను శాఖ చీఫ్ కమిషనర్ శ్రీనివాస్ దండా, హైదరాబాద్ చీఫ్ కమిషనర్ సునీత బిల్లా, విశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బొట్ట శ్రీనివాస్, కమిషనర్ సరీష్ ఇరుకుల్లా తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బట్టిని మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్–తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎప్పుడూ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విశాఖలో ప్రారంభమైన ఈ నూతన క్వార్టర్లు ఉద్యోగుల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తాయని చెప్పారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతోందని వెల్లడించారు. 202425 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 28.70 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉండగా, రిటర్నుల సంఖ్య 26.98 లక్షలకు చేరిందని తెలిపారు. ప్రత్యక్ష పన్ను వసూళ్లలోనూ రాష్ట్రం గణనీయమైన వృద్ధిని నమోదు చేసిందని అధికారులు వెల్లడించారు. 202627 ఆర్థిక సంవత్సరంలో జులై 17 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో రూ.9,043.54 కోట్ల స్థూల పన్ను వసూళ్లు, రూ.6,607.53 కోట్ల నికర పన్ను వసూళ్లు నమోదయ్యాయని, గత ఏడాదితో పోలిస్తే 17 శాతం వృద్ధి సాధించినట్లు వివరించారు. కార్పొరేట్ పన్ను, ఆదాయపు పన్ను వసూళ్లలోనూ రాష్ట్రం స్థిరమైన పురోగతిని కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు పన్ను సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఆదాయపు పన్ను శాఖ మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

# నేనున్నానంటూ.. బాధితులకు మంత్రి నారాయణ భరోసా

**• యనమలవారి వీధిలో కూలిన పాత ఇంటి స్లాబు • ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసిన రెస్క్యూ బృందం • ఘటనాస్థలాన్ని పరిశీలించిన మంత్రి నారాయణ**



**నెల్లూరు(వైద్యం), జులై 20 ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని 49వ డివిజన్ యనమలవారి వీధిలో సోమవారం 60 ఏళ్ల నాటి పాత ఇంటి స్లాబు ఒక్కసారిగా కూలింది. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని కూలిన ఇంటిని పరిశీలించారు.

బాధితులు, అధికారులు, స్థానికులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూలిన ఇల్లు సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించిందని తెలిపారు. ఆ భవనంలో ఎనిమిది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని చెప్పారు. శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసుకురావడంలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన అగ్నిమాపక శాఖ సిబ్బందిని అభినందించారు. బాధిత ఎనిమిది కుటుంబాలకు టిడ్కో ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఎవరు ఆపదలో ఉన్నా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, బాధితులకు తక్షణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, 48వ డివిజన్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్, కోక్లస్టర్ ఖాదర్ బాషా, క్లస్టర్ కప్పిరి శ్రీనివాసులు, రేవతి, ముజీబ్, గౌస్, మస్తానమ్మ, షబ్బీర్ స్థానిక టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు సంతపేటలో ప్రమాదం

**• పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తతో తప్పిన ప్రమాదం**

**నెల్లూరు(క్రైమ్), జులై 20 ప్రభాతవార్త:** సంతపేటలోని యనమలవారివీధిలో సోమవారం పెనుప్రమాదం తప్పింది. రెండంతస్తుల భవనం మొదటి అంతస్థు వరండా శ్లాబ్ ఒక్కసారిగా కూలిపోవడంతో, కింది భాగంలో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు శిథిలాల మధ్య చిక్కుకున్నారు. అయితే, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తక్షణమే స్పందించి సాహసోపేతంగా వారిని ప్రాణాలతో కాపాడారు. యనమలవారివీధిలోని ఒక రెండంతస్తుల భవనంలో మొత్తం నాలుగు కుటుంబాలు (మొదటి అంతస్థులో రెండు, కింది అంతస్థులో రెండు) నివాసం ఉంటున్నాయి. కింది పోర్షన్‌లో కరిముల్లా, రేష్మ దంపతులు తమ ముగ్గురు కుమార్తెలతో కలిసి జీవిస్తున్నారు. సోమవారం ఉదయం పెద్ద కుమార్తె ఉద్యోగానికి, రెండో కుమార్తె పాఠశాలకు వెళ్లగా దంపతులు తమ చిన్న కుమార్తెతో కలిసి ఇంట్లోనే ఉన్నారు. ఈ క్రమంలో మొదటి అంతస్థ వరండా శ్లాబ్ పెను శబ్దంతో కూలిపోయింది. ఈ ప్రమాదంలో కరిముల్లా దంపతులు, వారి చిన్న కుమార్తె శిథిలాల కింద చిక్కుకుపోయారు.

**సాహసోపేత రెస్క్యూ ఆపరేషన్:** స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భవనం ముందు నుంచి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో, సిబ్బంది వెనుకవైపు ఉన్న కిటికీని తొలగించి అత్యంత సాహసంతో శిథిలాల మధ్య చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా బయటకు వెలికి తీశారు. సమయానికి తగినట్లుగా స్పందించి ప్రాణాపాయం తప్పించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

**అధికారుల పరిశీలన:** ప్రమాదవార్త తెలిసిన వెంటనే ఏఎస్పీ సిహెచ్ సౌజన్య సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. క్షతగాత్రులకు అందిన సహాయక చర్యలపై ఆరా తీశారు. ఈ రక్షణ ఆపరేషన్‌లో సంతపేట ఇన్‌స్పెక్టర్ వై.వి. సోమయ్య, ఏడిఎఫ్ఓ రాజా, ఎస్ఐ బాలకృష్ణ సిబ్బంది అత్యంత చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. ప్రమాదకరంగా మారిన శిథిలావస్థ భవనాలపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



## ప్రభుత్వ ప్రోత్సాహాన్ని విద్యార్థులు వినియోగించుకోండి: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్



పదిలో మెరిసిన విద్యార్థినికి షైనింగ్‌స్టార్ పురస్కారం అందిస్తున్న అతిథులు

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త:** విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, విద్యార్థులకు పలు ప్రోత్సాహకాలు అందిసు ఒదని ప్రభుత్వ ప్రోత్సాహన్ని విద్యార్థులు సది ్వనియోగం చేసుకుని రాణించాలని ఎన్‌టిఆర్ కలెక్టర డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. జిల్లాలో 10 వతరగతి, ఇంటర్‌మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీవిద్యార్థులను సోమవారం విజయవాడ మారిస్‌స్టెల్లా కళాశాల ఆవరణలో జరిగిన ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో సత్కరించారు. ఈసందర్భంగా 10వతరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 135 మందిని, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచిన 40 మంది, విద్యార్థులు రూ.20వేల నగదు బహుమతి, పతకం, సర్టిఫికెట్ అందించి సత్కరించారు. 20సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంక దినకర్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం, అభివృద్ధి కార్పొ ్రేషన్ ఛైర్మన్ పి.ఈశ్వర్, జిలా ్రగంథాలయ సంస్థ ఛైర్మన్ యం.యస్.బేగ్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

**పిజిఆర్ఎస్‌లో అర్జీలు వేగవంతంగా పరిష్కరించాలి:** ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుండీ వస్తున్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. సోమవారం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం

## మహిళపై అత్యాచార యత్నం కేసులో ఇద్దరు ముద్దాయిలకు కఠినకారాగార శిక్ష

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మహిళపై అత్యాచార యత్నం, హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు చిత్తూరు 6వ అదనపు జిల్లా జడ్జి 3 సంవత్సరాల 6 నెలల కఠిన కారాగార శిక్షతో బాటు ఒక్కొక్కరికి 500 రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. తిరుపతి పట్టణం ఎర్రమిట్ట ప్రాంతానికి చెందిన ఆర్. రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై ఆమె కుమార్తె భవాని (24)పై 2017 మేనెలలో సాయంత్రం సమయంలో తిరుపతిలోని రుయా ఆసుపత్రి నుండి ఇస్కాన్ టెంపుల్ వెళ్లే మార్గంలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. కత్తితో బెదిరించి బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఇనుప రాడ్‌తో దాడి చేసి, ఆమెపై లైంగిక దాడికి పాల్పడేందుకు యత్నించినట్లు ఫిర్యాదు నమోదైంది. అప్పటి అలిపిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.మల్లికార్జున రెడ్డి కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేపట్టారు. చార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. అనంతరం ఈ కేసు 348/2017గా చిత్తూరు 6వఅదనపు జిల్లా జడ్జి న్యాయస్థానంలో విచారణకు వచ్చింది. నిందితులు శివజ్యోతి నగర్ అయ్యప్ప కాలనీకి చెందిన ఏ. వెంకటేష్ అనే కుక్కలోడు (31), తిరుపతి కేటీ రోడ్డు సూరయ్యకట్టకు చెందిన టీ. శశికుమార్ అనే కుమార్ రాజా (40) పై నేరం రుజువైనట్లు నిర్ధారించింది. దీంతో ఇద్దరు నిందితులకు 3 సంవత్సరాల 6 నెలల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి 500 రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో రెండు వారాల సాధారణ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.




## డిజిపి ఆనంద్‌తో క్రికెటర్ సిరాజుద్దీన్ భేటీ

**డిజిపికి జెర్సీ బహూకరించిన మియాభాయ్**

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** టీమిండియా క్రికెటర్ మహమ్మద్ సిరాజుద్దీన్ సోమవారం డిజిపి సి.వి. ఆనంద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పోలీసు శాఖలో డిఎస్‌పిగా పనిచేస్తున్న సిరాజుద్దీన్ టీమిండియాలో తన పేరిట వున్న జెర్సీని ఈ సందర్భంగా డిజిపి ఆనంద్‌కు బహుకరించారు. టీమిండియాలో సిరాజుద్దీన్ మరింత ఉన్నతంగా రాణించాలని డిజిపి ఆశాభావం వ్యక్తం చేయ దంతో పాటు సిరాజుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో పోలీసు క్రీడలు, పి అండ్ ఎల్ ఐజి డాక్టర్ గజారావు భూపాల్, డిఎస్‌పి రమణరావు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయి పనిలేదు.. సగం జీతమే ఇవ్వండి!

**విధుల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంది.. యుపి ప్రభుత్వానికి ఓ ఐఎఎస్ లేఖ**



**జలౌన్(యుపి), జులై 20:** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ యువ ఐఎఎస్ అధికారి రాసిన లేఖ తీవ్రచర్చకు దారి తీసింది. తనకు పూర్తిస్థాయిలో పని లేక పోవడంతో సగం జీతమే చెల్లించాలని, లేదంటే నిబంధనల ప్రకారం పనిచేసే అవకాశమున్న చోటుకు బదలీ చేయాలని కోరుతూ రాష్ట్ర నియామక, సిబ్బంది శాఖకు ఐదు పేజీల లేఖ పంపారు. ప్రస్తుతం ఎస్‌డీఎం (జ్యుడీషియల్)గా పని చేస్తున్న 2023 బ్యాచ్ ఐఎఎస్ అధికారి రింకూసింగ్ రాహీ ఈ విజ్ఞప్తి చేశారు. ఇపుడు తన బాధ్య తల్లో రోజుకు నాలుగు గంటల పనిమాత్రమే ఉంటోందని రాహీ లేఖలో పేర్కొన్నారు. అందుకే ఈ పోస్టులోనే కొనసాగిస్తే సగం జీతం చెల్లించినా అభ్యంతరం లేదని తెలిపారు. అదే సమయంలో పరిపాలనా వ్యవహారాల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉందని ఆరోపిస్తూ మంత్రి స్వతంత్రదేవ్‌సింగ్, బీజేపీ ఎమ్మెల్యే గౌరీశంకర్‌వర్మ పేర్లను కూడా ప్రస్తావించారు. జలౌన్‌లో ఎస్‌డీఎంగా పనిచేసే సమయంలో అక్రమ భూకబ్జాలు, ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారాల్లో చర్యలు తీసుకోవద్దని జిల్లా కలెక్టర్ తనకు ఆదేశించారని రాహీ ఆరోపించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే గౌరీ శంకర్‌వర్మ కూడా అక్కడే ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన జనతా దర్శన్ కార్యక్రమం కేవలం పేరుకే జరుగు తోందని, మూల సమస్యలను పరిష్కరించకుండా తాత్కాలిక చర్యలకే పరిమితమవుతోందని విమర్శించారు. నిబంధనల ప్రకారం స్వేచ్ఛగా పని చేసే అవకాశం ఉన్న మరో తహసీల్‌కు లేదా మరో జిల్లాకు బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని రాహీ కోరారు. అది సాధ్యం కాకపోతే మరో రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై పంపాలని కూడా విజ్ఞప్తి చేశారు.